www.visalaandhra.com
స్థాపితం : 1952

# విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం



సంపుటి : 66
సంచిక : 196
శనివారం 06-01-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

## లాలూ శిక్ష నేటికి వాయిదా



రాంచీ : పశు దాణా కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ సహా దోషులకు శిక్ష ఖరారు తీర్పు మరోసారి వాయిదా పడింది. జనవరి 3నే శిక్ష ఖరారు కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల గురువారానికి వాయిదా పడింది. అయితే నిన్న కూడా శిక్ష ఖరారు చేయకుండా వాయిదా వేశారు. శుక్రవారం లాలూకి శిక్ష ఖరారుపై వాదోపవాదాలు ముగిశాయి. తన వయసును, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శిక్షను తగ్గించాలని లాలూ శుక్రవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం జరిగిన ఈ కేసు విచారణకు లాలూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు లాలూకి విధించే శిక్షకు సంబంధించిన తీర్పు వెలువడనుంది. ఈ తీర్పు కూడా శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే జరగనుందని లాలూ తరపు న్యాయవాది చిత్తరంజన్ తెలిపారు. ఈ కేసులో లాలూతో పాటు మరో 15 మందిని దోషులుగా తేలుస్తూ గత నెల 23న రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది.


## పాక్‌కు సైనిక సాయం నిలిపివేత



వాషింగ్టన్ : ఆఫ్ఘనిస్తాన్‌లో తిష్ట వేసుకున్న తాలిబాన్, హక్కానీ తదితర ఉగ్రవాద మూకలకు పాకిస్తాన్ ఆశ్రయమిస్తోందని అమెరికా ఆరోపించింది. తాలిబాన్ తదితర ఉగ్రవాదుల ఏరివేతకు తాము జరిపే ఉగ్రవాద వ్యతిరేక పోరులో కలిసి వస్తున్నట్లుగా నటించిందని పాకిస్తాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దుయ్యబట్టారు. ఇందుకుగాను పాకిస్తాన్‌కు తాము ఇవ్వవలసిన రూ.7,800కోట్ల మిలటరీ సాయాన్ని తక్షణం నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ట్విటర్ ద్వారా మొదటి సారిగా పాకిస్తాన్‌పై ట్రంప్ అక్కసు వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. దీనికి కొనసాగింపుగా అన్నట్లు శుక్రవారం అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హిదర్ నాయిర్ట్ మీడియాకు జారీ చేసిన ఒక ప్రకటనలో మిలటరీ సాయం నిలివివేత గురించి వెల్లడించారు. పాకిస్తాన్ తమను మోసగించిన కారణంగానే ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్, హక్కానీ తదితర ఉగ్రవాద మూకల నిర్మూలన ప్రయత్నం దీర్ఘకాల యుద్ధంగా పరిణమించిందని హిదర్ వివరించారు. అమెరికా ప్రతినిధులు

- మిగతా 2 లో

## కొత్త రూ.10 నోటు వచ్చేసింది



ఢిల్లీ: కొత్త రూ.10 నోట్లను ఆర్బీఐ విడుదల చేసింది. చాక్లెట్ రంగులో మహాత్మా గాంధీ బొమ్మతో పాటు ఒడిశాలోని ప్రముఖ కోణార్క్ ఆలయం డిజైన్ కూడా నోటుపై ముద్రించింది. కొత్త నోట్లు విడుదల చేసినా పాత రూ.10 నోట్లు చెల్లుబాటు అవుతాయని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. పాత నోటులో '10' సంఖ్య మధ్యలో ఉండేది. కానీ ఈ కొత్త నోటులో కుడివైపు కింద భాగంలో ముద్రించారు. గాంధీ బొమ్మను కూడా మధ్యలో ముద్రించారు. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ సంతకం కిందే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తును ముద్రించారు. ఎడమ వైపు ఉండాల్సిన అశోక చక్రను కుడివైపునకు మార్చారు. కొత్త రూ.10 నోట్లు ప్రవేశపెట్టి పదేళ్లు అయిన సందర్భంగా ఎడమవైపు పది సంఖ్యను ముద్రించారు. నోటులో స్వచ్ఛ భారత్ లోగో కూడా కన్పిస్తోంది. ఈ నోటు పరిమాణం 63×123 మిల్లీమీటర్లు ఉంది.



## పోలీసుల అదుపులో కిడ్నీ రాకెట్ నిందితులు

విశాలాంధ్ర-గుంటూరుబ్యూరో /నరసరావుపేట : సంచలనం సృష్టించిన కిడ్నీ ముఠా రాకెట్ కేసులో వెంకటేశ్వర నాయక్‌తోపాటు మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ ఆధార్ కార్డులు, కిడ్నీ మార్పిడిపై పోలీసులు లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం. కిడ్నీ మార్పిడికి అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్‌పై ఒత్తిడి తెచ్చిన కపిలవాయి విజయ్‌కుమార్‌ను కేసు నుంచి తప్పించేందుకు అధికారపార్టీ నేతలు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో కేసుకు రాజకీయ రంగు పులుముకుంది. గుంటూరు జిల్లా నరసరావుపేట కేంద్రంగా జరిగిన కిడ్నీ రాకెట్‌లో పాత్ర ఉన్న అందరినీ అరెస్ట్ చేసేందుకు

- మిగతా 11 లో

# ట్రిపుల్ తలాక్...!



- బాధితురాలికి భరణం : కాంగ్రెస్ మెలిక
- సవరించంలేం : బీజేపీ
- ఉభయసభలూ వాయిదా
- లోక్‌సభలో 12, రాజ్యసభలో 9 బిల్లులు ఓకే

విశాలాంధ్ర - న్యూఢిల్లీ : ముస్లిం మహిళల ఓటు బ్యాంకుపై గంపెడు ఆశతో ట్రిపుల్ తలాక్ బిల్లును పార్లమెంటుకు తీసుకువచ్చిన మోడీ సర్కారుకు నిరాశే మిగిలింది. లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఈ బిల్లును గట్టెక్కించి...పెద్దల సభకు సాగనంపగా... లోపభూయిష్టంగా రూపొందించిన ఈ బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయి. సీపీఐ సహా కొన్ని పార్టీలు బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని పట్టుబట్టగా... చివరి నిమిషంలో ప్రధాన ప్రతిపక్షంతో సర్కారు చేసిన కుమ్మక్కు ప్రయత్నాలు నడవలేదు. కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి గోయెల్, కాంగ్రెస్ సభాపక్ష నేత గులాంనబీ అజాద్‌తో సుమారు నాలుగు గంటలు మంతనాలు జరిపారు. ట్రిపుల్ తలాక్ కేసులో దోషి జైలుకు వెళ్లినప్పుడు అతడి భార్యకు ప్రభుత్వమే భరణం చెల్లించేలా

- మిగతా 2 లో

29 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు | ఫిబ్రవరి 1న బడ్జెట్ 2 లో

# చుక్కెదురు

## గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ నిరాకరణ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్‌కు నాంపల్లి న్యాయస్థానంలో చుక్కెదురైంది. లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. బెయిల్ ఇచ్చేందుకు న్యాయమూర్తి నిరాకరించారు. దాంతో శ్రీనివాస్ జ్యుడీషియల్ కస్టడీలో ఉండాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం నాంపల్లి కోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఒక దశలో పోలీసు వైఖరిపై కోర్టు మండిపడింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అందుకు గడువు కావాలని కోరగా.. సాధ్యం కాదని కోర్టు స్పష్టం చేసింది. కేవలం అరగంట మాత్రమే గడువు ఇస్తున్నట్లు పేర్కొంది. కాగా, శ్రీనివాస్‌ను విచారించి మరింత సమాచారం సేకరించేందుకు వారం రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు వేసిన

- మిగతా 2 లో

# ఆదుకోండి...

- విభజన హామీలను త్వరితగతిన నెరవేర్చండి
- ప్రధానికి టీడీపీ ఎంపీల వినతి
- తగిన న్యాయం చేస్తాం : ప్రధాని మోడీ హామీ



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చి ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పార్లమెంటులో మోడీని ఎంపీలు కలిసి విభజన హామీల అమలుపై చర్చించారు. కేంద్ర మంత్రులు అశోక్‌గజపతి రాజు, సుజనాచౌదరి సహా ఎంపీలు కేశినేని నాని, టీజీ వెంకటేశ్, తోట నరసింహం, గల్లా జయ్‌దేవ్, రవీంద్రబాబు, సీతారామలక్ష్మి, మాల్యాద్రి, మాగంటి బాబు, సీఎం రమేష్, కొత్తపల్లి గీత మోడీకి లేఖను అందజేశారు. విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ రైల్వే జోన్, ఇతర పెండింగ్ అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. నవ్యాంధ్రను ఆదుకోవాలని అభ్యర్థించారు. విభజన హామీల అమలుకు కేంద్రం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీలు ప్రధానికి విన్నవించారు. దీనిపై మోడీ స్పందిస్తూ ఏపీకి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర మంత్రి సుజనా చౌదరి మీడియాతో మాట్లాడుతూ విభజన చట్టం అమలు విషయంలో జరుగుతున్న జాప్యంపై చర్చించామని, తమ సమస్యపై మోడీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. విభజన హామీలు ఏవి అమలయ్యాయి.. ఏవి పెండింగ్‌లో ఉన్నాయో... వాటన్నింటిని ప్రధానికి వివరించినట్లు చెప్పారు. అధికారులతో మాట్లాడి విభజన హామీల అమలుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని ప్రధాని హామీ ఇచ్చినట్లు సుజనా చౌదరి తెలిపారు.

## రేపు జోశ్యభట్ల భవన్ ప్రారంభం

- గొల్లపూడి 1 సెంటర్ నుంచి భారీ ప్రదర్శన
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు వెల్లడి

- వివరాలు 3 లో

## ఇదీ లోకం!



తుని-నర్సీపట్నం మీదుగా

# కొత్తవలసకు రైల్వే లైన్

- కేంద్రంతో మాట్లాడి తెప్పిస్తా
- ధర్మసాగరం రాష్ట్రానికే ఆదర్శం
- నర్సీపట్నం రోడ్డు వెడల్పునకు ఓకే
- పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల అప్‌గ్రేడ్
- జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-నర్సీపట్నం : ధర్మసాగరం గ్రామం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. శుక్రవారం విశాఖ జిల్లా నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో జన్మభూమి గ్రామసభ జరిగింది. సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ జన్మభూమి

- మిగతా 2 లో

# సండే గెస్ట్ క్లాస్‌లు..

- స్కూళ్లలో ఇంటర్ విద్యార్థులకు బోధన
- కార్పొరేట్ యాజమాన్యం ఎత్తుగడ
- సంక్రాంతి సెలవుల కుదింపునకు యత్నం
- విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలలు కొత్త పోకడలకు తెరలేపాయి. ఆదివారంతోపాటు సెలవు దినాలలో టెన్త్, ఇంటర్ తరగతులను ఇతర క్యాంపస్‌లకు మార్చి తెలివిగా బోధన కొనసాగిస్తున్నాయి. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులు 49 మంది బలవన్మరణాలకు పాల్పడిన సంఘటనలు చర్చానీయాంశమయ్యాయి. ఇందులో నారాయణ, చైతన్య కళాశాలల విద్యార్థులే ఎక్కువగా ఉండటం గమనార్హం. చదువు ఒత్తిడితోనే వారంతా చనిపోయినట్లు ప్రచారముంది. బలవన్మరణాలపై కార్పొరేట్

- మిగతా 2 లో

విశాలాంధ్ర ప్రపంచం

## క్యూబాతో చర్చలు, సహకారానికి ఈయూ హామీ

హవానా : క్యూబాతో కుదుర్చుకున్న రాజకీయ సంప్రదింపులు, సహకార ఒప్పందానికి కట్టుబడి ఉంటామని ఐరోపా కూటమి (ఈయూ) స్పష్టమైన హామీ ఇచ్చింది. ఈయూ విదేశీ వ్యవహారాలు, భద్రత విధాన అత్యున్నతస్థాయి ప్రతినిధి ఫెడరికా మొజిరినీ మాట్లాడుతూ ఈవిషయాన్ని పునరుద్ఘాటించారు. నేషనల్ అసెంబ్లీ ఆఫ్ పీపుల్స్ పవర్(పార్లమెంటు) అధ్యక్షుడు ఎస్టెబన్ లాజోను మొజిరినీ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇరు పక్షాల మధ్యన కుదిరిన ఈఒప్పందం గత నవంబరు నుంచి అమల్లో ఉందని మొజిరినీ చెప్పారు. ఈయూ కూటమే కాక కూటమిలోని పలు భాగస్వామ్య పక్షాలు కూడా ఒప్పందాన్ని ఆమోదించడం వాటి రాజకీయ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కేవలం రాజకీయ సంప్రదింపుల్లోనేకాక, వాణిజ్య సంబంధాల్లో, పెట్టుబడుల్లో, సాంస్కృతిక అనుభవాలను ఇచ్చిపుచ్చుకునే విషయంలోనూ ఈ ఒప్పందం ఇరు పక్షాలకూ శ్రేయోదాకమన్నారు ఈ సందర్భంగా లాజో మాట్లాడుతూ ఒప్పందం అమలు అంత తేలిక కాకున్నా, ముందుకు తీసుకుపోవడానికే ప్రయత్నిస్తామన్నారు. క్యూబా అధికార వర్గాల కథనం ప్రకారం క్యూబా-ఈయూకూటముల మధ్యన సంబంధాలు మెరుగ్గా ఉన్నాయి.

## కాబూల్‌లో ఆత్మాహుతి దాడి

### ఐదుగురు పోలీసులు మృతి 10మందికి గాయాలు

**కాబూల్:** ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్ నగరంలో పోలీసు దుస్తుల్లోని ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు ఈ దుర్ఘటనలో ఐదుగురు పోలీసులు మృతి చెందగా, మరో 10మంది గాయపడ్డారు. చట్ట వ్యతిరేక ఔషధాలు, మద్య రవాణా నిరోధానికి విధులు నిర్వర్తిస్తున్న బలగాలు లక్ష్యంగా ఈదాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. అమెరికా ఎంబసీ, ఇతర విదేశీ కార్యాలకు చేరువలోనే దాడులు జరిగాయన్నారు. ఘటనలో మృతి చెందిన, గాయపడిన వారిని సైనిక వాహనాల్లో తరలించారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పోలీసు అధికార ప్రతినిధి బాసిర్ ముజాహిద్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో బాధితుల సంఖ్య పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. కదలికలను బట్టి ఉగ్రవాదిగా అనుమానించిన దుండగుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించే సమయంలో తనను తను పేల్చేసుకున్నాడన్నారు. కాగా, దాడికి బాధ్యులమని ఎవరూ ప్రకటన చేయలేదు.

## • యుద్ధభీతి విడనాడండి -

# శక్తిమంతంగా ఎదగండి

- సాయుధ బలగాలకు జిన్ పింగ్ ఉద్ఘాటన
- చైనాకు పాక్ సన్నిహితం : గ్లోబల్ టైమ్స్



**బవోడింగ్(హెబీ) :** యుద్ధభయాలను విడనాడాలని, వినూత్న రీతుల్లో శిక్షణ పొందడం ద్వారా శక్తిమంతంగా ఎదగాల్సిన అవసరం ఉందని చైనా అధ్యక్షుడు, సెంట్రల్ మిలటరీ కమిషను ఛైర్మన్ సీ జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ పదాతి దళం శిక్షణ పొందుతున్న సెంట్రల్ థియేటర్ కమాండ్‌ను సందర్శించిన సందర్భంగా జవాన్లను ఉద్దేశించి జిన్‌పింగ్ ఈమేరకు సూచన చేశారు. వివిధ యుద్ధ రీతులతో పాటుగా వారికి సాంకేతిక అంశాల్లోనూ తగిన నైపుణ్యం పాదుకొల్పాలన్నారు. అదునాతన సాంకేతికతనూ అందిపుచ్చుకోవాలన్నారు. సాయుధ బలగాల్లోని అన్ని విభాగాలకూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా సైన్యంలో చేరిన జవాన్లతో ముచ్చటించారు. వివిధ విభాగాల మధ్య సహకారం పెంపొందించుకోవాలన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభల తీర్మానాలను, స్ఫూర్తిని అమలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు సీపీసీ కేంద్ర కమిటీ, మిలటరీ కమిషను జారీ చేసే ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కాగా, దేశ సాయుధ బలగాలతో అధ్యక్షుడు మాట్లాడటమనేది చాల అరుదైన సంఘటనగా అధికార మీడియా వ్యాఖ్యానించింది దేశంలోని వేర్వేరు సైనిక స్థావరాల్లోని బలగాలు జిన్‌పింగ్ ప్రసంగాన్ని ఆలకించేందుకు వారి వారి స్థావరాల్లో సమావేశమైనట్లు మీడియా సమాచారం. ఏదేశంతోనూ యుద్ధానికి కాలుదువ్వే పరిస్థితి చైనాకు లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**బీజింగ్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యతిరేక వ్యాఖ్యల ఫలితంగా చైనాకు పాకిస్తాన్ సన్నిహితమవుతోందని చైనాలోని ప్రముఖ పత్రిక గ్లోబల్ టైమ్స్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్, హక్కానీ ఉగ్రవాద మూకలకు వ్యతిరేకంగా అమెరికా జరిపే పోరులో పాకిస్తాన్ కలిసి రాకపోగా తమను మోసగించినట్లు డొనాల్డ్‌ట్రంప్ ట్విటర్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై పాకిస్తాన్ తీవ్ర ఆగ్రహం వెళ్లగక్కింది. పాకిస్తాన్ మీద శంకలు పెంచుకుంటున్న అమెరికా.. భారత్‌తో సన్నిహితం కావడానికి ప్రయత్నాలు చేస్తోందని సదరు కథనం సాగింది. ట్రంప్ ట్విటర్ ప్రకటన వెలువడిన మరు రోజు పాకిస్తాన్ స్టేట్ బ్యాంక్ స్పందిస్తూ ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక లావాదేవీల్లో యువాన్ (చైనా కరెన్సీ) మార్పిడికి అనుకూలంగా తగిన చర్యలు తీసుకున్నట్లు ప్రకటించింది. యువాన్ వినియోగించేందుకు ప్రజలు,ప్రైవేటు వ్యక్తులు సంపూర్ణ స్వేచ్ఛను కలిగి ఉన్నారనీ హామీ ఇచ్చింది. పాకిస్తాన్ స్టేట్ బ్యాంకు ఈ విధమైన ప్రకటన జారీ చేయడం కేవలం విధానపరమైన మార్పు కాదని పత్రిక కథనం అభిప్రాయపడింది. ఆక్రోశిస్తున్న అమెరికా తీసుకునే చర్యలను తట్టుకునేందుకు సకాలంలో తీసుకున్న సానుకూల చర్యగా గ్లోబల్ టైమ్స్ వ్యాఖ్యానించింది. ట్రంప్ ప్రకటన రాజకీయాలకు మించినదని ఉహాన్ శాస్త్ర,సాంకేతిక విశ్వవిద్యాలయంలోని ఫైనాన్స్ అండ్ సెక్యూరిటీస్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డోంగ్ దెంగ్జిన్ వివరించారు. ద్వైపాక్షిక వాణిజ్య, ఆర్థిక లావాదేవీలు నిరాటంకంగా జరుపునేందుకు ఇరు దేశాల(అమెరికా, పాకిస్తాన్)కూ అవకాశం కల్పిస్తామని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి జెంగ్ షువాంగ్ గురువారమే ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ట్రంప్ నిర్ణయానికి నిరసన

- హెచ్1బీ మార్పుతో ఇబ్బందులే
- వృత్తినిపుణులు, నేతల ఆందోళన




**వాషింగ్టన్:** అమెరికాలో విదేశీ ఉద్యోగార్థులు విధిగా పొందాల్సిన హెచ్ 1బీ వీసా విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని కాంగ్రెస్ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పలువురు నేతలు, వృత్తినిపుణులు కూడా నిరసన వ్యక్తం చేస్తున్న వారిలో ఉన్నారు. ఈ వీసా నిబంధన అమల్లోకి వస్తే అమెరికాలో వివిధ స్థాయిల్లో పని చేసే 5,00,000ల నుంచి 7,50,000ల వరకు భారతీయ అమెరికన్ల ఉద్యోగ భద్రతకు ముప్పువాటిల్లుతుంది. అదే సమయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకూ ట్రంప్ ప్రతిపాదన నష్టదాయకమని వృత్తినిపుణులు విశ్లేషిస్తున్నారు. ఉద్యోగాల నియామకాల్లో తొలి ప్రాధాన్యత అమెరికన్లకే ఇవ్వాలన్నది ట్రంప్ ప్రధాన ఉద్దేశంగా ఈ వీసా సవరణలకు శ్వేతసౌధం సన్నాహాలు మొదలు పెట్టింది. హెచ్ 1బీ వీసాల సాయంతో అమెరికాలోని వివిధ ఐటీ కంపెనీలు తక్కువ వేతనాలకే ఉద్యోగులను నియమించుకోగలుగుతున్నాయనీ, ఫలితంగా అమెరికాలో అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించ లేక పోతున్నామనేది ట్రంప్ వాదన. ఈవిషయంలో గత కొన్ని నెలలుగా భారతీయ ఐటీ వృత్తి నిపుణులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. హెచ్1బీ వీసా జారీ ప్రక్రియలో ట్రంప్ పాలన యంత్రాంగం చేయదలపెట్టిన మార్పులు తమ భవిష్యత్తును అగమ్య గోచరంగా మార్చేవిగా ఉన్నాయని అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయ వృత్తినిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే.

అమెరికాలో ఐటీ పరిశ్రమ అభివృద్ధికి భారతీయ వృత్తినిపుణులు ఎంతగానో సాయపడ్డారని డెమొక్రాటిక్ నాయకులు తులసీ గుబ్బర్ అన్నారు. తక్కువ వేతనాలతో పని చేసే చిన్న ఉద్యోగులను దూరం చేసుకుంటే అమెరికాలోని ఐటీ సంస్థలకూ అపారనష్టం కలుగుతుందన్నారు. ఎదురుకాగల నిపుణుల కొరతను అధిగమించ లేక రానున్న కాలంలో మౌలికంగా ఐటీ రంగం దెబ్బతినే ప్రమాదమూ లేకపోలేదన్నారు. మరొక నాయకురాలు రేఖన్నా కూడా ఇంచు మించు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా, వీసా సవరణ ప్రతిపాదనలపై ట్రంప్ వైఖరిని అధికార పక్ష సభ్యులూ కొందరు వ్యతిరేకిస్తుండటం గమనార్హం.

## ఉగ్రశక్తులు బలపడతాయి

### ట్రంప్ చర్యలపై పాకిస్తాన్ స్పందన

**ఇస్లామాబాద్:** తమకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, తీసుకున్న చర్యల కారణంగా ఆఫ్ఘనిస్తాన్‌లో ఇస్లామిక్‌స్టేట్ వంటి ఉగ్రవాదశక్తులు బలపడతాయని పాకిస్తాన్ స్పందించింది. కొత్త ఉగ్రవాద మూకలు పుట్టుకొచ్చే అవకాశాలూ లేకపోలేదని తెలిపింది. ఈ ఉగ్రవాద సంస్థలకు వ్యతిరేకంగా తాము జరిపే పోరులో అంతర్జాతీయ సమాజం సహకారాన్ని అర్థిస్తున్నట్లు శుక్రవారం పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి సొంతంగానే నిధులు సమకూర్చుకోగలమని ఆప్రకటనలో తెలిపింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమితంగా లాభపడింది అమెరికానే అనేది సగటు పాకిస్తాన్ పౌరుని అంతరంగంగా ఉన్నట్లు వివరించింది.

## 9న ఉత్తర కొరియా, దక్షిణ కొరియాలు భేటీ

**ప్యాంగ్యాంగ్:** అనుక్షణం ఒకరిపట్ల ఒకరు శుత్రు వైఖరి ప్రదర్శించే ఉత్తర కొరియా, దక్షిణ కొరియాలు త్వరలో భేటీ కానున్నాయి. ఈనెల 9న సమావేశం కావాలని ఇరు దేశాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. చర్చలకు దక్షిణ కొరియా పంపిన ఆహ్వానానికి సానుకూలంగా స్పందించామని ఉత్తర కొరియా తెలిపింది. 2015 డిసెంబరులో చివరిసారిగా ఇరు దేశాలు సమావేశమైనాయి. ఆ తరువాత ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిల వైరం పెరిగింది.

## జాదవ్ కిడ్నాపర్ల గుర్తింపు



**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్ సైనికులకు, పలు ఉగ్రవాద సంస్థలకూ మధ్య సన్నిహిత సంబంధాలున్న సంగతి తెలిసిందే. ఇలాంటి బాపతు ఉగ్రవాద సంస్థ -జైషే ఉలదిల్‌కు చెందిన ముష్కరమూకలు భారత మాజీ నావికాదళ అధికారి కులభూషణ్ జాదవ్‌ను కిడ్నాప్ చేసినట్లు భారత్ భద్రత బలగాలు గుర్తించాయి. ఇరాన్‌లోని చాబహార్ రేవుకు సుమారు 50కి.మీ. దూరంలోని సర్బాజ్ పట్టణంలో జాదవ్‌ను ఉగ్రవాద సంస్థకు చెందిన ముల్లా ఒమర్ ఇరానీ అనే వ్యక్తి అపహరించినట్లు బలగాల దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. అలా అపహరించిన జాదవ్‌ను నేరుగా పాకిస్తాన్ సైన్యానికి అప్పగించారు. ప్రస్తుతం పాకిస్తాన్ జైలు నిర్బంధంలో జాదవ్ ఉన్న సంగతి తెలిసిందే.

## ట్రిపుల్ తలాక్...!

(మొదటిపేజీ తరువాయి)

బిల్లులో చేర్చాలని కాంగ్రెస్ మెలిక పెట్టింది. సమయాభావం వల్ల ఈ డిమాండును నెరవేర్చలేమని మంత్రులు చేతులెత్తేశారు. అంతకముందు కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ఈ బిల్లును అడ్డుకోవద్దని కాంగ్రెస్‌ను వేడుకున్నారు. ఆరుమాసాల్లోగా ట్రిపుల్ తలాక్ రద్దు చట్టాన్ని తీసుకురావాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని...ఈ డెడ్‌లైన్ ఫిబ్రవరి 22తో ముగుస్తుందని, ఇప్పుడు బిల్లు పాస్ కాకపోతే సుప్రీంకోర్టులో మాట వస్తుందని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే... ప్రభుత్వం ఈ బిల్లుకు ఓటింగ్ జరిపితే అడ్డుకోవటానికి కాంగ్రెస్ పార్టీ తమ సభ్యులకు విప్ జారీ చేసింది. సభ్యులందరూ సభలో ఉండాలని ఆదేశించింది. దీంతో సర్కారు పప్పులు ఉడకలేదు. ఈ స్థితిలో ఉభయసభలూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. దీంతో పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిశాయి. శుక్రవారం ఉదయం ప్రశ్నోత్తరాల తరువాత స్పీకర్ సుమిత్రా మహాజన్ లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఆ తర్వాత రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ వెంకయ్యనాయుడు తెలిపారు. చైర్మన్ వెంకయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఓ రాజకీయ కేంద్రమే కానీ, ఇక్కడ రాజకీయాలు ఉండవన్నారు. శీతాకాల సమావేశాల్లో రాజ్యసభలో జరిగిన కార్యక్రమాల గురించి ఆయన కొన్ని అంశాలను వెల్లడించారు. మొత్తం ఈసారి రాజ్యసభలో తొమ్మిది ప్రభుత్వ బిల్లులు పాసైనట్లు తెలిపారు. 19 ప్రైవేటు సభ్యుల బిల్లులను ప్రవేశపెట్టారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ కల్పన అంశాలపై ఫలప్రదమైన చర్చ జరిగిందన్నారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ మాట్లాడుతూ సభా సజావుగా నిర్వహించేందుకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని మోడీ, అధికార పక్ష సభ్యులు, విపక్ష సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

### 29 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

# ఫిబ్రవరి 1న బడ్జెట్

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 29 నుంచి ప్రారంభం కానున్నాయి. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1 న లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని పార్లమెంటరీ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ సిఫార్సు చేసింది. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు బడ్జెట్ మొదటి దశ సమావేశాలు, మార్చి 5 నుంచి ఏప్రిల్ 6 వరకు రెండవ దశ సమావేశాలు జరగనున్నాయని అధికారిక వర్గాలు ప్రకటించాయి.

రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి జనవరి 29న ప్రసంగిస్తారు. అదే రోజున ఆర్థిక సర్వేను సభలో ప్రవేశపెడతారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌మార్ విలేకర్లకు చెప్పారు. ఇక్కడ సమావేశమైన సీసీపీఏ పార్లమెంట్ స్థమావేశాల తేదీలను సిఫార్సు చేసింది. కాగా రాజకీయంగా విపరీతమైన వేడిని పుట్టించిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు గందరగోళం నడుమ ఉభయసభలూ నిరవధికంగా వాయిదాపడ్డాయి.

## చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్‌ను న్యాయస్థానం గురువారం తిరస్కరించిన విషయం తెలిసిందే. ఓ యువతిని లైంగికంగా వేధించినట్టు ఈ నెల 2న పక్కా ఆధారాలతో శ్రీనివాస్‌ను పంజాగుట్ట పోలీసులు అరెస్టుచేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం విదితమే. శుక్రవారం ఇరు పక్షాల వాదనలు సాగాయి. 354 సెక్షన్ వర్తించదని, అందుచేత గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది కోరారు. 354 సెక్షన్ వర్తించనప్పుడు గజల్ శ్రీనివాస్‌ను ఏ రకంగా జైల్లో ఉంచుతారని, రేపు ఆయన నిర్దోషిగా బయటపడిన తర్వాత గజల్ జైల్లో గడిపిన నష్టాన్ని ఏ విధంగా పూరిస్తారని న్యాయవాది ప్రశ్నించారు. స్టింగ్ ఆపరేషన్‌తో కుట్రపూరితంగా ఎలా కేసు పెడతారని ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటికే శ్రీనివాస్‌ను విచారించారని, అన్ని విషయాలు శ్రీనివాస్ పోలీసులకు చెప్పేశారని, ఇంకా ఈ కేసులో ఆధారాలు సేకరించాల్సిన అవసరం ఏముందన్నారు. నిన్నటి విచారణ సందర్భంగా పోలీసు కస్టడీకి కూడా కోర్టు నిరాకరించినందున వెంటనే శ్రీనివాస్‌కు బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. దీనికి సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి చెప్పగా అందుకు రేపటి వరకు గడువు కావాలని పోలీసులు కోరారు.

పోలీసు విజ్ఞప్తిని న్యాయమూర్తి తిరస్కరించారు. సమాజంలో పేరున్న వ్యక్తి గనక బెయిల్ మంజూరుచేస్తే సాక్ష్యాలను తారుమారుచేసే అవకాశం ఉన్నందున శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. గజల్‌కు బెయిల్ వస్తే సాక్షులను ప్రభావితం చేస్తాడని పేర్కొన్నారు. సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తి కాబట్టి బాధితురాలి 164 స్టేట్‌మెంట్ రికార్డ్ చేయాల్సి ఉందని, బాధితులు కూడా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇంకా కొంతమందిని విచారించేవరకు గజల్‌కు బెయిల్ ఇవ్వరాదని పీపీ వాదించారు.

## కొత్తవలసకు రైల్వే లైన్

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలను చాలా వరకు పరిష్కరించామన్నారు. ఐదవ విడత జన్మభూమిలో ఫిర్యాదులు తగ్గినట్లు చెప్పారు. నర్సీపట్నం రోడ్డు వెడల్పు విషయమై ఆర్‌అండ్‌బీ మంత్రి అయ్యన్నపాత్రుడు అడిగారని, తప్పకుండా చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాక తుని నుండి నర్సీపట్నం మీదుగా కొత్తవలసకు రైల్వే లైన్ కూడా ఇప్పటికే కేంద్ర బృందం సర్వే జరిగిందని, తప్పకుండా కేంద్రంతో మాట్లాడి రైల్వే లైన్ తెప్పిస్తానన్నారు. పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాలను ఇంటర్ మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తానన్నారు. సాధికారమిత్ర మహిళలు ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలను తీసుకువెళ్లాలని ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండాలని కోరారు.

**ఆహ్లాదకరం ధర్మసాగరం**

ధర్మసాగరం ఎంతో ఆహ్లాదంగా ఉందని సీఎం కితాబిచ్చారు. బహిరంగ సభకు ముందుగా నర్సీపట్నంలోగల ధర్మసాగరం గ్రామాన్ని కలియచూశారు. గ్రామం అంటే ఇలానే ఉండాలని తనకు ఇక్కడే ఉండి పోవాలని అనిపిస్తోందన్నారు. చక్కని మర్రిచెట్టు కింద రచ్చబండ పక్కనే రావిచెట్టు, ఊరంతా చెట్లు ఆటస్థలాలు పల్లె వైభవాన్ని చాటి చెబుతున్నాయన్నారు. ఎల్‌ఈడీ దీపాలు, రోడ్లు, కాలువలు, ఇంకుడు గుంతలు, చెత్త, పశువుల పేడ నిర్వహణ, సుఖసంతోషాలతో ఉన్న ప్రజలు, ఆటపాటలతో బాల బాలికలు సంక్రాంతి పండుగ అంతా ఇక్కడే కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలోని పల్లెలన్నీ ఇలానే రూపొందాలని, తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రతిపల్లె ధర్మసాగరంలా అభివృద్ధి చెందాలని తెలిపారు. గ్రామాన్ని దత్తత తీసుకున్న మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ గ్రామం ఇప్పటికే ఆరు స్టార్లు సాధించిందని, మరో 4 స్టార్లు సాధించాలని చెప్పారు. అంతకుముందు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌లో చిన్నపిల్లలకు అన్నప్రాసనలు, బాలింతలకు సీమంతాలు ముఖ్యమంత్రి దగ్గరుండి జరిపారు. పౌష్టికాహారాన్ని పరిశీలించి, పొయ్యి వెలిగించి పాలు పొంగించారు. విద్యార్థులు వేసిన ప్రముఖుల వేషాలను ఆసక్తిగా తిలకించారు. భరతమాతను పట్టుకుని కొన్ని అడుగులు ముందుకు వేశారు.

ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్, మంత్రి అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి చింతకాయల పద్మ, జెడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీ భాస్కర్, చింతకాయల విజయ్, ఎంపీపీ సుకల రమణమ్మ, సర్పంచ్ ఎస్.సత్యవతి పాల్గొన్నారు. కాగా ముఖ్యమంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

# రోడ్డెక్కి రాజకీయం చేస్తారా?

- చేసేదాక ఆగలేరా..!
- మత్స్యకారులపై సీఎం ఆగ్రహం

**విశాలాంధ్ర-విశాఖ :** రోడ్లెక్కి రాజకీయం చేస్తే భయపడతాననుకున్నారా.. నేను చేసేదాకా ఆగలేరా.. తమాషాలు చేస్తున్నారా.. అంటూ మత్స్యకార నాయకులపై ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. జిల్లా పర్యటనకు వచ్చిన సీఎంని విశాఖలోని పోర్టు గెస్ట్‌హౌస్‌లో మత్స్యకార నాయకులు కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. తమ డిమాండ్ల సాధనకు రిలే నిరాహారదీక్ష చేస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి గంటా శ్రీనివాసరావుతో పాటు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మత్స్యకార నాయకులు గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు. గెస్ట్‌హౌస్‌లో కింద మత్స్యకారులు వేచి ఉండగా మంత్రి గంటా, ఎమ్మెల్యే వాసుపల్లి పై అంతస్థులో ఉన్న సీఎం వద్దకు వెళ్లారు. అప్పటికే విషయం తెలుసుకున్న చంద్రబాబు వాసుపల్లిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు ఎక్కి రాజకీయం చేయడం ఎందుకని, తాను చేసేదాకా ఆగాలేరా అని రుసరుసలాడారు. అనంతరం కిందకు వచ్చి మత్స్యకారులను కలుసుకున్నారు. తమను ఇంకెక్కడ తిడతారోనని వాసుపల్లి, మంత్రి గంటా ఆయన వెంట రాకుండా దూరంగా ఉండిపోయారు. ఈలోగా మత్స్యకారులు తమ సమస్యలను వివరించేలోపే ముఖ్యమంత్రి చంద్రబాబు వారిపై మండిపడ్డారు. తాము శాంతియుతంగానే ఆందోళన చేస్తున్నామని జాలర్లు చెబుతున్నప్పటికీ పట్టించుకోలేదు. మీరు ఉద్యమాలు చేస్తే ఒక్క సమస్య కూడా పరిష్కారం కాదని, ఏం చేసుకుంటారో చేసుకోండని రుసరుసలాడారు. దీంతో మత్స్యకారులు నివ్వెరపోయారు. తమాషాలు చేస్తున్నారా అంటూ తీవ్ర పదజాలం వాడడం పట్ల జాలర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చూద్దాం, చేస్తాం అని కూడా అనకుండా పరిష్కారం కాదని మాట్లాడడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి దురుసు ప్రవర్తన సరికాదని, ఇంతకాలం తెలుగుదేశంకు ఓట్లు వేసి గెలిపించినందుకు మాకు బాగా బుద్ధిచెప్పారని మత్స్యకారులు విలేకరులతో వాపోయారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎస్టీ సాధన సమితి నాయకుడు, మాజీ కార్పొరేటర్ నీలకంఠం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేపథ్యంలోనే మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలని అడుగుతున్నామన్నారు. ఇది ఎప్పటి నుండో ఉన్న డిమాండ్ అన్నారు. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కూడా తమకు సంఘీభావం తెలిపారని, సీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడంతో తాము సీఎంను కలిశామన్నారు. సంక్రాంతి కానుకగా తమకు ఇచ్చిన హామీని నెరవేరుస్తారని భావించామన్నారు. తమ సమస్యలు వినకుండా తొక్కతీస్తా, తమాషాలు చేస్తున్నారా అంటూ చంద్రబాబునాయుడు విసుగుపడడం దారుణమన్నారు. తమ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. సీఎంను కలిసిన వారిలో కంటుముచ్చు తాతారావు, గరికిన గౌరి, పి.సి.అప్పారావు, జాలాది, టి.శంకర్, మూగి శ్రీరామూర్తి, పైడిపిల్లి రాజశేఖర్ ఉన్నారు.

## సండే గెస్ట్ క్లాస్‌లు..

(మొదటిపేజీ తరువాయి)

కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అభద్రతాభావానికి గురవుతున్నారు. విద్యార్థుల మరణాలపై యువజన, విద్యార్థి సంఘాలు ఉద్యమించి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా ఇంతవరకూ చర్యలు చేపట్టలేదు. అటు కార్పొరేట్ యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న ప్రభుత్వాల వైఖరిని ప్రతిపక్షాలు తూర్పారబట్టినా ఫలితం లేదు. సెలవు దినాల్లో ఇంటర్ తరగతులను, పరీక్షలను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చేసిన ప్రకటించిన విషయం విదితమే. దీంతో కార్పొరేట్ కళాశాలలకు చెందిన టెన్త్ క్యాంపస్‌లలో ఆదివారం, సెలవు దినాల్లో ఇంటర్ వీక్లీ టెస్టులు నిర్వహించడంతోపాటు సిలబస్‌లను గుట్టుచప్పుడుగా బోధిస్తున్నాయి. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ విద్యార్థులను అక్కడ బందీలుగా మారుస్తున్నారు. వారానికి ఒక్క రోజూ సెలవు సైతం ఇవ్వకుండా విద్యార్థులపై చదువు ఒత్తిడిని పెంచుతున్నాయి. విద్యాశాఖాధికారుల దృష్టిలో సెలవు ప్రకటించినట్లు చూపి గుట్టుచప్పుడుగా తరగతులను నిర్వహించడం విమర్శలకు దారితీస్తోంది. సెలవు దినాల్లో ఇతర క్యాంపస్‌లలో వీక్లీ టెస్టుల నిర్వహణతో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో కొన్ని గుర్తింపు లేని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ పరీక్షలను నిర్వహించడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటివరకూ అదనపు స్టడీ అవర్లు నిర్వహిస్తున్న 205 కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. యాజమాన్యంలో ఏ మాత్రం మార్పులేదు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్టడీ అవర్లను నిర్వహించడంపై విమర్శలు నెలకొన్నాయి.

**అనుమతుల్లేకుండా 811 కళాశాలల కొనసాగింపు**

రాష్ట్రంలో అనుమతులు లేకుండా 811 కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలను, హాస్టళ్లను యథాతథంగా కొనసాగిస్తున్నారు. వాటికి విద్యాశాఖాధికారులు నోటీసులు జారీ చేశారు. ఇందులోనూ కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలే ఉన్నాయి. విద్యాశాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరుకు మూడు నెలల క్రితమే 41 ఫిర్యాదులు అందినా ఇంతవరకూ సంబంధిత కళాశాలల యాజమాన్యంపై చర్యలు లేవు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అనుమతిలేని కళాశాలలు, హాస్టళ్లను రద్దు చేస్తామని మంత్రి ప్రకటించారు.ఈయన ప్రకటన ఎంత వరకు అమలవుతుందనేదీ ప్రశ్నార్థకంగా మారింది.

**ఇంటర్ ఫస్టు ఇయర్ గ్రేడింగ్‌తో గుబులు**

2017-18 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఫస్టు ఇయర్ పరీక్షలకు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేశారు. ఏడు గ్రేడ్ల ఆధారంగా ఇంటర్ ఫలితాలను ప్రకటిస్తారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 17 వరకూ ఇంటర్ వార్షిక పరీక్షలు కొనసాగుతాయి.13 జిల్లాల నుంచి 10,48,688 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం-4,96,660. ద్వితీయ సంవత్సరం-4,82,235 మంది ఉన్నారు. మొత్తం 1600 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను జంబ్లింగ్ విధానంలోనే నిర్వహిస్తారు.

**విద్యార్థి సంఘాల ఆగ్రహం**

సెలవు దినాల్లో టెన్త్, ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ యాజమాన్యం వైఖరిపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా వారిలో కదలిక లేదని వాపోతున్నాయి. కార్పొరేట్ కళాశాలల్లో తనిఖీలు చేయాలంటే అధికారులు భయపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఓ మంత్రి, ఆయన బంధువుల కళాశాలలే అధికంగా ఉన్నాయి. తనిఖీలకు వెళ్లిన అధికారులకు మరుసటిరోజు బదిలీల ఉత్తర్వులు వస్తున్నాయి. కార్పొరేట్ యాజమాన్యం ఆగడాలకు అదుపు లేకుండా పోతోంది. సంక్రాంతి సెలవులను సైతం కొన్ని రోజులు కుదించి తరగతులు నిర్వహించాలని యాజమాన్యం భావిస్తున్నట్లు తెలిసింది. ఇంటర్ విద్యార్థులకు ప్రీ-పబ్లిక్, పబ్లిక్ పరీక్షల పేరుతో క్యాంపస్‌లకే వారిని పరిమితం చేసేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం. చదువు పేరుతో విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురిచేస్తున్న కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండు చేస్తున్నాయి.

## చెన్నమనేనికి ఊరట

**హైదరాబాద్:** వేములవాడ ఎమ్మెల్యే , తెరాస నేత చెన్నమనేని రమేష్‌కు హైకోర్టులో తాత్కాలిక వూరట లభించింది.

భారత పౌరసత్వం చెల్లదంటూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ఆరు వారాల పాటు నిలిపివేసింది. పూర్తి వాదనలు వింటామన్న హైకోర్టు.. కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## పాక్‌కు సైనిక సాయం నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

సైనికులు, అధికారుల లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపే దాడుల్లో తమతో సహకరించని ఏదేశంతోనూ భాగస్వామ్యం కొనసాగించజాలమని ఆమె తెలిపారు. 2011, సెప్టెంబరు 11న అమెరికాపై ఉగ్రవాదులు దాడులు జరిపిన తరువాత ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక పోరులో పాకిస్తాన్‌ను కీలక భాగస్వామిగా పరిగణించినప్పటికీ ఆశించిన మేర ఫలితాలను సాధించలేకపోయామనే భావన అమెరికా మాటల్లో వెల్లడైంది. ఆఫ్ఘనిస్తాన్‌లో యుద్ధం, ఇఘ భద్రత, నిఘా సహకారం వంటి విషయాల్లో అమెరికా-పాకిస్తాన్ దేశాల మధ్య సంబంధాలు బెడిసి కొడుతున్నదానికి ఈ మిలటరీ సాయం నిలిపివేత సంకేతమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు

## చంద్రబాబుపై స్పీకర్‌కు ఎంపీ అవినాష్ రెడ్డి ఫిర్యాదు



న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : పులివెందులలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో తనకు అవమానం జరిగిందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ అవినాష్ రెడ్డి శుక్రవారం న్యూఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన చేతిలోని మైకు లాక్కునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఒక రౌడీ షీటర్ వేదికపై ఉండటమే కాకుండా తన మైకు లాక్కుని దౌర్జన్యానికి దిగారని పేర్కొన్నారు. కోట్ల రుపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వ సభలో వందల సంఖ్యలో టిడిపి నేతలు ఎలా ఉన్నారని ప్రశ్నించారు. ప్రోటోకాల్ ఉల్లంఘనతో పాటు ఒక పార్లమెంటు సభ్యుడినే అవమానించారని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి దిన పత్రిల్లో ప్రచురితమైన పేపర్ క్లిప్పింగ్‌లను స్పీకర్‌కు పంపారు. తన గౌరవానికి భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్ అవినాష్ రెడ్డి కోరారు.

## పోలవరం కాఫర్ డ్యామ్‌కు పాండ్యన్ కమిటీ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ- విశాలాంధ్ర బ్యూరో : పోలవరం కాఫర్ డ్యామ్ నిర్మాణానికి ఏబీ పాండ్యన్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పోలవరం కాఫర్ డ్యామ్ నిర్మాణం డిజైన్ రివ్యూ కమిటీ సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో గతంలో కేంద్ర జలవనరుల శాఖ ఈ డ్యామ్ విషయంలో నిలిపివేయమని తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. వీటిన్నింటిపై కూలంకుషంగా చర్చించిన తర్వాత ఏబీ పాండ్యన్ కమిటీ కాఫర్ డ్యామ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో కాఫర్ డ్యామ్ నిర్మాణానికి కెల్లర్ సంస్థ సిద్ధమైంది. ఎగువ కాఫర్ డ్యామ్ పనులు ఆపాలని అప్పటి కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి ఏపీ సర్కారుకు లేఖ రాసింది. దీనిపై ఏపీ జలవనరుల శాఖ అధికారులు తమ వాదనలు వినిపించారు. వాదనల నేపథ్యంలోనే కాఫర్ డ్యామ్ నిర్మాణానికి కేంద్రం నియమించిన పాండ్యన్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిలిపివేసిన రూ.1395కోట్ల టెండర్లను కొనసాగించుకోవటానికి కేంద్రం అంగీకరించింది. దీంతో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాన అడ్డంకులు తొలగిపోవటంతో నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర సర్కారు భావిస్తోంది.

## నక్కలదిన్నె సందర్శించి దళితులకు భరోసా ఇవ్వండి

### సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : దళితుల్ని సాంఘికంగా వెలివేసిన కర్నూలు జిల్లా, రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామాన్ని జన్మభూమి సందర్భంగా సందర్శించి వారికి భరోసా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ రాశారు. తమ పార్టీ నాయకులు భీమ లింగప్ప, బాబాఫక్రుద్దీన్, గురుదాస్ తదితరుల బృందం తాజాగా నక్కలదిన్నె గ్రామాన్ని సందర్శించిందని తెలిపారు. గ్రామంలోని దళితులపట్ల ఇప్పటికీ వివక్ష కొనసాగుతున్నది. దళితులెవ్వరినీ వ్యవసాయ కూలి పనులకు గ్రామంలోని రైతులు పిలవడం లేదు. దళితులు అగ్ర కులాల వారికి వెట్టి పనులు చేయడానికి నిరాకరించినందువల్ల వారికి కరెంటు, మంచినీటి సౌకర్యం లేకుండా చేశారు. అలాగే గ్రామంలోని అంగళ్ళలో సరుకులు అమ్మడం లేదు. రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామంలో పర్యటించిన తర్వాత కరెంట్, మంచినీటి సౌకర్యం పునరుద్ధరించారు. అయితే ఇప్పటికీ దళితులను బెదిరిస్తూనే ఉన్నారు. ఇంత జరిగినా నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా ఉన్న మంత్రి అఖిలప్రియ ఇంతవరకు గ్రామాన్ని సందర్శించి దళితులకు భరోసా ఇవ్వలేదు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జన్మభూమి సభల్లో పాల్గొంటూ మీరు పేదలకు విరివిగా వాగ్దానాలు చేస్తున్నారు. అందరూ రూమ్‌లు నిర్మించుకోవాలని, లేదంటే ఆ ఊళ్ళో దీక్ష చేస్తామని ప్రకటించారు. వాస్తవానికి మీరు దీక్ష చేయాల్సింది దళితులను సాంఘికంగా వెలివేసిన 'నక్కలదిన్నె' గ్రామంలోనేనని మనవి చేస్తున్నాను. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ మీ ప్రభుత్వాలు అధికారానికి వచ్చిన తర్వాత దళితులపైన, మైనారిటీలపైన దాడులు గణనీయంగా పెరిగాయి. దళితులకు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయింది. దీనిని దృష్టిలో ఉంచుకొని కనీసం ఇప్పుడైనా మీరు నక్కలదిన్నె గ్రామాన్ని సందర్శించి దళితులకు భరోసా ఇవ్వాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. అలాగే సాంఘిక వెలికి గురైన దళిత కుటుంబాలకు చట్టప్రకారం నగదు, ధాన్యం పంపిణీ చేయాలని రామకృష్ణ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## గుండెపోటుతో అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతి



విశాలాంధ్ర-పాకాల : గుండెపోటుతో అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా పాకాల మండలంలో చోటు చేసుకుంది. పట్టణంలోని భారతంమిట్టకు చెందిన ఎం.గిరీంద్రబాబు సతీమణి సాయి ఈశ్వరి 2010 నుంచి 2015వ సంవత్సరం వరకు అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా పని చేసి సుమారు 23 లక్షలు రూపాయలు ప్రజల నుంచి అగ్రిగోల్డ్ డిపాజిట్‌లు కట్టించారు. అయితే అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో ప్రజల వద్ద నుంచి ఆమెపై ఒత్తిళ్ళు పెరిగిపోయాయి. ఈ మధ్య కాలంలో ఒత్తిళ్ళు మరీ తీవ్రం కావడంతో మానసిక వేదనకు గురై గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. ఆమెకు భర్త, కుమార్తె సాయివర్షిణిలు ఉన్నారు. బతుకు తెరువుకోసం ఏజెంట్‌గా పని చేసి కంపెనీ చేసిన మోసానికి ఈమె జీవితం బలికావడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# పెండింగ్‌లో 8 లక్షల ఫిర్యాదులా?

- 11వ తేదీకల్లా అన్నీ పరిష్కరించాలి
- అధికారులపై సీఎం చంద్రబాబు సీరియస్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : లక్షల్లో ప్రజల ఫిర్యాదులు పేరుకుపోతుంటే ఏం చేస్తున్నారని సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఇకపై ఒక్కటి కూడా పెండింగ్ ఉండటానికి వీల్లేదు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి. 11వ తేదీకల్లా అన్ని ఫిర్యాదులు రియల్ టైంలో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. శుక్రవారం విశాఖపట్నం నుంచి జన్మభూమి నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భందగా పెండింగ్ దరఖాస్తులపై సమీక్షిస్తూ జనవరి వరకు 7,78,422 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, గత మూడు రోజుల్లో 3,77,863 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. పింఛన్ల అర్జీలను త్వరితగతిన అప్‌లోడ్ చేయాలన్నారు. హౌసింగ్ 28,000, సివిల్ సప్లయిస్ 22,000, పెన్షన్లు 11,380, ఇళ్ల పట్టాల కోసం 10,134 అర్జీలు వచ్చాయని గుర్తు చేశారు. 80% సంతృప్తి ప్రజల్లో రావాలి. సానుకూలత సాధించాలని అధికారులకు దిశానిర్దేశ చేశారు. 15 శాతం వృద్ధిరేటు రాబోయే 15 ఏళ్లు కొనసాగించాలని, ప్రతి శాఖ సామర్థ్యం పెరగాలని, పని తీరు మరింత మెరుగుపడాలని సూచించారు. గ్రామ సభల్లో మాట్లాడుతున్న చిన్నారులను చూస్తే ముచ్చటేస్తోంది. మన పిల్లలు ప్రపంచానికే నాయకత్వం వహించే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. గ్రామసభల్లో చిన్నారులతో మాట్లాడించి వారిలో సమస్యల పట్ల అవగాహన, సామాజిక బాధ్యత పెంచాలన్నారు. మూడో రోజు జన్మభూమి సర్వే ఫలితాలను అధికారులకు వివరించారు. విశాఖ అర్బన్, చెరుకుపల్లి, విస్సన్నపేట, పెద్దాపురం, కడియం, యలమంచిలి, మొవ్వ, పెందుర్తి మండలాలు టాప్ టెన్ జాబితాలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన మండలాలు కూడా ఆ స్థాయికి చేరుకోవాలని, ఒకరితో మరొకరు పోటీ పడాలని పిలుపునిచ్చారు. కాకుమాను, పాలకొల్లు, పొన్నూరు, మేడికొండూరు, రాజాం, ఉంగుటూరు, పెదన, కశింకోట, పామిడి గ్రామాలు టాప్ టెన్ జాబితాలో ఉన్నాయన్నారు. మిగిలిన గ్రామాలు కూడా పోటీ పడి జన్మభూమిని విజయవంతం చేయాలని కోరారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళికా శాఖ, రియల్ టైం గవర్నెన్స్, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన అధికారులు సంజయ్ గుప్తా, అహ్మద్ బాబు, రామాంజనేయులు, కృష్ణమోహన్, మురళి, వివిధ జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతు సాధికార సంస్థకు సీఈఓను నియమించండి

### ఏపీ రైతు సంఘం డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రైతు సాధికార సంస్థకు పూర్తిస్థాయి సీఈఓను నియమించి రైతు రుణమాఫీలో ఏర్పడుతున్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీలో ఏర్పడుతున్న సమస్యలతో రైతులు గన్నవరంలోని రైతు సాధికార సంస్థ కార్యాలయం చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ సమస్య పరిష్కారంకాక సతమతమవుతున్నారన్నారు. గత ఎన్నికల సందర్భంగా రైతు రుణమాఫీ చేస్తామంటూ చంద్రబాబు ఇచ్చిన హామీ మూడేళ్ళు గడచినా రైతులకు ఊరట కలుగకపోగా నిర్వహణలో లోపాల వల్ల నిరాశ మిగులుతోందన్నారు. రాష్ట్రవ్యాపితంగా 55 లక్షల మందికిపైగా రైతులకు 25 కోట్లమేర ప్రయోజనం కలుగుతుందని ప్రారంభించిన ఈ పథకం వల్ల రైతులు నేటికీ అష్టకష్టాలు పడుతూనే ఉన్నారన్నారు. సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా పూర్తిస్థాయి అధికారి 6 నెలలుగా లేకపోవడం ఇన్‌చార్జిగా ఉన్న వ్యవసాయ కమిషనర్ సంస్థ నిర్వహణ, రైతుల సమస్యల పట్ల సమయాన్ని కేటాయించలేక పోతున్నారని పేర్కొన్నారు. జిల్లాల నుండి రైతులు అర్జీలు చేత పట్టుకొని సంస్థ ప్రధాన కార్యాలయం గన్నవరానికి ప్రతినిత్యం వందలాది మంది కాళ్లరిగేలా తిరుగుతున్నా, సొమ్ము బదలాయింపులో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా సమస్య పరిష్కరించే వారు కరువైనారన్నారు. జిల్లా కేంద్రాల్లో రైతుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పరచి సాధికార సంస్థ, బ్యాంకుల మధ్య ఏర్పడే సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేయడంతోపాటు, వ్యవసాయ మంత్రిని స్వయంగా కలిసి విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని వారు తెలిపారు. కేవలం నాలుగు జిల్లాల్లో మూడు రోజులపాటు మేళాలు నిర్వహించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. ఇప్పటికైనా స్పందించి జిల్లాల వారీగా అధికారులను నియమించి అర్జీలు పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. అలాగే తక్షణం సాధికార సంస్థకు పూర్తిస్థాయి అధికారిని నియమించడంతోపాటు 3వ విడత రుణమాఫీ నిధుల బకా యిలు విడుదల చేయాలని, 4, 5 విడతల నిధులు రాబోయే బడ్జెట్ ద్వారా విడుదల చేసి సకాలంలో మొత్తం రుణమాఫీ ప్రక్రియను పూర్తిచేసి రైతుల మన్ననలు పొందా లని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని సమ స్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు పూనుకుంటామని వారు హెచ్చరించారు.

# రేపు జోశ్యభట్ల భవన్ ప్రారంభం

- గొల్లపూడి 1 సెంటర్ నుంచి భారీ ప్రదర్శన
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు వెల్లడి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విజయవాడ శివార్లలోని గొల్లపూడిలో నూతనంగా నిర్మించిన ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఏపీ రాష్ట్ర సమితి కార్యాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు తెలిపారు. దాసరిభవన్‌లో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికవర్గం, శ్రమజీవుల హక్కుల కోసం మొక్కవోని దీక్షతో పనిచేసిన అమరులు జోశ్యభట్ల సత్యనారాయణ పేరిట ఈ భవనాన్ని నిర్మించినట్లు ఆయన వివరించారు. సంఘటిత, అసంఘటిత రంగానికి చెందిన కార్మికులకు కార్యక్షేత్రం అవసరం ఉన్నదని రాష్ట్ర నాయకత్వం గుర్తించి సొంత భవనాన్ని గొల్లపూడిలో సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో నాలుగు అంతస్తుల్లో వివిధ కార్మిక సంఘాలు, సమాఖ్యల సహకారంతో పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రారంభం తర్వాత రాష్ట్ర సమితి కార్యకలాపాలన్నీ నూతన భవనం నుంచే జరుగుతాయన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ కార్మికుల హక్కులను పరిరక్షించడంలో ఏఐటీయూసీ గణనీయమైన పాత్రను పోషిస్తోందన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారన్నారు. భవన ప్రాంగణంలోని రాష్ట్ర కార్యాలయాన్ని ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు హరిహర మహాదేవన్, మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ కార్యాలయాన్ని శ్రామిక మహిళా ఫోరం జాతీయ కన్వీనర్ బీవీ విజయలక్ష్మి, భవనం మూడో అంతస్తులోని కార్మిక నాయకులు అమరజీవి జీవీ కృష్ణారావు కాన్ఫరెన్స్‌హాలును మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు గొల్లపూడి 1 సెంటర్ నుంచి కార్మికశ్రేణులు, నాయకులతో భారీ ప్రదర్శన జరుగుతుందన్నారు. అనంతరం జరిగే బహిరంగసభలో వీరితోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు వీవీ రామారావు, ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి బి రాంబాబు, ఆలిండియా స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ, ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీవకుమార్, జాతీయ రోడ్డు రవాణా కార్మిక సమాఖ్య ఉప ప్రధాన కార్యదర్శి కె పద్మాకర్, ఏపీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్‌తోపాటు జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ చైర్మన్ జోశ్యభట్ల కల్పన ప్రసంగిస్తారన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు విజయన్ కునిసేరి, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి రత్నాకరరావు, తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎల్ మూర్తి, కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి ఎన్ శివన్న, ఒడిశా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శౌరి బంద్‌కర్ సహా ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న 13 సమాఖ్యలు, 566 సంఘాల నేతలు కూడా హాజరవుతారని తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని ఓబులేసు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు కిర్ల కృష్ణారావు, మనోహర మాణిక్యం, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, శ్రామిక మహిళా ఫోరం నాయకురాలు కె శైలజ పాల్గొన్నారు.

## తాంత్రిక పూజలతో హైందవ విశ్వాసాలకు దెబ్బ

### వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టీజేఆర్ సుధాకర్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన తాంత్రిక పూజలతో కోట్లాది మంది హైందవ విశ్వాసాలు దెబ్బతిన్నాయని వైసీపీ అధికార ప్రతినిధి టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాంత్రిక పూజల వ్యవహారం నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ హైందవమత విశ్వాసాలపై వ్యక్తులను, ఆగమశాస్త్ర ధర్మాలు తెలిసిన వారిని, వేదపండితులతో ప్రత్యేక కమిటీని నియమించి విచారిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని పేర్కొన్నారు. కడప జన్మభూమి సభలో వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి చేతిలో సీఎం చంద్రబాబునాయుడు మైక్ లాక్కుని స్వేచ్ఛను హరించేలా వ్యవహరించారని మండిపడ్డారు.



దుర్గగుడిలో తాంత్రిక పూజలపై..

## హైకోర్టు జడ్జితో విచారించాలి

- గత జన్మభూమి అర్జీలకే దిక్కులేదు..
- యువజన కాంగ్రెస్ సంస్థాగత సభ్యత్వ ప్రక్రియ ప్రారంభం
- పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విజయవాడ దుర్గగుడిలో తాంత్రిక పూజలపై ప్రభుత్వం హైకోర్టు జడ్జీతో విచారణకు ఆదేశించాలని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి డిమాండు చేశారు. ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పీసీసీ రిటర్నింగ్ అధికారి (పీఆర్వో) టీకేరామ్ ఆధ్వర్యాన విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏపీ యువజన కాంగ్రెస్ సంస్థాగత సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ, దుర్గగుడిలో తాంత్రిక పూజలు కొనసాగాయనే ఆరోపణలపై అధికారులు, మంత్రులు పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని విమర్శించారు. దీనిపై టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ కంటి తుడుపు చర్యేనని పేర్కొన్నారు. గత కమిటీల నివేదికలపై ఇంతవరకూ చర్యలను ప్రభుత్వం వెల్లడించలేదన్నారు. తహసీల్దార్‌ను టీడీపీ ఎమ్మెల్యే జుట్టుపట్టుకుని కొట్టిన సంఘటన, గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాటల ప్రాణనష్టం, పవిత్ర సంగమం దగ్గర బోట్ ప్రమాద సంఘటనల విచారణలు ఏమయ్యాయని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా కిడ్నీల రాకెట్ కొనసాగుతోందని మండిపడ్డారు. నాలుగు జన్మభూమిలలో ప్రజలు అందజేసిన అర్జీలకు దిక్కులేదని, మూడున్నరేళ్లుగా లక్షలాది అర్జీలు పేరుకుపోతున్నాయని విమర్శించారు. ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు బిల్లు, పంట నష్టానికి సబ్సిడీ ఇవ్వలేదని రఘువీరా వెల్లడించారు.

**వచ్చేనెల 28తో యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు ముగింపు**

ఏపీ యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఫిబ్రవరి 28న పూర్తవుతుందని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. జిల్లాల వారీగా సభ్యత్వ నమోదును ప్రారంభిస్తామన్నారు. సభ్యత్వ నమోదుకు 18 నుంచి 35 వరకూ వయస్సును నిర్ధారించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ రిటర్నింగ్ అధికారి (పీఆర్వో) టీకే రామ్, యూత్ కాంగ్రెస్ ఏపీ ఇన్‌చార్జ్ వి.వరప్రసాద్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, 13 జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాంతికి 5,397 ప్రత్యేక బస్సులు

- హైదరాబాద్ నుంచి 2,135 ఏపీఎస్ఆర్టీసీ సర్వీసులు
- 3,262 బస్సులను సిద్ధం చేసిన టీఎస్ఆర్టీసీ
- రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు: అధికారులు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో ఉంటున్న తెలుగు ప్రజలు తమ సొంత ఊళ్లకు వెళ్లడం కోసం రెండు రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలు 5,397 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాయి. వీటిలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) 3,262 బస్సులను, ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) 2,135 బస్సులను హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడిపేందుకు సిద్ధంగా ఉంచాయి. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, అమలాపురం, రాజోలు, రాజమండ్రి, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాలకు రోజువారి తిరిగే బస్సులతోపాటు అదనపు సర్వీసులను నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌తోపాటు వరంగల్, అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, కాళేశ్వరం, నల్గొండ వంటి ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ప్రత్యేక బస్సులకు టికెట్ చార్జీపై 50 శాతం అదనంగా వసూలు చేయనున్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఈనెల 9 నుంచి 12 వరకు హైదరాబాద్ కేంద్రంగా 2,135 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బ్రహ్మానందరెడ్డి 'విశాలాంధ్ర' విలేకరికి తెలిపారు. పండుగ తర్వాత కూడా ఆయా ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. విజయవాడతోపాటు పలు ప్రధాన బస్టేషన్లలో రద్దీకి అనుగుణంగా వివిధ ఊళ్లకు ప్రత్యేక సర్వీసులుగా నడిపేందుకు మరికొన్నింటిని సిద్ధంగా ఉంచుతున్నట్లు ఆయన వివరించారు. టీఎస్ఆర్టీసీ కూడా ఈనెల 10 నుంచి 13 వరకూ 3,262 బస్సులను నడుపుతోంది. విజయవాడతోసహా దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను ఎంజీబీఎస్ నుంచి నడిపేందుకు చర్యలు చేపట్టామని తెలంగాణ అధికారులు తెలిపారు. ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నేరుగా దూర ప్రాంతాల బస్సులను నడుపుతామన్నారు. అక్కడ నుంచి ఏపీలోని అన్ని జిల్లా కేంద్రాలకు 1,352 సర్వీసులను నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక బస్సులకు కూడా ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామన్నారు. స్వస్థలాలకు వెళ్లేవారు రోజుకు 60 నుంచి 70వేల వరకూ ఉండవచ్చుని అధికారులు అంచనావేస్తున్నారు.

**ప్రైవేటు ఆపరేటర్ల నిలువు దోపిడీ**

పండుగ సెలవుల రద్దీని దృష్టిలో పెట్టుకొని చాలా మంది ప్రయాణీకులు ఆర్టీసీ బస్సుల్లో ముందుగానే సీట్లను రిజర్వ్ చేసుకున్నారు. దీంతో హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో సీట్లన్నీ నిండిపోయాయి. ప్రత్యేక బస్సుల్లో కూడా సీట్లు లభించకపోవడంతో చేసేదిలేక ప్రైవేటు ట్రావెల్స్‌ను పలువురు ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన ట్రావెల్స్ నిర్వాహకులు సాధారణ టికెట్ చార్జీపై భారీగా వసూలు చేస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు విజయవాడ నుంచి బెంగళూరు, బళ్లారి, చెన్నై, బర్హంపూర్, కొల్హాపూర్, షిర్డీ, పూణె, ముంబై వంటి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు మరింత డిమాండు ఏర్పడింది. ఆర్టీసీ టికెట్లపై అదనంగా 50 శాతం, ప్రైవేటు ఆపరేటర్లు రెట్టింపు వసూలు చేస్తూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని ప్రయాణీకులు వాపోతున్నారు.

# జగన్‌కు జన నీరాజనం



విశాలాంధ్ర - పుంగనూరు : వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం సదుం మండలంలో 53వ రోజు పాదయాత్ర ప్రారంభించారు. సదుం మండలంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా మహిళలు స్వాగతం పలుకుతూ హారతులు ఇచ్చారు. సదుం బస్‌స్టాండ్‌లో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. జగన్ మాట్లాడుతూ దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉండగా పుంగనూరులో ఆర్‌టీసీ డిపో ఏర్పాటు చేసి, మంచినీటి కొరతను నివారించేందుకు సమ్మర్ స్టోరేజ్‌ను ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం సమ్మర్ స్టోరేజ్‌కు పైపులైన్ ఏర్పాటు, బస్ డిపోకు బస్సులను పంపకపోవడంతో పుంగనూరుకు చంద్రగహణం పట్టిందని విమర్శించారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేయడంతో, సిబ్బందికి మూడు నెలలైనా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని, బస్‌ఛార్జీలను 3 సార్లు, కరెంటు ఛార్జీలు పెంచారన్నారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారని, ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని పేర్కొన్నారు. వైఎస్‌ఆర్ నవరత్నాలతో అందరికీ మేలు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. నవరత్నాలలో ఏవైనా తేడాలు ఉంటే మాకు నేరుగా తెలియచేయవచ్చునన్నారు. నిరంకుశ టీడీపీ పాలనను తరిమికొట్టి రాబోయే ఎన్నికలలో వైసీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మిథున్‌రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి వైసీపీ ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు పోకల అశోక్‌కుమార్, పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్ షమిమ్, షరీఫ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అటకెక్కిన దుగ్గరాజుపట్నం పోర్టు

### రామాయపట్నం పోర్టు పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్ర విభజన సమయంలో దుగ్గరాజుపట్నం పోర్టును నిర్మిస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. అయితే ఆ పోర్టు వ్యవహారం అటకెక్కింది. దానికి బదులుగా సహజ సిద్ధంగా ఉన్న రామాయపట్నం పోర్టును అభివృద్ధి చేయాలని డిమాండ్‌లు ఉన్నా అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం దీని గురించి పట్టించుకోవటం లేదు. వేలాది మందికి ఉపాధి, ఎగుమతులు, దిగమతుల ద్వారా వేల కోట్ల ఆదాయం సమకూరేందుకు ఉపయోగపడే పోర్టు నిర్మాణాన్ని పట్టించుకోకపోవటంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ రైల్వే జోన్, పోలవరం నిధులు, అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపుదల గురించే ఏపీ నాయకులు దృష్టి సారిస్తున్నారు తప్ప రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడే పోర్టు గురించి ఎవరూ మాట్లాడటం లేదు. శుక్రవారం రాష్ట్రానికి చెందిన టీడీపీ, బీజేపీ ఎంపీలు ప్రధాని మోడీని కలిసి విభజన హామీలను అమలు చేయాలని విన్నవించారు. అందుకు మోడీ తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో సమావేశం కానున్నామని చెప్పారే తప్ప విభజన బిల్లులో పేర్కొన్న హామీల గురించి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కేంద్రం దుగ్గరాజుపట్నం పోర్టు నిర్మిస్తామని తొలి రోజుల్లో కసరత్తు చేసింది. దీనికి సంబంధించి కేంద్ర ఉపరితల రవాణాశాఖ, విశాఖ పోర్టు ట్రస్ట్ 'ఎర్నెస్ట్ అండ్ ఎంగ్', ఏ.ఈ కామ్ అనే కన్సల్టెన్సీ సంస్థలతో సర్వే చేయించాయి. వాటి నివేదికల కారణంగా దుగ్గరాజుపట్నం పోర్టు నిర్మాణం వల్ల పులికాట్ సరస్సుకు పర్యావరణ ఇబ్బందులు, ఇస్రోకు రక్షణ ఇబ్బందులు తలెత్తుతాయని భావించి ఈ నిర్మాణం అసాధ్యమని నీతిఅయోగ్ కూడా నిర్ధారించింది. దీంతో ప్రకాశం జిల్లా రామాయపట్నం వద్ద పోర్టు నిర్మించాలన్న డిమాండు ఊపందుకుంది. బ్రిటిష్ పాలనలోనే ఇక్కడ సహజసిద్ధమైన పోర్టు ఉండేది. వాటికి సంబంధించిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. కావలి పట్టణానికి ఈ పోర్టు సమీపంలో ఉంది. అటు జాతీయ రహదారి, ఇటు రైల్వే లైను అతి దగ్గరలో ఉన్నాయి. దుగ్గరాజుపట్నం నిర్మాణ వ్యయంతో పోలిస్తే తక్కువ కూడా. తెలుగుదేశం పార్టీ మహానాడులో రామాయపట్నం పోర్టు నిర్మించాలని తీర్మానం చేయటం తప్ప ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు చేస్తున్న ప్రయత్నాలు కనిపించడం లేదు. వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డిలు రామాయపట్నం పోర్టు కోసం కృషి చేస్తామని చెప్పటమే తప్ప వారు కూడా దీనిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వాలు ఏర్పడి దాదాపు మూడున్నర సంవత్సరాలు దాటింది. దుగ్గరాజుపట్నం పోర్టు నిర్మాణం సాధ్యం కానప్పుడు కేంద్రం ఇచ్చిన హామీ మేరకు రామాయపట్నం పోర్టు సాధన కోసం ప్రభుత్వం పట్టించుకోకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ పోర్టు నిర్మిస్తే ప్రకాశం జిల్లా అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. రాష్ట్ర ఉత్పత్తుల ఎగుమతులకు మరింత సౌకర్యం కలగనుంది. దీనికి తోడు పోర్టు అనుబంధంగా మరికొన్ని పరిశ్రమలు కూడా స్థాపించే అవకాశం ఉంది. వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్న రామాయపట్నం పోర్టు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సి ఉంది.

సంపాదకీయం

# గ్రామీణార్థిక వ్యవస్థ కుదేలు

ఒకనాడు 'రైతేరాజు' అని క్షేత్రకృషీవలులు కీర్తించబడ్డారు. అందుకే భారత మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి "జై కిసాన్-జై జవాన్" అన్న నినాదమిచ్చి దేశ రక్షకులైన జవాన్లు, అన్నదాతలైన రైతన్నలను ప్రోత్సహించారు. అందుకు భిన్నంగా నేటి మోడీ ప్రభుత్వ పాలనలో వ్యవసాయం రైతుల పాలిట విషాదంగా పరిణమించింది. వారి దురవస్థలను మరింత తీవ్రతరం చేసింది. అన్నదాతలు ఎదుర్కొంటున్న దుస్థితి నివారణకు, వారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరల కల్పనకు దేశంలోని వివిధ రైతుసంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండు చేస్తూ దేశవ్యాపితంగా ఉద్యమాలు నిర్వహించాయి. అయినప్పటికీ కేంద్రంలోని మోడీ సర్కారు నిమ్మకునీరెత్తినట్లు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించింది. ఇటీవల రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సీనియర్ నాయకుల సమావేశం జరిగింది. ఆ సమావేశానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కూడా హాజరయ్యారు. ఆ సమావేశంలో అన్నదాతల దుస్థితి అంశాన్ని బీజేపీ నాయకత్వం దృష్టికి తెచ్చి చివాట్లు పెట్టినట్లు, అన్నదాతల ఆర్థిక దుస్థితి, వ్యవసాయ రంగంలో పెరుగుతున్న నిరుద్యోగిత 2019 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలకు నష్టం కలుగజేయవచ్చునన్న భయాందోళనలు వ్యక్తమయినట్లు అభిజ్ఞ వర్గాల కథనం. దీన్నిబట్టి చూస్తే అన్నదాతలను ఆదుకోవాలని వివిధ రైతు సంఘాలు చేస్తున్న ఉద్యమాలు ఎంత న్యాయమైనవో రుజువు అవుతోంది. ప్రధాని మోడీ పనితీరుతో ఆరెస్సెస్ కొంతకాలంగా అసంతృప్తితో వున్నట్లు, తన వ్యవహారశైలిని సవరించుకొని ప్రాధాన్యతలను పునఃరూపొందించు కోవలసిందిగా మోడీని కోరడం ఆయన ఏకపక్ష, నిరంకుశ ధోరణిని పట్టిస్తోంది. దాదాపు ఓటమి అంచులకు వెళ్లిన గుజరాత్ శాసనసభ ఎన్నికల ఫలితాలపట్ల బహుశా ఆరెస్సెస్ నిరుత్సాహానికి గురై వుండవచ్చు. రైతన్నల భవితవ్యం పట్ల మోడీ జాగ్రత్తగా వ్యవహరించి, వారి దురవస్థల నిర్మూలనకు కృషి చేసి వుండినట్లయితే, పరిస్థితి మరో రకంగా వుండేదని, పటీదార్ల ఆందోళన విషయంలో కూడా మోడీ సక్రమంగా వ్యవహరించలేదని సంఘ్ అభిప్రాయపడింది. రైతుల దుస్థితిపై గ్రామీణ ప్రాంతాల్లో పెల్లుబికిన ఆగ్రహం, నిరుద్యోగ యువతలో పెరిగిన అశాంతి కారణంగా గుజరాత్‌లో పార్టీ దిమ్మతిరిగిందని ఆరెస్సెస్‌కి అర్థమైంది. గుజరాత్‌లోనే కాదు, దళితులు, మైనారిటీలు, రైతులు, కార్మికవర్గ వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ, కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేస్తున్న మోడీ ప్రభుత్వానికి 2019లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం.

గత ఏడాది కాలంగా తన సొంత పార్టీకి చెందిన రైతు సంఘాలతో సహా దేశంలోని వివిధ రైతు సంఘాలు అనేక సందర్భాల్లో రైతులు, కార్మికవర్గ వ్యతిరేక విధానాలు అనుసరించవద్దని మోడీకి హితవు పలికినా ఆయన వాటిని పెడచెవిన పెట్టారు. రైతులు, యువత దురవస్థకు మోడీ ప్రభుత్వం అనుసరించిన తప్పుడు ఆర్థిక విధానాలే కారణమనడం నిర్వివాదాంశం. యుపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఇజిఏ) ప్రవేశపెట్టి పేద రైతుల ఆర్థిక పరిస్థితి ఉద్ధరణకు కృషి చేసింది. కానీ మోడీ ప్రభుత్వం ఆ భావనను తిరస్కరించి, ఎన్‌ఆర్‌ఇజిఏ పథకానికి కేటాయించిన నిధులు "యుపీఏ వైఫల్యానికి సజీవస్మారకం"గా అభివర్ణించింది. నిధుల కేటాయింపులో కోత విధించింది. 2017 కేంద్ర బడ్జెట్‌లో మాత్రమే కొద్దిమేరకు నిధులు పెంచింది. రైతాంగవర్గం తమ ఓటు బ్యాంకు కాదన్న భావనతో బీజేపీ ఏనాడూ వారిపట్ల సుముఖంగా వ్యవహరించలేదు. వ్యవసాయకూలీలు, పెద్దరైతులతో సత్సంబంధాలు కలిగి వుండని బడా భూస్వాములు, వడ్డీ వ్యాపారులకు బీజేపీ సన్నిహితంగా మెలుగుతూ వస్తోంది. పేద రైతుల కొరకు ఉద్దేశించిన ఎన్‌ఆర్‌ఇజిఏ పట్ల మోడీ ప్రభుత్వ అయిష్టతకు అదే ప్రధాన కారణం. రెండేళ్ల దుర్భిక్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వచ్చింది. ఆ సమయంలో వ్యవసాయాభివృద్ధి స్తంభించిపోయింది. 2015-16లో ఆ రంగంలో అభివృద్ధి కేవలం 1.2 శాతం మాత్రమే. 2016-17లో అభివృద్ధి 4.1 శాతానికి పెరిగింది. అయితే, పెద్దనోట్ల రద్దు కారణంగా అప్పటికే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. నగదు కొరకు గత్యంతరం లేక రైతులు వారి ఉత్పత్తులను కారుచౌక ధరలకు విక్రయించవలసి వచ్చింది. పెద్దనోట్ల రద్దు అనంతరం విపరీతమైన వడ్డీలకు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండి పెద్ద మొత్తాల్లో అప్పులు చేసి వాటిని తీర్చలేక భూములను అమ్ముకోవలసి వచ్చింది. మోడీ బహిరంగసభల్లో రాజకీయ వాగాడంబరంగా రైతులకు మద్దతు ప్రకటించినప్పటికీ, వారి సమస్యలు తీర్చకోడానికి ఎట్టి చొరవ ప్రదర్శించకపోవడం దారుణం. 2014 ఎన్నికల్లో రైతు ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పిస్తామని వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చాక దాన్ని తుంగలో తొక్కారు. మోడీ ప్రభుత్వం యిచ్చిన వాగ్దానాన్ని అమలు చేసి వుండినట్లయితే వ్యవసాయరంగం ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఎదుర్కోవలసి వచ్చేది కాదు. వ్యాపారులు, మధ్యదళారుల కబంధ హస్తాలను ఛేదించడంలో రైతుల అశక్తతతో భారతీయ వ్యవసాయరంగం విషాదంలో కూరుకుపోయింది. వారు చేసిన వ్యవసాయ వ్యయానికి తగ్గట్టుగా ఉత్పత్తులకు మార్కెట్లో ధరలు లభించక తక్కువ ధరలకు అమ్ముకోవలసి వచ్చింది. అందుచేత, వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణ తక్షణ అవసరం వుంది. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత ఏడాది నవంబర్ 20న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించారు. దేశంలోని రైతాంగంలో 27 శాతం మందికి మాత్రమే వ్యవస్థాగత రుణాలు లభిస్తున్నాయి. మిగతావారు ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, వర్తకులు కాంట్రాక్టర్లు మధ్యదళారులపై ఆధారపడవలసి వస్తోంది. వ్యవసాయదారుల్లో దాదాపు 82.50 శాతం దారిద్ర్యరేఖకు దిగువన వున్నారంటే వారి దుస్థితికి అద్దం పడుతోంది. భారతీయ రైతాంగం నయా ఉదారవాద పెట్టుబడిదారీ బంధీలుగా వున్నారన్నది నిరాకరించలేని వాస్తవం. వారి నుంచి విముక్తి కొరకు, వారి సమస్యల పరిష్కారానికి వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయరంగ సంస్కరణ కోసం రాష్ట్రంలోనూ, దేశంలోనూ వ్యవసాయ సంఘాలన్నీ బలోపేతమైన ఐక్య ఉద్యమాలు నిర్వహించడం తక్షణ ఆవశ్యకత.

## చురక

మేకిన్ ఇండియా మోడీ
మేలిముసుగు మోహాలు
ఫేకిన్ ఇండియా అంటూ
పేల్చే తూటా రాహులు

పెట్టుబడులు రాక కొత్త
పరిశ్రమలు లేని ఎత
కోట్లకొద్ది నిరుద్యోగ
కొన ఊపిరి గుండె కోత

- వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

చైనాకు చేరువవుతున్న పాకిస్తాన్‌పై అమెరికా ఛీంకారం

# భారత్ కిం కర్తవ్యం?

విశ్వనాధ్. వై.

అవసరం ఉన్నంత వరకు ఓడ మల్లన్న, అవసరం తీరాక ఓటి మల్లన్న అన్న చందంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ జాన్ ట్రంప్ వ్యవహార శైలి అంతర్జాతీయ విమర్శలను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఎవరెన్ని రకాలుగా విమర్శలు చేసినా ఆయనలో కించిత్తు కూడా మార్పు రావడం లేదు. అధికారంలోకి వచ్చిందే తడవుగా ఎంచుకున్న స్వీయరక్షణాత్మక విధానం అమలులో వరుస తప్పిదాలకు పాల్పడుతున్నారు. తాజాగా, ఆఫ్ఘనిస్థాన్‌లో తాము జరిపే ఉగ్రవాద వ్యతిరేక పోరులో పాకిస్తాన్ కలిసి రావడం లేదంటూ డొనాల్డ్ ట్రంప్ ట్విట్టర్‌లో అక్కసు వెళ్లగక్కారు. గత 16సంవత్సరాలుగా పాకిస్థాన్‌కు అమెరికా మొత్తం 33బిలియను డాలర్ల (రూ.2.10లక్షల కోట్లు)కుపైగా సాయాన్ని అందించినట్లు చెప్పారు. తాజాగా శుక్రవారం జారీ చేసిన ఆదేశాల్లో భద్రతా సాయం కింద పాకిస్థాన్‌కు అమెరికా ఇవ్వవల్సిన రూ.7,800కోట్లను నిలిపివేస్తు న్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఆఫ్ఘన్ తాలిబన్లకు, హక్కానీ తదితర ఉగ్రవాద మూకలకు పాకిస్థాన్ ఆశ్రయమిస్తోందని అన్నారు. ఉగ్రవాద వ్యతిరేక పోరులో తమతో కలసి పని చేసే విషయంగా పాకిస్థాన్ వ్యవహారశైలి సందేహాస్పదంగా ఉంటోందని, అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగిస్తోందనీ ఆయన మరో మారు విమర్శించారు. వాణిజ్య, ఆర్థిక లావాదేవీలు సజావుగా జరిగేం దుకు చైనా కరెన్సీ యువాన్‌ను ఆమోదిస్తామంటూ పాకిస్థాన్ స్టేట్ బ్యాంకు ప్రకటించింది. యువాన్ కరెన్సీ మార్పిడి విష యంలో తమకె లాంటి అభ్యంతరాలు లేవని చైనా ప్రకటించడం గమనార్హం.

అక్కసు నిండిన ఈ నిందారోపణ వెనుక రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, అధికారంలోకి వచ్చినదే తడవుగా ముస్లిం ఆధిక్య జనాభా దేశాలు ఆరింటి నుంచి అమెరికాలోకి వలసలను నిషేధిస్తూ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులు ఆయనలోని ముస్లిం విద్వేషాన్ని వెళ్లగక్కాయి. పాలస్తీనా సార్వభౌమత్వానికి వ్యతిరేకంగా జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తున్నట్లు కొద్ది రోజుల క్రితం ట్రంప్ చేసిన ప్రకటన దీనికి కొనసాగింపుగా చెప్పవచ్చు. రెండవది, ఇటీవల కాలంలో సోషలిస్టు చైనాకు పాకిస్థాన్ దగ్గరవుతున్న స్థితిని ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. చైనా, పాకిస్థాన్ ఆర్థిక నడవా (సీపీఈసీ) నిర్మాణం కోసం చైనా అందిస్తున్న ఐదు వేల డాలర్లను పాకిస్తాన్ స్వీకరించడం అమెరికాకు సుతరామూ ఇష్టం లేదు. ఈ విషయంలో తన మాటను పాకిస్థాన్ ఖాతరు చేయడం లేదని అమెరికా కొన్ని సందర్భాల్లో వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేయడమూ గమనించాల్సిన విషయం. మూడవది, ఆయనలోని పెట్టుబడిదారు లక్షణం నుంచి జనించిన లాభదాయక భావన. పాకిస్థాన్‌కు కోట్లకు కోట్లు సాయంగా అందిస్తున్నా ఆశించిన మేర లాభం దక్కడం లేదని ట్రంప్ వాపోతున్నారు. ఆ లాభం ఏమిటనేది ఆయనకే తెలియాలి. మోసమూ, అబద్ధాలనే తమ ముఖాన కొట్టారంటూ ట్రంప్ ఆక్రోశం వెళ్లగక్కారు. ఆఫ్ఘనిస్థాన్‌లో తాము జరిపే ఉగ్రవాద వ్యతిరేక పోరులో పాకిస్థాన్ నిజాయితీగా కలిసి రావడం లేదనీ, ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందన్న ట్రంప్ మాటలూ హాస్యాస్పదంగా ఉన్నాయి. పాకిస్తాన్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా నిలిచిందని గత కొన్ని సంవత్సరాలుగా భారత్ చేసే వాదనను అమెరికా ఖాతరు చేసిన సందర్భం కనిపించక పోవడమే ఇందుకు ఉదాహరణగా చెప్పాలి. మరో ముఖ్యమైన విషయం అమెరికా, పాకిస్థాన్ మధ్య ఇలాంటి రగడ రేగడం ఇదే మొదటి సారి కాదు. చివరి సారీ కాబోదని అంతర్జాతీయ రాజకీయ పరిశీలకుల అభిప్రాయంగా ఉంది.

అంతర్జాతీయ దౌత్య నిబంధనలకు లోబడే అమెరికాకు దీటుగా బదులిస్తామని పాకిస్థాన్ ప్రధాన మంత్రి ప్రత్యేక సలహాదారు డాః ముసాదిక్ మాలిక్ ఘాటుగానే స్పందించారు. అమెరికా అందించిన ఆర్థిక సాయాన్ని తాము ఎలా వ్యయం చేసిందీ లెక్కలు నిర్ధారించుకోవడానికి అమెరికా ఆడిట్ సంస్థనూ నియమించి తనిఖీలు జరుపుకోవచ్చన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు పాకిస్థాన్‌లో అమెరికా రాయబారి డేవిడ్ హేలీకి పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం తీవ్ర నిరసన తెలిపింది. శ్వేతసౌధం నుంచి వెలువడిన రెచ్చగొట్టే ప్రకటనకు పాకిస్థాన్‌లోని అధికార, ప్రతిపక్ష రాజకీయపార్టీలన్నీ ఏకమవుతున్నాయి. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీకి ప్రాతినిధ్యం వహించే సెనేటర్, అమెరికాకు పాకిస్థాన్ మాజీ రాయబారి షెర్రీ రెహ్మాన్ స్పందన మరింత ఘాటుగా ఉంది. సంకీర్ణకూటమి సహాయ నిధులను సాయంగా కానీ, సహాయంలో భాగంగానూ పరిగణించజాలమని ఆయన అన్నారు. సరిహద్దులో సంయుక్తంగా నిర్వహించిన కార్యకలాపాలకు అయిన వ్యయానికి ఇవ్వజూపిన నష్టపరిహారంగా చూడాల్సి ఉందన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో అనుసరించే తలాతోకా లేని విధాన లోపాల్లోనే అమెరికా వైఫల్యం దాగుందన్నారు.

ఉగ్రవాద వ్యతిరేక పోరులో అమెరికాకు ఆసక్తి సన్నగిల్లి పోయినట్లుగా కనిపిస్తోందంటూ పీపీపీ అధిపతి బిలావల్ భుట్టో జర్దారీ తన ట్విటర్లో వ్యాఖ్యానించారు. ఉగ్రవాదుల ఏరివేత పేరిట ఆఫ్ఘన్‌లో అమెరికా 16సంవత్సరాలుగా తిష్ట వేసుకున్నది. లక్ష్యంలో ఘోరంగా విఫలమైంది. కనీసం నిష్క్రమణలోనైనా హుందాతనం, కృతజ్ఞత చూపలేకపోయిందంటూ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ నాయకుడు వ్యంగ్యోక్తి విసిరారు. ఈ ఉదంతంపై తదుపరి కార్యాచరణ నిర్ణయానికిగాను ప్రధాన మంత్రి షాహిద్ ఖకన్ అధ్యక్షతన జాతీయ భద్రత కమిటీ భేటీ జరిగింది. ఈ భేటీలో పాకిస్థాన్ రక్షణ, అంతర్గత వ్యవహారాలు, విదేశాంగ తదితర కీలక శాఖలకు చెందిన మంత్రులు, మిలటరీ అధికారులు పాల్గొన్నారు. దక్షిణాసియాలో అమెరికా అనుసరించనున్న కొత్త విదేశాంగ విధానానికి ట్రంప్ ప్రకటన ముందస్తు రిహార్సల్‌గా కమిటీ అభిప్రాయపడింది. అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ నార్మన్, విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్‌ల ప్రకటనలూ ఇందుకు ఊతమిచ్చేవిగానే ఉండటం గమనార్హం.

అమెరికా-పాకిస్థాన్‌ల మైత్రికి ప్రాణం పోసింది మహమద్ అలీ జిన్నా, ఆర్థిక , ఆయుధ సాయం కోసం తన ఆర్థిక మంత్రి మాలిక్ గులాం మహమ్మద్‌ను అమెరికాకు పంపిందీ జిన్నానే అని అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్త ఖలీద్ మహమూద్ గుర్తు చేశారు. నాటి సోషలిస్టు సోవియట్ యూనియన్‌ను, సోషలిజాన్ని నిరోధించడం లక్ష్యంగానే పాకిస్థాన్‌తో అమెరికా దోస్తీకి దిగిందన్నారు. ఈ దోస్తీని పాకిస్థాన్ కడు సమర్థవంతంగా ఉపయోగించుకున్న దన్నారు. అయినకాడికి నిధులు దండుకొందన్నారు. ప్రస్తుతం అమెరికాకు పాకిస్థాన్ సేవలు ఎంత మాత్రం అవసరం లేదన్నారు. అందుకే పాకిస్థాన్‌ను దూరం పెట్టేందుకు ట్రంప్ ఈనిందారోపణ ఆటకు తెరతీశారన్నారు. రెండవది, అమెరికా-పాకిస్థాన్ మైత్రికి సంబంధించిన లోతుపాతుల చరిత్ర ట్రంప్‌కు తెలియదన్నారు. అమెరికా అందించిన నిధుల్లో కనీసం ఒక్క రూపాయిని కూడా పాకిస్థాన్ తన దేశ పౌరుల సంక్షేమ కోసం వాడుకోలేదన్నారు. ఈ వ్యవహారంపై చైనా ఆచి తూచి స్పందించింది విదేశాంగ మంత్రి జెంగ్ షువాంగ్ మాట్లాడుతూ పరస్పర గౌరవం ప్రాతిపదికగా ప్రాంతీయశాంతి, స్థిరత్వ సాధనకుగాను జరిపే ఉగ్రవాద వ్యతిరేకపోరులో పాకిస్థాన్‌కు సహకరిస్తామన్నారు. కేవలం భౌగోళికంగానే కాక, ఉమ్మడి ప్రయోజనాల విషయంలోనూ చైనా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నాయన్నారు. ఈ క్రమంలో సమాచార విస్తరణ, ఇచ్చిపుచ్చుకోవడాలు సహజమేనన్నారు.

ఇటీవల ముగిసిన చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభల తీర్మానానికి అనుగుణంగా మానవాళి మెరుగైన భవిత కోసం జరిపే సమాజ నిర్మాణంలో కలిసి వచ్చే దేశాలన్నిటినీ భాగస్వాములను చేస్తామని చైనా విస్పష్టంగా ప్రకటించింది. నవంబరు 30నుంచి డిసెంబరు 3వరకు బీజింగ్ వేదికగా 120దేశాలకు చెందిన 300 రాజకీయ పార్టీలు, సంస్థలకు చెందిన 600 మంది ప్రతినిధులతో అత్యున్నత స్థాయి సదస్సును నిర్వహించింది. ప్రపంచంతో మమేకం కావాలన్నదే తమ అభిమతమన్న ఆకాంక్షను ఇదే వేదికగా హాజరైన ప్రతినిధులకు, అంతర్జాతీయ సమాజానికి బలంగా చాటి చెప్పింది. ఇలాంటి స్థితిలో అమెరికాకు చేరువవుతూ, చైనాను వ్యతిరేకిస్తున్న భారత్ తన విదేశాంగ విధానాన్ని పునఃసమీక్షించుకోవాల్సి ఉంది.

విశ్లేషణ

# తగ్గిన చెరకు సాగు!

దాసరి ఆళ్వారస్వామి



ఒకనాడు లాభాల పూలు పూయించిన చెరకు ఇప్పుడు రైతులకు నష్టాలను, కష్టాలను మిగుల్చుతుంది. ఒకప్పుడు చెరకు నాటటానికి అనువైన భూములు కోసం పరుగులు తీసే రైతులు, ఇప్పుడు చెరకు పేరు చెబితే భయపడి పలాయనం చిత్తగిస్తున్నారు. అందుకు రెండే రెండు కారణాలు. ఒకటి చెరకు మద్దతు ధర, రెండు కూలీల కొరత.

కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధర గత కొన్నేళ్లుగా రైతుకు గిట్టుబాటు కావటం లేదు. అలాగే చెరకు నరికే కూలీల కొరత కూడా అధికమైంది. చెరకు నరికే కూలీల లభ్యత కొరవడిన విషయం యాజమాన్యాలు గ్రహించినా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటం, చెరకు నరికే యంత్రాలను తెప్పించటం లాంటి చర్యలు చేపట్టటంలో విఫలమవుతున్నారు. ఫలితంగా సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గి, చెరకు ఉత్పత్తి తగ్గి, పంచదార ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోతుంది. ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యం తగ్గి, కార్మికుల పనిదినాలు కూడా తగ్గిపోతున్నాయి. చెరకు సాగులో విత్తనం ఖర్చు దగ్గర నుంచి కూలీల రేట్లు, ఎరువులు, పురుగు మందులు, డీజిల్, పెట్రోలు ఇత్యాది ధరలన్నీ గణనీయంగా పెరుగుతున్నాయి. ఏ ధర ఏరోజు పెరుగుతుందో ఊహించటం కష్టసాధ్యంగా వుంది. ఇలా ధరలు పెరుగుతున్నా దామాషాలో మద్దతు ధర పెరగటం లేదు. 2013లో యన్. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలంలో రాష్ట్రంలోని వ్యవసాయ ఉత్పత్తుల వ్యయ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. అప్పటికి టన్ను చెరకు ఉత్పత్తి వ్యయం సుమారుగా రూ. 2,700లుగా తన నివేదికలో పొందుపరిచారు. 2013 నాటికే టన్ను చెరకు ఉత్పత్తి వ్యయం రూ. 2,700లుగా వుంటే అంతకన్నా ఏ కొంచెమైనా ఎక్కువగా మద్దతు ధర నిర్ణయించటం జరిగితేనే రైతుకు గిట్టుబాటుగా వుంటుంది. అప్పుడే చెరకు సాగుకు రైతులు ఉత్సాహం చూపుతారు. 2017-18 సీజనుకు చెల్లించే మద్దతు ధర టన్నుకు రూ. 2,550గా నిర్ణయించి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకొంది. 2017 నాటి చెరకు ఉత్పత్తి వ్యయం రూ. 3,800లుగా వుంది. అంటే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఉత్పత్తి వ్యయం కన్నా సుమారు 12 వందల రూపాయలు తక్కువగా వుంది. ఎకరానికి 30 టన్నులు పండించిన రైతు నికరంగా రూ, 3,600లు నష్టపోవటం జరుగుతోంది. ఇలా నష్టపోతూ కూడా చెరకు ఎందుకు సాగు చేస్తున్నాడనే ప్రశ్న ఎదురుకావటం సహజం.

ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర చెరకుకే కాదు, ఏ పంటకూ గిట్టుబాటు కాదన్న విషయం జగద్విదితం. అలాంటప్పుడు చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోకుండా ఫ్యాక్టరీలు జాగ్రత్తపడతాయి. విస్తీర్ణం తగ్గితే పంచదార ఉత్పత్తి తగ్గుతుంది. పంచదారతోపాటు ఉప ఉత్పత్తులు తగ్గిపోతాయి. పంచదార తయారీ సమయంలో వెలువడే మొలాసిస్, బెగాస్, ఫిల్టర్ కేక్‌ల ఉత్పత్తి తగ్గుతుంది. ఈ ఉప ఉత్పత్తులు మూడు. పంచదార కర్మాగారాలకు అధిక లాభాలను సమకూర్చే వ్యర్థాలు. వాటిద్వారా వచ్చే ఆదాయం, పంచదార అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం కన్నా ఎక్కువగా వుంటుంది. అలాంటి ఉప ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయంలో నగం రైతులకివ్వమని చట్టంలో వున్నప్పటికీ, పైసా రైతుకి విదిలించిన దాఖలాలు లేవు. రైతులు మొరపెట్టుకొంటున్నా, ఆవైపుగా ప్రభుత్వం దృష్టి సారించటం లేదు. ఇలా ఉప ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయం నుంచి, చెరకు సాగుచేసే రైతులకు విత్తనం, ఎరువుల రాయితీల రూపంలో కొంచెం విదిలించటంతో, ధరలో వచ్చే నష్టాన్ని రైతు కొంత తగ్గించుకోగలుగుతున్నాడు. ఒకప్పుడు కౌలు రైతులే ఎక్కువ చెరకును సాగుచేసేవారు. ఫ్యాక్టరీలు యిచ్చే రాయితీలు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు సాగు ఖర్చులకు సరిపోక చెరకు సాగుకు రైతులు విముఖత చూపుతున్నారు. ఒకప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాలలో 38 చక్కెర కర్మాగారాలు పనిచేస్తుండేవి. వాటిలో 12 వరకు మూతపడ్డాయి. మిగిలిన ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యానికి సరిపోయే చెరకు పండటం లేదు. అందువల్ల ఫ్యాక్టరీల పని దినాలు తగ్గిపోతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలో అయిదేళ్ల వ్యవధిలో చెరకు ఉత్పత్తి 55 శాతం వరకు తగ్గిపోయినట్లు ప్రభుత్వ గణాంకాలే రుజువు చేస్తున్నాయి.

పదేళ్ల క్రితం టన్ను చెరకు నరుకుడు కూలి రూ. 200 నుండి 250 వరకు ఉండేది. ఇప్పుడు టన్నుకు రూ. 600లు చెల్లించినా కూలీలు దొరకటం లేదు. ఏడాది శ్రమించి పండించిన చెరకును తగలబెట్టి ఫ్యాక్టరీలకు తరలిస్తున్న సంఘటనలు ప్రతి జిల్లాలోనూ సహజమైపోయాయి. చెరకు నరికే కూలీల కొరత అధికమవుతున్న దశలో అటు ప్రభుత్వాలు గాని, ఇటు కర్మాగారాలు గాని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయటంలో విఫలమవుతున్నాయి. చెరకు నరకటానికి యంత్రాలే శరణ్యమన్న రోజులు వచ్చేశాయి. ఆ విషయం అటు ప్రభుత్వ, ఇటు ఫ్యాక్టరీల అధికారులు పదే పదే చెవుతున్నారేగాని యంత్రాలు అందుబాటులోకి తెచ్చిన దాఖలాలు లేవు. 'యంత్రాలతో చెరకు నరికించటమే శరణ్యం' అన్న అభిప్రాయం ఈనాడు వెలుగు చూసింది లేదు. 1985లోనే కృష్ణాజిల్లాలోని ఉయ్యూరు కె.సి.పి. పంచదార కర్మాగారం 20 లక్షలు ఖర్చు చేసి 'బార్షదోస్' నుంచి ఒక చెరకు నరికే యంత్రాన్ని తెచ్చింది. దాని బరువు ఎక్కువగా వుండటం వల్ల చెరకు నరకటం సాధ్యం కాలేదు. పొలాల్లోనే కూరుకుపోయేది.

తక్కువ బరువు యంత్రాలు అవసరమన్న అభిప్రాయం అప్పుడే కలిగింది. అయినా ఇప్పటికీ తక్కువ బరువున్న యంత్రాలు రైతులకు అందుబాటులోకి రాలేదు. యంత్రాలను తెప్పించటంలో ఫ్యాక్టరీలు శ్రద్ధ చూపటం లేదు. కోట్లు ఖర్చుపెట్టి చెరకు నరికే యంత్రం కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత రైతుకు లేదు. రైతుల శ్రమ శక్తిని లాభాలుగా మార్చుకొనే ఫ్యాక్టరీ యాజమాన్యాలు యంత్రాలతో చెరకు నరికించటానికి అనువుగా చెరకును నాటించటంలో కూడా యాజమాన్యాలు విఫలమవుతున్నాయి. సాధారణ పద్ధతిలో నాటిన చెరకును యంత్రాలతో నరికించటం సాధ్యపడదు. బోదెల మధ్య దూరం నాలుగు నుండి నాలుగున్నర అడుగులు వున్నప్పుడు మాత్రమే యంత్రాలు ఉపయోగపడతాయి. ఆ విధంగా వెడల్పు బోదెల్లో చెరకు నాటించటానికి ప్రయత్నాలు జరగాలి.

- వ్యాసరచయిత సీనియర్ జర్నలిస్టు

# రాజకీయ పదనిసలు

## కర్ణాటకలోనూ గుజరాత్ విధానమే



ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ గుజరాత్ విధానాన్ని కర్ణాటకలో పునరావృతం చేయనుంది. ఓటర్లలో నమ్మకం కలిగించేందుకు హిందూత్వ కార్డుతో పార్టీ ప్రచారం చేయనున్నది. 2018 మేలో ప్రారంభించనున్న రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో పలు దేవాలయాలను, మతపరమైన ప్రదేశాలను సందర్శించనున్నారు. గుజరాత్‌లో మాదిరిగానే ప్రచారంలో ముఖ్యంగా నిరుద్యోగ సమస్య, జిఎస్‌టీ ప్రభావం, మందగించిన జీడీపీ అస్త్రాలుగా సంధించనున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూనే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పనితీరును ముఖ్యాంశంగా ప్రజల్లోకి మరింత చొప్పించనున్నారు. ప్రచార వ్యూహంలో భాగంగా గుజరాత్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ సుమారు 27 దేవాలయాలను సందర్శించారు. ఇవన్నీ కూడా కాంగ్రెస్ పార్టీ గెలిచిన 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనివే....కావడం గమనార్హం.

## నేతలు కలవడానికి బీహార్‌లో కాంగ్రెస్ యాత్ర


రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ కౌకబ్ కాద్రి నాయకుత్వంలో జనవరి 17నుండి ప్రారంభంకానున్న అమంత్రన్ యాత్రతో వీడిపోయిన కాంగ్రెస్ సభ్యులను తిరిగి చేర్చుకునేందుకు బీహార్ కాంగ్రెస్ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మోతిహరి నుండి ప్రారంభం కానున్న ఈ యాత్ర రాష్ట్రంలో మొత్తం ఐదు దశల్లో జరుగుతుంది. పార్టీని వదిలిపెట్టిన వారందరినీ కూడగట్టుకోవడమే ఈ యాత్ర లక్ష్యంగా ఉంది. జితన్ రామ్ మాంఝి వంటి హేమాహేమీలందరూ ఈ యాత్ర పేరుతో సొంతగూటిలోకి చేరనున్నట్లు సమాచారం.

## హర్యానా కాంగ్రెస్‌లో కుమ్ములాటలు



హర్యానాలో పాలక బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటలతో సతమవుతున్నాయి. అశోక్ తన్వర్, భూపేందర్ సింగ్ హుడాల మధ్య జరుగుతున్న పోరుతో కాంగ్రెస్ అధి చాలా అసంతృప్తిగా ఉంది. దీనితో రాహుల్ గాంధీ పీసీసీ నాయకత్వాన్ని మార్పు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ పదవుల్లో తనకు ఆప్తులైన షెల్జా కుమారి, కులదీప్ బిషనోయ్‌ని నియమించనున్నట్లు వార్తలు. ఇదే కనుక జరిగితే రావ్ ఇంద్రజీత్ సింగ్, చౌదరి బీరేందర్‌సింగ్, ధరమ్‌వీర్ ఇతరులు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వేరే కుంపటి పెట్టుకోనున్నట్లు సమాచారం.

## లోక్‌సభకు బాబా రామ్‌దేవ్..!



ఎలక్షన్ కమిషన్ ఆల్వార్ లోక్‌సభ ఉప ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటినుండీ బీజేపీ అభ్యర్థిగా యోగా గురువు బాబా రామ్‌దేవ్ పేరు వినిపిస్తోంది. అల్వార్ సీటుకోసం ఇప్పటికే కరణ్‌సింగ్ యాదవ్ పేరును కాంగ్రెస్ ప్రకటించింది. రాజస్థాన్‌లో రెండు లోక్‌సభ స్థానాలకు ఎన్నికైన వారు మరణించడంతో ఉప ఎన్నిక నిర్వహించాల్సి వస్తోంది. బాబా బాలక్‌నాథ్, జస్వంత్‌సింగ యాదవ్ కూడా అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్నారు. అజ్మీర్‌లో సానుభూతిని క్యాష్ చేసుకునేందుకు ముఖ్యమంత్రి వసుంధర రాజె ప్రయత్నిస్తున్నారు. మరణించినవారి కుటుంబసభ్యుల్నే అభ్యర్థులుగా నిలిపేందుకు ప్రయత్నిస్తుండగా, మరో పక్క కాంగ్రెస్ హైకమాండ్ సచిన్ పైలెట్ పేరు ప్రతిపాదిస్తోంది. ఈ విషయమై పిసిసి చీఫ్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. సచిన్ మాత్రం తాను ముఖ్యమంత్రి అభ్యర్థికి మాత్రమే సహకరిస్తానని చెప్పడం విశేషం. ముఖ్యమంత్రి అభ్యర్థి పేర్లలో సచిన్ తల్లి రమా పైలెట్ పేరు వినవస్తోంది. ఈ రెండు ఉప ఎన్నికలకు సంబంధించి బిరోజ్‌గర్ సంఘతాన్ తన స్వంత అభ్యర్థులను నిలబెట్టేందుకు వ్యూహం యోచిస్తున్నారని తెలుస్తోంది.

విశాలాంధ్ర
బతుకు The Life
శనివారం
06 జనవరి 2018

**రచయితలకు సూచన**

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

ముక్కుసూటితనం, రాజీలేని తత్వం, నిరాడంబరత్వం ఆయన నైజం. ఎవరు ఏమనుకున్నా..ఫలితం ఎలా వున్నా తన అభిప్రాయాన్ని నిర్మోహమాటంగా కుండబద్దలు కొట్టే అరుదైన వ్యక్తిత్వం. మెరుగైన సమాజ నిర్మాణం కోసం నిరంతరం తపన పడే మనస్తత్వం. ఆయనే వాసిరెడ్డి వెంకట కృష్ణారావు ( వి.వి.కృష్ణారావు). బాల్య దశలో కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితమైన కృష్ణారావు అనేక ప్రజా సమస్యలపై గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాటాలు నిర్వహించి జాతీయస్థాయిలో కీలకనేతగా ఎదిగారు. 20వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో మార్క్సిజం, లెనినిజం ప్రభావంతో విప్లవాత్మకమైన మార్పులు సంభవించినప్పటికీ భారతదేశంలో మాత్రం మాతరం వారు ఆశించిన మార్పు రాలేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణారావు తన జీవిత విశేషాలను, రాజకీయ ప్రస్థానాన్ని 'బతుకు'తో పంచుకున్నారు. అవి ఆయన మాటల్లోనే...

# పదవులాశించని పెద్దమనిషి

## వి.వి.కృష్ణారావు




మా స్వగ్రామం గుంటూరు జిల్లా కంతేరు. అమ్మ ఊరు తెనాలి దగ్గర వడ్లమూడి. వాసిరెడ్డి శ్రీకృష్ణయ్య, శకుంతలమ్మ మా తల్లిదండ్రులు. భార్య పేరు జానకి. నలుగురు సంతానం. వారి పేర్లు సుహాసిని, శరత్, మోహన్ గువేరా, అరుణ. మాది సామాన్య రైతు కుటుంబం. నా బాల్యమంతా వడ్లమూడిలోనే సాగింది. హైస్కూలు విద్యాభ్యాసం సంగం జాగర్లమూడిలో, డిగ్రీ గుంటూరు హిందూ కాలేజీలో చదివాను. మా ప్రాంతంలో ఆనాడు కమ్యూనిస్టుపార్టీ బలంగా వుండేది. మా బంధువుల్లోనూ ఎక్కువగానే వుండేవారు. దాంతో సహజంగానే నాపై చిన్నప్పటినుండి కమ్యూనిస్టు ప్రభావం పడింది. గ్రామంలో 'రామయ్య కొట్టు' పార్టీ కార్యక్రమాలకు అడ్డాగా వుండేది. విశాలాంధ్ర, ఆంధ్రప్రభ, సోవియట్ భూమి వంటి పత్రికలు మా గ్రామం వచ్చేవి. చిన్న వయస్సులోనే నాకు రెగ్యులర్‌గా పేపర్ చదవడం అలవాటైంది. మా పెదతల్లి కుమారుడైన భానుప్రసాద్ ఆ ఏరియాలో కమ్యూనిస్టులు ఎక్కడ మీటింగ్ పెట్టినా నన్ను తీసుకెళ్ళేవారు. అప్పట్లో స్టాలిన్ అనుకూల, వ్యతిరేక వాదనలు ఎక్కువగా జరుగుతుండేవి. మేం అనుకూలవర్గంగా వుండేవారం. స్టాలిన్ చనిపోయినప్పుడు పరీక్షలను బహిష్కరించి మరీ నల్లరిబ్బన్లు ధరించి నిరసన ప్రదర్శనం చేశాం. నల్లరిబ్బను ధరించడం నిరసనకు చిహ్నమని నాకు మొదటిసారి అప్పుడే తెల్సింది. పొట్టి శ్రీరాములు చనిపోయిన రోజు కూడా రైలు ఆపు చేశాం. స్కూలు ఉపాధ్యాయుల్లో కూడా కమ్యూనిస్టులు కొందరుండేవారు. విద్యార్థి సంఘాల్లో ఆనాడు ఏఐఎస్ఎఫ్ ఒక్కటే మాకు తెల్సు. విద్యార్థి సమాఖ్య ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న మా పట్ల ఉపాధ్యాయులకు గౌరవ భావం వుండేది. విద్యార్థులు కూడా అలాగే విలువలు పాటించేవారు. పరీక్షల్లో ఎవరూ కాపీ కొట్టేవారు కాదు. నేను చిన్నప్పటినుండి బాగా చదివేవాడ్ని.

### మరువలేని జ్ఞాపకాలు

నేను 7వ తరగతి చదివేటప్పుడు ఒకసారి మా స్కూలుకి దుర్గాభాయి దేశ్‌ముఖ్ వచ్చారు. అప్పుడు 'పరిశ్రమలు-కుటీర పరిశ్రమలు' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించగా నేను దానిపై మాట్లాడాను. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ నా భుజం మీద చేయి వేసి భవిష్యత్తులో నువ్వు మంచి వక్త అవుతావు అని మెచ్చుకున్నారు. ఇప్పటికీ ఆ స్పర్శను, ప్రశంసనను మర్చిపోలేను. టెన్త్ చదివేటప్పుడు మా స్కూలు వార్షికోత్సవానికి లయోలా కాలేజీ ఫిజిక్స్ హెడ్ వి.వి.కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన విజేతలకు బహుమతులందజేస్తుండగా సబ్జెక్టులతోపాటు, వ్యాసరచన, వక్తృత్వం తదితర అన్ని పోటీల్లోనూ నాకే ఫస్ట్ ప్రైజ్ రావడంతో ఆశ్చర్యపోయి నన్ను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. అంతేగాక లయోలా కాలేజీలో చేరతావా ? తీసుకెళతానని ప్రేమగా ఆహ్వానించారు. అలాగే స్కూలులో వుండగా మా స్నేహబృందం రష్యా తరహాలో విద్యార్థులకు అవసరమైన వస్తువులతో ఒక దుకాణాన్ని పెట్టాం. ఎవరికి కావాల్సిన వస్తువులు వారు తీసుకొని అక్కడ బోర్డులో వున్న ధర ప్రకారం వారే డబ్బులు అక్కడ డబ్బాలో వేసి వెళ్ళేలా ఏర్పాటు చేశాం. చిల్లర కావాల్సినవారు కూడా దానిలో నుండే తీసుకోవచ్చు. కొట్టులో ఎవరూ లేకపోయినా ఒక్కరు కూడా మోసం చేసే ప్రయత్నం చేయలేదు. ఇది అందర్నీ ఆశ్చర్యపర్చడమే గాక, చుట్టు ప్రక్కల గ్రామాల్లో కూడా పెద్ద చర్చనీయాంశమైంది.

### కమ్యూనిస్టులే ముందుకొచ్చి ఆదుకున్నారు


నేను 9వ తరగతి చదివేటప్పుడు గ్రామంలో కలరా వ్యాధి వచ్చి దాదాపు 17 మంది చనిపోయారు. అంత్యక్రియల్లో పాల్గొనడానికి గ్రామస్థులు వెనుకాడారు. చివరకు మృతుల బంధువులతో సహా ఎవరూ ముందుకు రాలేదు. కలరా అంటురోగమని అందరూ భయపడ్డారు. అప్పుడు కమ్యూనిస్టులు ధైర్యంగా ముందుకొచ్చి నిలబడడంతో అప్పుడు ఒక్కొక్కరుగా అందరూ ఇళ్ళల్లో నుండి బైటకొచ్చారు. దీనిపై తర్వాత కలెక్టర్ గ్రామానికి వచ్చి మరీ కలరా మృతుల అంత్యక్రియలకు చొరవ తీసుకున్న కమ్యూనిస్టులందర్నీ అభినందించి, ప్రోత్సాహక పత్రాలందజేశారు. అది నా బాల్య జీవితంలో మర్చిపోలేని సంఘటన. ఇటువంటిదే మరొకటి. నాడు కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో బంజరు పోరాటాలు జరుగుతున్నాయి. . దానిలోభాగంగా మా గ్రామంలో పశువులు మేపడానికి వుపయోగపడే రెండెకరాల చెరువు భూమిని దళితులు ఆక్రమించారు. నేను స్కూలు నుండి ఇంటికొస్తుండగా ఆక్రమిత పొలంలోకి రైతులు తోలిన పశువులను దళితులు బైటకు నెట్టేస్తున్నారు. దీంతో గ్రామంలో అప్పటివరకు లేని చీలిక ఏర్పడింది. నేను దళితుల్లో కల్సిపోయాను. నాతోటి స్నేహితులంతా నన్ను వదిలి ఇంటికెళ్ళిపోయారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మమ్మల్ని అందర్నీ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. అయితే పిల్లవాడినంటూ నన్ను వదిలేశారు. ఇంటికి వచ్చిన తర్వాత దళితులకు అండగా నిలబడిన నన్ను మా అమ్మ సమర్థించింది. న్యాయం వైపు నిలబడ్డానని అభినందించింది. ఇది నాకు ప్రజా ఉద్యమాల్లో పాల్గొనేందుకు మరింత ప్రోత్సాహాన్నిచ్చింది.

### ఆ నేతల ఉపన్యాసాలంటే ఎంతో ఆసక్తి

గుంటూరు హిందూ కాలేజీలో డిగ్రీ చదువుతున్న రోజుల్లో విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు పెద్దఎత్తున జరిగాయి. అప్పుడు ఏఐఎస్ఎఫ్ విద్యార్థిసంఘ నేతగా వున్న నన్ను ఆ మహాసభలకు వాలంటీర్‌గా ఎంపిక చేశారు. అదొక గొప్ప అనుభవం. నాటి సభలకు కమ్యూనిస్టుపార్టీ అగ్రనేతలు డాంగే, చంద్ర రాజేశ్వరరావు, భూపేష్ గుప్తా, పుచ్చలపల్లి సుందరయ్య, నంబూద్రిపాద్ వంటి హేమా హేమీలతోపాటు రష్యా నుంచి సుస్లోవ్ వచ్చారు. వీరి ఉపన్యాసాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగాయి. అసలు 7వ తరగతి నుండే వేములపల్లి శ్రీకృష్ణ, పులుపుల శివయ్య, పిల్లలమర్రి వెంకటేశ్వరరావు తదితరుల ఉపన్యాసాలంటే మా తరం వారంతా చెవి కోసుకునేవారు. నాసర్ బుర్రకథ కూడా ఎంతో ఆకట్టుకునేది. అవన్నీ చూసి, విన్న తర్వాతే బాషపై ఇష్టం ఏర్పడడంతోపాటు, 'అలా మాట్లాడాలి' అన్న విషయం తెల్సింది. డిగ్రీ చదువుతుండగానే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగారు. వారికి మద్దతుగా మేం కూడా ఆందోళనలో పాల్గొని అరెస్ట్ అయ్యాం. మా అరెస్టులకు, ఆందోళనలకు అర్థమేమిటో తెలియని గందరగోళం. ఐనా ప్రజల కోసం ఏదో ఒక పోరాటం చేయాలన్న తపన, ఆసక్తి వుండేది.

### ఆర్మీలో వుండి కూడా ప్రజాసమస్యలపై పోరాడా

డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఆర్ఆర్‌బీ పరీక్ష సరదాగా రాస్తే ఉద్యోగం వచ్చింది. దానిలో చేరే ప్రయత్నంలో భాగంగా విజయవాడ వెళితే అప్పుడే ఆర్మీ రిక్రూట్‌మెంట్ జరుగుతోంది. అది 1962వ సంవత్సరం. చైనాతో యుద్ధం జరుగుతోంది. దీంతో ఆర్మీలో చేరి దేశం కోసం పోరాడాలని అనిపించింది. సుమారు ఐదారు వందలమంది ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కాగా వారిలో 80 మంది ఎంపికయ్యారు. వారిలో నేనూ ఒకడ్ని. వాస్తవానికి ఆనాడు కమ్యూనిస్టులతో లింకు వుందని అనుమానం వచ్చినా సైన్యం నుంచి తొలగించే పరిస్థితులున్నాయి. అస్సాంలో నా మొదటి పోస్టింగ్. ఉద్యోగంలో చేరిన కొద్దిరోజుల్లోనే అక్కడ ఓ సంఘటన జరిగింది. స్థానికంగా వుండే గుడిలో పూజారి రోజూ ఆలయాన్ని శుభ్రం చేసే ఊడ్చేవాడ్ని చితక్కొట్టాడు. ఈవిషయం నాకు తెల్సి సీరియస్‌గా స్పందించాను. నాకు ఒక సిక్కు నాస్తికుడు తోడయ్యాడు. ఇద్దరం కల్సి పూజారితో తప్పు ఒప్పించి ఊడ్చేవాడికి క్షమాపణ చెప్పించాం. సైన్యంలో వుంటూ ఇలాంటివి చేయలేరు అనే భావన చాలామందిలో వుండేది. అది సరికాదని చాలా సార్లు నిరూపించాం. అలాగే 1965లో యుద్ధం వచ్చినప్పుడు ఇండోనేషియాలో దాదాపు 10లక్షల మందిని ఊచకోత కోశారు. అప్పుడు నేను లూథియానాలో వున్నాను. సైన్యంలో ఉద్యోగిగా వుండి కూడా ఆ ఊచకోతకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్ వేశాం. అది లింక్ పత్రికలో హైలెట్ అయింది కూడా. ఉద్యోగం పోతుందనో, ప్రమోషన్ ఆగిపోతుందనో భయపడేవాడ్ని కాను. నా మనస్సుకు అన్యాయమనిపిస్తే చాలు తెగపడి పోరాడేవాడ్ని. సైన్యంలో ఒకేరకమైన భావాలు కల్గిన వాళ్ళంతా కలవడానికి పుస్తకాల దుకాణాలే కేంద్రమయ్యేవి. అక్కడ కొనుగోలు చేసే పుస్తకాలను బట్టి ఆయా భావాలు కల్గిన వ్యక్తుల మధ్య పరిచయాలు పెరిగేవి. ఉద్యమనేతలంతా ఎక్కువశాతం అలాగే పరిచయమయ్యారు. అవే మా ఉద్యమాలకు మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి.



### న్యూయేజ్ చేతిలో వుంటే గౌరవం, గొప్ప

కమ్యూనిస్టుపార్టీలో తిరగడమన్నా, పార్టీ సాహిత్య చదవడమన్నా గౌరవంగా వుండేది. చేతిలో 'న్యూయేజ్' పత్రిక వుంటే పెద్ద స్టేటస్‌గా భావించేవారం. విద్యావంతులు, మేధావులు కూడా గౌరవభావంతో చూసేవారు. కాలేజీ ఈవెంట్స్ ఏమైనా వుంటే టీచర్లు, తల్లిదండ్రులు కూడా ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల వెంట మాత్రమే ఆడపిల్లల్ని ధైర్యంగా పంపించేవారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించడం, అంటరానితనం నిర్మూలన వంటి అనేక సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాలే ప్రజల్లో 'కమ్యూనిస్టు' కు గౌరవాన్ని, హోదాను, ప్రతిష్టను తెచ్చిపెట్టాయి. అది ఏస్థాయిలో అంటే ఉద్యోగమేమీ లేకున్నా కమ్యూనిస్టుగా వుండడమనేదే పెద్ద హోదాగా ఉండేది.

### కీలక ఉద్యమాల్లో....

1970వ దశకంలో హైదరాబాద్ వచ్చాను. ఆ సమయంలో లాలాగూడ, బొల్లారం ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో వరవరరావు, జార్జిఫెర్నాండేజ్, బి.నర్సింగరావు, గద్దర్ తదితరులతో పరిచయమేర్పడింది. అప్పటినుండి 1981 వరకు సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ (సీఓసీ)లో సభ్యుడిగా వున్నాను. ఆతర్వాత ఆర్మీ నుండి పూర్తిగా బైటకు వచ్చేశాను. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ చొరవతో 1982 ఏప్రిల్ 26న దేశంలోనే పెద్ద ప్రజాసంఘంగా ఏర్పడిన ఇండియన్ పీపుల్స్ ఫ్రంట్‌కు వ్యవస్థాపక ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాను. తర్వాత జార్జి ఫెర్నాండేజ్‌తో కల్సి 1983లో బెంగళూరులో హిందూ మజ్‌దూర్ కిసాన్ పంచాయ్ (హెచ్ఎంకేపీ) ప్రారంభించి దానికీ వ్యవస్థాపక కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. ఆనాడు రైల్వే కార్మికులకు మూడు,నాలుగు రోజులు వరుస డ్యూటీలు వుండేవి. వేతనాలు కూడా పెద్దగా వుండేవి కావు. దీనిపై సర్వీస్ రూల్స్, వేతనాల అమలు కోసం దేశవ్యాప్తంగా రైల్వే చరిత్రలోనే అతిపెద్ద ఉద్యమం నిర్వహించి విజయవంతమయ్యాం.

### సమతాపార్టీకి తొలి ఏడాదే జాతీయపార్టీగా గుర్తింపు

రబీరే, నితీష్, జార్జి ఫెర్నాండేజ్, నూర్ అహ్మద్ ప్రభృతులతో కల్సి 1990లో సమతా పార్టీని స్థాపించాం. ఆ పేరు కూడా నేనే ఎంపిక చేశాను. దానికీ వ్యవస్థాపక కార్యదర్శిగానే బాధ్యతలు స్వీకరించాను. మొదటి సంవత్సరమే జాతీయపార్టీగా గుర్తింపు లభించింది. బీహార్ రాజధాని పాట్నాలో తొలి బహిరంగసభ నిర్వహించాం. దాదాపు 2లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. తర్వాత పార్టీని అన్ని రాష్ట్రాలకు విస్తరింపజేశాం. 1999 నాటికి దాదాపు మా పార్టీకి 13 మంది ఎంపీలు, రాజ్యసభలో మరో 5గురు ఎంపీలు వుండడంతోపాటు, బీహార్‌లో తమ పార్టీకి చెందిన వారు ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించగా, మహారాష్ట్ర, జార్ఖండ్, యూపీ ప్రభుత్వాల్లో భాగస్వామ్యపక్షంగా వుండే పరిస్థితి ఏర్పడింది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగా ఆ కూటమికి కన్వీనర్‌గా జార్జిఫెర్నాండేజ్ వ్యవహరించారు. ఆయన రక్షణశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత సమతా పార్టీ అధ్యక్షులుగా నేను బాధ్యతలు స్వీకరించాను. తదనంతర రాజకీయ పరిణామాల్లో భాగంగా 2004లో జనతాదళ్‌లో సమతాపార్టీ విలీనమైంది.

### అధికార పదవుల పట్ల ఆసక్తిలేదు

మొదటినుంచీ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడమంటేనే ఇష్టం. అధికారిక పదవులంటే ఆసక్తి లేదు. సమతాపార్టీ అధ్యక్షులుగా పనిచేసిన రోజుల్లో రాజ్యసభ ఎంపీ అవకాశం వచ్చింది. తర్వాత నార్త్ రాష్ట్రాల్లో ఒకదానికి గవర్నర్‌గా నియమించే ప్రతిపాదనా వచ్చింది. కాని నిర్ద్వందంగా తిరస్కరించాను. నాకు ఇష్టంలేదని నిర్మోహమాటంగా చెప్పేశాను. వాస్తవానికి ఆ సమయంలో ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులకు నేనే బి ఫారంపై సంతకాలు పెట్టే పరిస్థితి. అయితే పార్లమెంటరీ అధికారం కోసం తాపత్రయపడే క్రమంలో పార్టీలు అతిపెద్ద అవినీతి కేంద్రాలుగా ఎలా తయారవుతాయో అతి దగ్గరగా చూసిన రోజులను ఎప్పటికీ మర్చిపోలేను. వ్యక్తులను, పార్టీలను అధికారం ఎంతగా లోబర్చుకుంటుందో అర్థమైంది. ఆ తర్వాత సమతాపార్టీకి దూరంగా నా ప్రయాణం సాగింది.

### కమ్యూనిస్టులు, సోషలిస్టులు ఏకమైతేనే మార్పు సాధ్యం

మా తరం వారంతా 20వ శతాబ్దంలో పుట్టాం. ఈ కాలంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు ఉద్యమాలు, సంస్కరణల ఫలితంగా అనేక దేశాల్లో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. అన్నిరంగాల్లో ముందుకెళ్ళాయి. కాని మన దేశం మాత్రం వెనక్కి వెళుతున్నట్లు అనిపిస్తోంది. జనమార్గం పేరుతో ఏ రాజకీయ జెండా లేకుండా నేను తడ నుండి ఇచ్ఛాపురం వరకు ప్రజల జీవన పరిస్థితులపై నిర్వహించిన అధ్యయనంలో అనేక కొత్త విషయాలు తెలిశాయి. ముఖ్యంగా ప్రజలు ఎవరినీ నమ్మలేని స్థితిలో, నాయకత్వాల పట్ల అపనమ్మకంతో వున్నారు. వారు నిరంతరం వెతుకులాటలో వున్నారు. ఈ ఖాళీలో కులం, మతం వచ్చి కూర్చుంటున్నాయి. సాంఘిక, సామాజిక, ఆర్థిక సహాయకహస్తాన్ని అవి అందిస్తుండడమే దానికి కారణం. బాధాకరమేమిటంటే ఈపరిణామాలకు వాలుగా వెళ్ళేవారు తప్ప ఎదురీదే వారే కానరావడం లేదు. కమ్యూనిస్టులు, సోషలిస్టులు బలంగా వున్న భారతదేశంలో 21వ శతాబ్దంలోనూ ఆశించిన మార్పు రాలేదన్న బాధ నా లాంటి వారందరిలో వుంది. అయితే నిరాశ మాత్రం పడడం లేదు. ఎప్పటికైనా మార్పు వస్తుందనే ఆశతోనే వున్నాను. నా వరకు నాకు మార్క్సిజం, లెనినిజం ఒక ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థకు రూపకల్పన చేసే గొప్ప సిద్ధాంతం. అది తడమని విషయం లేదు. దానిని ఎప్పుడైతే మనం మర్చిపోతామో అప్పుడే అనేక విషయాల్లో మన అవగాహన కుదించవేయబడుతుంది. ముఖ్యంగా ఇన్నేళ్ళ నా రాజకీయ ప్రస్తానంలో ఒక విషయం అర్థమైంది. సాధారణ పౌరుడు కూడా ఏదైనా చేయవచ్చు, సాధించవచ్చుననడానికి నేనే ఉదాహరణ. బాల్యదశ నుండి ఇప్పటివరకు నేను పాల్గొనని ప్రముఖ పోరాటాల్లేవంటే అతిశయోక్తి కాదు. ఈవిషయాలన్నీ 'సామాన్యుని సాక్ష్యం' పేరిట త్వరలోనే ఒక బుక్ తీసుకురావాలనుకుంటున్నాను. అయితే నేను, మాలాంటి తరమంతా ఆశిస్తున్న మార్పు రావాలంటే సిద్ధాంతపరంగా కాని, ఆశయాల్లో గాని పెద్ద వ్యత్యాసాల్లేని కమ్యూనిస్టులు, సోషలిస్టులంతా ఐక్యమైతే ఈదేశంలో కూడా మార్పు తీసుకురావడం అంత కష్టమేమీకాదని నా భావన.

**మరిన్ని ఘట్టాలు క్లుప్తంగా....**

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పిల్లల చాకిరీకి వ్యతిరేకంగా కామ్రేడ్ రాజబహుదూర్ గౌడ్, మెగసెసే అవార్డు గ్రహీత శాంతా సిన్హాలతో కల్సి 'కాంపైన్ ఎగనిస్ట్ చైల్డ్ లేబర్' పేరుతో సంస్థ ఏర్పాటు చేసి వ్యవస్థాపక అధ్యక్షులుగా పలు ఉద్యమాలు నిర్వహించారు.
- భారత సైన్యంలో పనిచేస్తూ 1965, 71 యుద్ధాల్లో ప్రత్యక్షంగా పాల్గొని సేవా పథకాలు పొందారు.
- శంకర్‌గుహనియోగి, ఏకే రాయ్ వంటి 50 మంది ప్రముఖులతో కల్సి 'నిరంకుశ విధానాల వ్యతిరేక ఫ్రంట్' ఏర్పాటు చేశారు.
- బర్మా నియంతృత్వానికి వ్యతిరేకంగా జాతీయ కమిటీ ఏర్పాటులో భాగస్వామిగా వున్నారు.
- శ్రీలంకలో తమిళ ఈలం డిమాండ్‌కు మద్దతుగా ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించారు.
- చైనా అధ్యయనం కేంద్రం కన్వీనర్‌గా పనిచేశారు.
- టిబెట్ ప్రజల స్వయం ప్రత్తిపత్తి ఉద్యమంలో భాగస్వామ్యం వహించారు.
- యుగోస్లావియాలోని బెల్‌గ్రేడ్‌లో సోషలిస్టు పార్టీ నిర్వహించిన అంతర్జాతీయ కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీల సదస్సులో పాల్గొన్నారు.
- జనమార్గం కార్యక్రమం ద్వారా తడ నుంచి ఇచ్ఛాపురం వరకు 2 మాసాలు పర్యటించి సామాజిక, ఆర్థిక విషయాలపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించారు.
- మణిపూర్ రాష్ట్రంలో 'మోరె' వద్ద డ్రగ్ రవాణాకు వ్యతిరేకంగా జార్జిఫెర్నాండేజ్‌తో కల్సి వారం రోజులు సత్యాగ్రహం నిర్వహించారు.
- సోషలిస్టు ఆలోచనను, ఆచరణను సమర్థించే కార్యక్రమాలను ప్రస్తుతం సమతా జనమార్గం పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

– చావా రవి, విజయవాడ.






## డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

**జరిగిన కథ**

ఈవాళ ఏమిటో నిస్త్రాణంగా ఉంది. హెచ్చరిక లేదు. బ్రతుకు కంతా అతుకుల బొంతలా ఉంది. అనుకున్నది ఏదీ కూడా ఒక వరసా - ఒక వావిలో జరగడం లేదు. ఇంటి కెళ్ళాలని బుద్ధె య్యడం లేదు. పని తొందరచేత వూళ్ళోనే భోజనంచేసి ఇంటి కొస్తానని శాంతానికి టెలిఫోనుచేసి లేడీ అయ్యంగారింటికి వెళ్ళి వాళ్ళింట్లో భోజనం చేస్తా.

అదేమిటోకాని ఇంటిగురించి సంసారం గురించి చివరికి నాగురించేనా కూడా ఎవరితో మాట్లాడ్డానికీ బుద్ధి పుట్టడం లేదివాళ.మళ్ళీ మరో మాటాలోచిస్తే సంసారం - యిల్లు - పాపాయి - శాంతం మినహాయిస్తే నాకు మిగిలినదేమిటి? నా ఆశలు ఆశయాలు కోర్కెలు ఎవరి కోసం?


పెళ్ళి చేసుకోనంతవరకు గాలి గుడ్డు. మోహంలో పడినంత సేపు ఝుంఝూ మారుత బీభత్సం.తరువాత సంసారంలో అగమ్యగోచరం అయోమయమున్నా! నాకొక్కడికేనా లేక అందరికీ ఇదే అనుభవమా?

(నిన్నటి సంచిక తరువాయి)

### 45 ఆమె

నిన్న రాత్రి అంతా బాగానే వెళ్ళింది. వరదరాజులు - హేమం - ఇద్దరూ చాలా సరదా అయినవాళ్ళు. మా యిద్దరికీ పాత స్నేహితులే. వరదరాజులు, శాస్త్రీ ఇద్దరూ - లండను స్కూలు ఆఫ్ ఎకనామిక్స్‌లో కలిసి చదువుకున్నారు. క్వీన్స్ కాలేజీలో నేను ఆఖరు సంవత్సరం పనిచేసినప్పుడే అతను ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసరు. ఆనర్సు క్లాసులకి నేను భూమిశిస్తు పద్ధతి మీద చెప్పేదాన్ని. అతను "షాహు కారు-మహాజన్ బ్యాంకుల గురించి" చెప్పేవాడు. హేమం, నేను ఇంటరు మొదటి సంవత్సరం నుంచి ప్రొఫెసరుగిరీ వరకూ - కలిసే అన్ని మెట్లూ ఎక్కేం. ఎన్నోసార్లు వాళ్ళింటికి రమ్మనమని పిలిచేరు. కాని వాళ్ళు ఆవడిలో వుండడం, మేం రాయపురం - అంచేత పడలే.

ఇంటికొచ్చాం. దాబామీద వెన్నెల్లో కూచుని బత్తాయి తొనలు వొల్చుకొని తింటున్నాం. పిచ్చాపాటి మాట్లాడుతున్నాం. శాస్త్రి వూరికే హేమం గురించి అదే పొగడ్డం మొదలెట్టాడు. "ఏం అందం అండీ ఆవిడదీ! వరదరాజులది అదృష్టం అంతే" అన్నాడు. నేవూర్కున్నా. ఇంక అదే పదిమాట్లు వల్లించేడు. దాంతో నాకు వొళ్ళు మండింది. "ఏం, నే మాత్రం అందంగాలేనూ? ఆ రోజుల్లో రోజూ నా చెవులో నూరుమాట్లు-వెయ్యి మాట్లు వల్లించేవాడివే. అది ఇప్పుడు మరుపు అయిపోయి హైమావతీ శబ్దం మొదలెట్టేవే!" అని ఏదో అన్నా. దాంతో శాస్త్రి మరిమాటాడలే. మెల్లిగాలేచి క్రిందకి వెళ్ళిపోయేడు. నా కెప్పుడూ అసూయ ఈర్ష్య లేదే - నేనెందుకలా అన్నా? అసలు నా మనసులో అలాంటి ఉద్రేకాలు లేవే? ససేమిరా లేవని ధైర్యంగా అనగలనా? నా మనసులో వుండే చీకటి కోణాలు వెదుక్కోవడానికి నాకే భయం వేస్తుందే - ఏ మూల ఏ ఉద్దేశాలు ఏ తలంపులు దాగివుంటాయో - వాటిని బయటికి లాగితే ఏ రూపం ధరిస్తాయో అని నాకే సాహసం లేకుండా వుంది! ఎవరి హృదయం లోతు వాళ్ళకే తెలియదే! నా మనస్సు కెలకడానికి నాకే బితుకు బితుకుమంటే రెండోవాడి మనస్సు నే తెలుసుకోవడం ఎలా? అసలు బుర్రలోకి ఆలోచన వచ్చినా ఆ ఆలోచన మనదే అన్న సంగతి మర్చిపోతాం కాంసు! అది మనస్సులో ఏ మూలనో బూజుపట్టినట్టు దాంకుంటుంది. అకస్మాత్తుగా అనుకోకుండా అప్రయత్నంగా అన్నాళ్ళు తెరవెనుక దాంకొని మన్ని హేళన చెయ్యడానికే అన్నట్టు చటుక్కున పైకొచ్చేసి మన్ని మాట్లాడిస్తుంది.... ఇవి నా మాటలే, నా ఆలోచనలే అని పించింది. నేను ఎందుకన్నాను ఆ మాటలు? ఎందుకేమిటి? ఒక్క కారణమే అని వేలుమడిచి చెప్పగలమా? నిజంగా నాకు అకారణంగానే ఈర్ష్య ఓర్వలేనితనమే వొచ్చింది. అదీన్నీ ఇన్నీ అప్పుడు కలిగాయి ఆ నిమిషానికి. అనకపోయినా బాగుండి పోను. అయితే ఏంజేయను? మన మనసు మనకి లోబడదు. మన నాలుక మనకంతకంటే లోబడదు... మామూలుగా ఫోంచేసి శాస్త్రి హైకోర్టుకు వెళ్ళిపోయాక "హిందూ" చదువుకుని, అప్పుడే పోస్టు బంట్రోతు "యంగిండియా" పట్టుకొచ్చాడు, పుచ్చుకుని మొదటనుంచి చివరవరకూ చదివే. మళ్ళీ మామూలు




గాంధీగారి "యంగిండియా-"వే - ఎంచేతో ఈవేళ చదివేసరికి ఒక్కసారి ఒళ్ళంతా ఝల్లుమంది. కళ్ళు మూతపడ్డాయి. మూసుకున్నా కళ్ళముందే ఏవో నిప్పు గోళాల్లాగా పరుగెట్టాయి..... మనస్సులో ప్రళయంలా గొచ్చేసింది. ఛా. ఈవేళనుంచి ఖద్దరుతప్ప మరోగుడ్డ కట్టుకుంటే వొట్టు అనుకున్నా.... ఇప్పుడు నే కట్టుకున్న బట్టలు శాశ్వతమా? ఈ యిల్లు - యీ మోటారుకార్లు నావా? నావెల్లా అవుతాయి?... శాస్త్రి డబ్బేగా? అతనిస్తేనేగా నాకొచ్చేయి? నాకు "నాది" అని - "తన"దని భేదంలేదు-కాని..భేదమే..నా బ్యాంకి ఎకౌంటు వేరేగా వుంది. అయితే అదెంత? పట్టుమని ఐదువేలు లేదు. ప్రావిడెంటు ఫండేగా! శాస్త్రిదా? ఎనభై వేలుంది... మా యిద్దరికీ భేదం లేకపోతే బ్యాంకిలో ఖాతా ఇద్దరిపేర కలిసి ఎందుకు వెయ్యడూ? దీనికేదేనా అంతరార్థం వుందా లేక లోకం మీద అందరూ మొగాళ్ళూ చేస్తున్నట్టేనా? అసలు శాస్త్రికి తోచే వుండదు. తోస్తే వుమ్మడిగానే వుంచుతాడే...అయినా ఓ నిశ్చయానికి వొచ్చేక ఇక అట్టే ముందు వెనుకలు ఆలోచనచేసే తత్వంగాదు నాది. నాకు హేమ్లెట్ లాంటి మనుష్యులంటే తలనొప్పి, ముందుకు గొయ్యి - వెనక్కి - నుయ్యి. ఆ గొయ్యి లోతా - ఈ నుయ్యి లోతా - అని మీనమేషాలు లెక్కపెడితే ఏ పనేనా చెయ్యగలమా? ఈ "సైకో ఎనాలిసిస్సు" యీ డాస్టియవుస్కీ తర్జభర్జన నాకు తలనొప్పి...వెంటనే బేబీ ఆస్టినుతీసి ఖద్దరుషాపుకు వెళ్ళి నా డబ్బుతో నూరు రూపాయలు చీరెలు చేతిగుడ్డలు కొనుక్కొచ్చేశా. తలంటి నీళ్ళుపోసుకున్నా...ఆ తడిబట్టలతోనే నా బనార్సు చీర్లు, వాయిల్సు, బెంగుళూరు పట్టుచీరలు, ఉప్పాడ, దాసన్నపేట చాపులు, నర్సాపురం లేసు అండర్వేర్లు, అన్నీ పోగుచేసి తగలెట్టేశాను. ఆ మంట సెగని ఖద్దరుచీర కట్టుకుని ఆ తడిచీరె, జాకెట్టు కూడా మంటలో పారేశాను. ఈ అగ్నిహోత్రంలో నా మనస్సులో అలజడికూడా ఉపశమించింది. ఆ ముతకగుడ్డలు కట్టుకునేటప్పటికి కొత్త జన్మ ఎత్తినట్టే అనిపించింది.

నేనుగూడా నలుగురితోపాటు యవద్భారత దేశంతోపాటు ఎందుకు సత్యాగ్రహంలో చేరకూడదు? నేను మాత్రం ఎంచేత ఈ ట్రిప్లికేను బీచీ అంట ఉప్పు చెయ్యకూడదు? మొన్న నేనో ఉప్పు పొట్లం ఏభై రూపాయలకు కొన్నాను. శాసనోల్లంఘన చెయ్యడం అంటే జైలుకు వెళ్ళడానికి సిద్ధంగా వుండాలి.... అంతపని చెయ్యడానికి మనస్సు ఒప్పుకోవడం లేదు. ఉప్పుచేసినంత మాత్రాన్ని స్వరాజ్యం మనచేతిలోకి వచ్చిపడుతుందా అనిపిస్తోంది. నాకు నమ్మకం తోచడం లేదు. అంచేత ఉద్యమంలోకి దిగను. శాస్త్రికి ఉప్పు పొట్లం కొంటేనే ఎంతో కోపం వచ్చింది. కదా, ఉద్యమంలోకే దిగుతే ఇక చెప్పేదేముంది? ఈ ఖద్దరు వేసుకోవడమే అతనికెంతో కంటకంగా ఉంటుంది. ఈ విషయంలో మాత్రం నా దారి నేను చూచుకోవాలిసిందే! ఏం చెయ్యగలం? నా వ్యక్తిత్వానికి భంగం రాకూడదు. నా అంతరాత్మని నేనే కాపాడుకోవాలి.

### 46 అతడు

శాంతం ఏమిటీ ఇల్లా మారిపోయింది? వరదరాజులు, హేమం బాగా పాతస్నేహితులు కదా అని ఏదో మాట అనేసరికి ఆ ముక్క పట్టుకుని అలా దులిపేసిందేం? మునుపు ఎప్పుడు ఇలాగు లేనేలేదే? "హేమం మంచిరూపసి. వరదరాజులు మంచి అదృష్టవంతుడు సుమా!" అన్నా. దాంతో ఎక్కడలేని రోషం వచ్చింది శాంతానికి. ఆపాళంగా, "నేను రూపసిని కానా? నాకంటే అందమైన వాళ్ళెవరున్నారు? నేనంటే మీ కిష్టంలేదు కాంసు! ఆ మాట స్పష్టంగా అనకూడదా?" అని ఏమిటేమిటో గోదావరి ప్రవాహంలాగ అదేమాటలు! నేను అన్నమాటలు ఏం తప్పులేకపోయినా సమర్థించుకుంటే అనవసరంగా మరింత చర్చలోకి దిగడం అని అనుకుని చల్లగా జారిపోయా.

రాత్రి ఎవరికీ నిద్ర పట్టలే - శాంతం దాబామీద ఉండిపోయింది. మనస్సు పరివరి విధాల పోతూంది. నేనంటే నాలికి తప్పి జారి అన్నాను కాని శాంతాని కేమేనా అనుమానం తగిలిందా?.... ఆ విసురు హేమం మీదికి కాకుండా లేడీ అయ్యంగారిమీదకా? నే నీమధ్యని శాంతం లేకుండా రెండు మూడుసార్లు వెళ్ళడం శాంతాని కేమేనా తెలిసిందేమో? తెలిస్తే మాత్రం అందులో ఏముంది? అసలు మొగుడు పెళ్ళాం మధ్య ఈర్ష్య అంటూ లేకపోతే ప్రేమ లేదంటారు. నిజమేగా అది? అబ్బే, ఎల్లా నిజం అవుతుంది? నామీద ప్రేమకొద్దీ శాంతానికి ఈర్ష్య వచ్చిందా? అదే అవుతే లేడీ అయ్యంగార్కి నాకూ వున్న పరిచయమో - దానిమాట ఏమిటి? అయినా నావల్ల తప్పేం లేదు. బొత్తిగా మరొకళ్ళతో మాట మంతీ ఆడకూడదు అని ఆంక్షవేస్తే ఎల్లా? పెళ్ళికాకముందు ఎన్నో అనుకుంటాం. సంసారం అంటూ వచ్చేక ఎంత ప్రేమ వివాహం అయినా మునుపటి ఉద్దేశాలన్నీ తల్లకిందులవుతాయి. లేకపోతే శాంతం కూడా ఏదో ఆలోచించకోకుండా ఊరికినే దెప్పిందా? అంతే అయివుంటుంది.

జయంతరం మహంతు ఖూనీకేసు త్వరగా అయిపోవడం చేత ఇంటికే సరాసరి వచ్చేశా. మూడుగంటలకే గుమ్మంలో కారు దిగుదునుకదా - గుడ్డ కాలినవాసన! "శాంతం! శాంతం! గుడ్డ కాలినట్టు వాసన వొస్తోంది. ఎక్కడో చూడు" అంటూ లోపలికొచ్చా. భోగిమంటలా వాకిలిమధ్య అగ్నిహోత్రం! గుడ్డల మేటు! బనారసు చీర్లు, లోపలికొచ్చా. భోగిమంటలా వాకిలి మధ్య అగ్నిహోత్రం! గుడ్డలమేటు! బనారసు చీర్లు, బెంగుళూరు సిల్కులు, ఇంగ్లీషు వాయిల్సు, అస్విత్ అండ్ లార్డు బ్లేటరు, లేసు అండర్వేర్లు, ఉప్పాడ జల్తారు చీర్లు, మధుర చీర్లు! పెద్ద హోమ గుండం. అగ్నిపర్వతం. ఖాండవదహనం. ఎన్ని వేల రూపాయలు ఖర్చుచేసి నేను కొన్నానో. నాకేం పాలుపోలేదు. "ఇదంతా ఏమిటీ శాంతం?" అన్నా. మాటాళ్ళే. దగ్గరకెళ్ళా. చేయిపట్టుకుని వూపే. తపస్సులోనో సమాధిలోనో వున్న మనిషిలా వుండెను. కాని మామూలు శాంతం కాదు. ముఖంలో అదో వర్చస్సు! కొంచెం వెనక్కి తగ్గే. ఏమిటా చేతిలోది అని చూశా. గాంధీగారి యంగిండియా. మళ్ళా మనిషి వేపు చూశా. కట్టుకున్నది పల్నాడుచీరె. బందరు అద్దకపు రవికె. ఇంక బోధపడింది మంటలు చల్లారాయి.

**- ఇంకా వుంది.**

# TET Paper-I Syllabus



**I. శిశు వికాసం- అధ్యాపనం (Child Development & Pedagogy)**

★ వికాసం, పెరుగుదల మరియు పరిపక్వత - భావన ; స్వభావం
★ వికాస సూత్రాలు మరియు విద్యలో వాటి అమలు.
★ వికాసాన్ని ప్రభావితం చేసే కారకాలు- జైవిక, మనోవైజ్ఞానిక, సామాజికపరమైన, ఉద్వేగపరమైనవి.
★ వికాసంలోని వివిధ అంశాలు; వాటి పరస్పర సంబంధాలు - (భౌతిక, చాలక, సంజ్ఞానాత్మక, ఉద్వేగాత్మక, సామాజిక, నైతికమైనవి). శైశవ, బాల్య, ఆరంభ, ఉత్తర బాల్య దశల్లో భాషాపరమైన అంశాలు.
★ వికాస అవగాహన - పియాజే, కోహెల్‌బర్గ్, చోమ్‌స్కీ, కార్ల్ రోజర్స్, ఎరిక్‌సన్
★ **వైయుక్తిక భేదాలు** : వైరుఖులు ; సహజ సామర్థ్యాలు, ఆసక్తులు, అలవాట్లు, ప్రజ్ఞ మొదలైన అంశాలలో వ్యక్తిలో ఉండే; వ్యక్తుల మధ్య ఉండే భేదాలు- వాటిని అంచనా వేయడం.
★ మూర్తిమత్వ వికాసం - భావన ; మూర్తిమత్వాన్ని వికసింపజేసే కారకాలు, స్వీయ భావనలు.
★ సర్దుబాటు, ప్రవర్తన సమస్యలు, మానసిక ఆరోగ్యం, రక్షక తంత్రాలు
★ **శిశు వికాస అధ్యయన పద్ధతులు, ఉపగమాలు- అంత** : పరీక్షణ, పరిశీలన, ఇంటర్వ్యూ (పరిపృచ్ఛ), కేస్ స్టడీ, ప్రయోగాత్మక పద్ధతి, అడ్డుకోత పద్ధతి, దీర్ఘకాల అధ్యయన పద్ధతి
★ వికాస కార్యక్రమాలు - ఆటంకాలు, విపత్తులు

**2. అభ్యసనాన్ని అవగాహన చేసుకోవడం ( UNDERSTANDING LEARNING )**

★ అభ్యసనం- భావన- స్వభావం, సాధనాలు- ప్రక్రియ, ఉత్పాదితాలు
★ అభ్యసన కారకాలు - వ్యక్తిగత పరిసరాలకు సంబంధించిన
★ అభ్యసన ఉపగమాలు - వాటి ఆచరణాత్మక - ప్రవర్తనవాదం - (స్కిన్నర్, పావ్‌లోవ్, థార్న్‌డైక్), నిర్మితివాదం (పియాజే, వైగోట్‌స్కీ), సమగ్రాకృతివాదం (కోహ్లెర్, కోఫ్కా), పరిశీలనాత్మకవాదం (బందూరా)
★ అభ్యసన విస్తృతి ; సంజ్ఞానాత్మక, జ్ఞానాత్మక, నిష్పాదనపరమైన.
★ ప్రేరణ - ధారణ అభ్యసనంలో వీటి పాత్ర
★ స్మృతి- విస్మృతి
★ అభ్యసన బదలాయింపు

**3. బోధనశాస్త్ర సంబంధమైన అంశాలు (PEDAGOGICAL CONCERNS)**

★ బోధన - అభ్యాసకునితో మరియు అభ్యసనంతో దాని సంబంధం.
★ వివిధ సన్నివేశాలలో అభ్యాసకులు - సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సన్నివేశాలలో అభ్యాసకుడు.
★ విభిన్న సన్నివేశాలలో బాలలు - ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, సంలీన విద్య (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్)
★ బోధన శాస్త్ర పద్ధతులను అర్థం చేసుకోవడం - అన్వేషణ, పరికల్పన, సర్వే, పరిశీలన, కృత్యాధార అభ్యసనం, సహకార మరియు భాగస్వామ్య అభ్యసనం.
★ వైయక్తిక, సామూహిక అభ్యసరం : అభ్యసన అలవాట్లు, స్వీయ అభ్యసరం, నేర్చుకునే మెలకువలను నేర్చుకోవడం మొదలైన వాటికి సంబంధించిన అంశాలు, సవాళ్ళు.
★ అసమ సమూహాలలో అభ్యసనను నిర్వహించడం, సామాజిక, ఆర్థిక నేపథ్యం, సామర్థ్యాలు, ఆసక్తులు, అభిరుచులు.
★ **అభ్యసన నిర్వహణ నమూనాలు** : ఉపాధ్యాయ కేంద్రిత, పాఠ్య విషయ కేంద్రిత, అభ్యాసి కేంద్రిత పద్ధతులు.
★ బోధన / శిక్షణా సిద్ధాంతం - బ్రూనర్
★ ప్రణాళికాబద్ధమైన కార్యకలాపంగా బోధన ; ప్రణాళికలోని మౌలికాంశాలు.
★ బోధన దశలు - బోధనా పూర్వ, పరస్పర బోధనాంతర దశ.
★ సాధారణ, విషయ సంబంధ నైపుణ్యాలు, బోధనకు కావలసిన మెలకువలు, ఉత్తమ సంధానకర్త లక్షణాలు
★ అభ్యసన వనరులు, స్వీయ, కుటుంబ, సామాజిక, సాంకేతికపరమైనవి.
★ తరగతి గది నిర్వహణ - విద్యార్థి, ఉపాధ్యాయుల పాత్ర; ఉపాధ్యాయుడి నాయకత్వ శైలి, నిర్భయమైన అభ్యసన సన్నివేశాల కల్పన, ప్రవర్తన సమస్యల నిర్వహణ, మంత్రణ, మార్గదర్శకత్వాలు, దండన - చట్టబద్ధమైన అంశాలు, బాలల హక్కులు, సమయ నిర్వహణ.
★ అభ్యసన కోసం మూల్యాంకనం - అభ్యసించిన అంశాల మూల్యాంకనం - వీటిమధ్య భేదాలు - పాఠశాల ఆధారిత మూల్యాంకనం, నిరంతర - సమగ్ర మూల్యాంకనం - దృక్పథాలు - ఆచరణలు.
★ జాతీయ పాఠ్య ప్రణాళిక చట్రం - 2005, విద్యాహక్కు చట్టం- 2009 పరిధిలో బోధన అభ్యసనలను అర్థం చేసుకోవడం.

**II.LANGUAGE-I TELUGU (CONTENT AND METHODOLOGY)**

(Marks : 30)

ఎ) విషయం (మార్కులు-24)

1.పఠనావగాహన (పద్యం, గద్యం రూపాలు)

**2. తెలుగు సాహిత్యం, సంస్కృతి, (ప్రాచీన, ఆధునికం, జానపదం)**

★ నూతన పాఠ్యపుస్తకాలలోని ఇతర తెలుగు కవులు, రచయితలు, పాత్రలు- నేపథ్యం ఇతివృత్తాలు - విశేషాంశాలు, - ప్రక్రియలు - లక్షణాలు, - వివరణలు, - శతకాలు, - కళలు, కళాకారులు, - వేడుకలు, గేయాలు/ పాటలు

**3. పదజాలం**

★ సామెతలు, - జాతీయాలు, - పొడుపు కథలు, - వ్యవహార రూపాలు, - అర్థాలు, - నానార్థాలు, - పర్యాయ పదాలు, - వ్యుత్పత్యర్థాలు, - ప్రకృతి, వికృతులు

**4. భాషాంశాలు :**

★ ద్విత్వ, సంయుక్త, సంశ్లేష అక్షరాలు, వాక్యాలు, వర్గయుక్కులు, పరుషాలు, సరళాలు, భాషాభాగాలు, లింగాలు, వచనాలు, కాలాలు, విభక్తులు, అవ్యయాలు, విరామ చిహ్నాలు, తెలుగు సంస్కృత సంధులు, సమాసాలు, క్రియలు (సమాపక, అసమాపక), వాక్యాలు రకాలు - ఆశ్చర్యార్థక విధ్యర్థక, ప్రశ్నార్థక, సందేహార్థక, అనుమత్యర్థక, నిషేధార్థక, ప్రత్యక్ష పరోక్ష, కర్తరి- కర్మణి- చందస్సు, అలంకారాలు, అర్థవిపరిణామం.

**బి) బోధన పద్ధతులు : (మార్కులు : 6)**

★ భాష, మాతృభాష, మాతృభాష బోధన లక్షణాలు, - భాషా నైపుణ్యాలు - సాధించాల్సిన సామర్థ్యాలు, తరగతి గది అన్వయం, - బోధన పద్ధతులు,
★ ప్రణాళిక, రచన, వనరుల వినియోగం, - బోధనాభ్యసన ఉపకరణాలు
★ నిరంతర సమగ్ర మూల్యాంకనం - నిర్మాణాత్మక మూల్యాంకనం - సంగ్రహణాత్మక మూల్యాంకనం.

**III.LANGUAGE-II ENGLISH (CONTENT AND METHODOLOGY)**

(Marks : 30)

CONTENT (MARKS : 24)

(1) Parts of Speech
(2) Tenses
(3) Active voice & Passive voice
(4) Prepositions and Articles
(5) Degrees of comparison
(6) Clauses
(7) Verbs- Main Verbs- Auxuliary Verbs- Presale Verbs
(8) Adverbs - Types of Adverbs
(9) Conjunction- coordinating conjuction- subordinating conjunction.
(10) Direct and Indirect speech
(11) Questions and question tags
(12) Types of sentences `simple, compound and complex- synthesis of sentences
(13) Phrases ` uses of phrases
(14) Composition - letter writing - orecis writing
(15) Reading Comprehension
(16) Vocabulary - Antonyms, Synonyms and Spellings.
(17) Correction of Sentences.

Methodology (Marks : 06)

1. Aspects of English:- (a) English language- History, nature, importance, principles of English as second language. (b) Problems of teaching/ Learning English.
2, Objectives of teaching English.
3. Development of Language skills :-
(a) Listning, Speaking, Reading & Writing (LSRW).
(b) Communicative skills- Imparting values through Communication.
4. Approaches, Methods, Techniques of teaching English: (a) Introduction, definition & types of Approaches, Methods & Techniques of teaching English (b) Remedial teaching.
5. Teaching learning materials in English.
6. Lesson Planning.
7. Curriculum & Textbooks - Importance and its need.
8. Evaluation in English language.

**IV. మ్యాథమెటిక్స్**

(మార్కులు : 30)

కంటెంట్ (మార్కులు : 24)

**1.సంఖ్యావ్యవస్థ** : సహజ సంఖ్యలు, పూర్ణాంకాలు, పూర్ణ సంఖ్యలు, ఆకరణీయ సంఖ్యలు, స్థాన విలువ, పోలికలు, ప్రాథమిక గణిత పరిక్రియలు - సంకలనం, వ్యవకలనం, గుణకారం మరియు భాగహారం, భారతీయ కరెన్సీ, ప్రధాన మరియు సంయుక్త సంఖ్యలు, ప్రధాన కారణాంకాలు, క.సా.గు., గ.సా.భా., సంఖ్యల యొక్క వర్గము, వర్గమూలము, ఘనము, ఘనమూలము, పైథాగరస్ త్రికాలు.

**2. భిన్నాలు** : భిన్నాలు- భావన, క్రమభిన్నము, అపక్రమభిన్నము, మిశ్రమభిన్నము, పోలికలు, భిన్నాలయొక్క సంకలనం, వ్యవకలనం, గుణకారం, భాగహారం, నిత్యజీవితంలో భిన్నాలు, ఉపయోగాలు, ఆకరణీక సంఖ్యలు, నిర్వచనం, నాలుగు గణిత ప్రాథమిక ప్రక్రియలు, సంఖ్యల యొక్క ధర్మాలు (ఎన్, డబ్ల్యూ, జెడ్, క్యూ) సంఖ్యారేఖ మీద ఎన్, డబ్ల్యూ, జెడ్ మరియు క్యూ లను సూచించడం, అంతమయ్యే భిన్నం, అంతం కాని భిన్నాలు.

**3. అంకగణితం** : ఏకవస్తు మార్గ పద్ధతి, సగటులు, నిష్పత్తి మరియు అనుపాతం, శాతము, లాభం మరియు నష్టం, రుసుము, బారువడ్డీ, చక్రవడ్డీ, అనులోమానుపాతం, విలోమానుపాతం, పని మరియు కాలము, కాలం మరియు దూరము, పన్ను (వ్యాట్)

**4. రేఖాగణితం** : రేఖాగణితము ప్రాథమిక భావనలు, (ద్విమితీయ మరియు త్రిమితీయ ఆకారాలు), కోణాలు రకాలు, రేఖలను కోణాలను నిర్మించడం మరియు కొలవడం, త్రిభుజాలు, త్రిభుజాలలో రకాలు, త్రిభుజాల ధర్మాలు, త్రిభుజాల సర్వసమానత్వం, త్రిభుజాల సర్వసమానత్వ నియమాలు (భు.భు.భు., భు.కో.భు., కో.భు.కో. లం.కో.భు.), చతుర్భుజాలు, చతుర్భుజాల రకాలు, త్రిభుజాల చతుర్భుజాల నిర్మాణాలు, జ్యామితీయ ఆకారాలు, ద్విమితీయ మరియు త్రిమితీయ ఆకారాలను సూచించడం, అయిలర్ సంబంధం, సమాంతర చతుర్భుజం, ట్రెపిజియం, రాంబస్, దీర్ఘచతురస్రం, చతురస్ర ం మరియు గాలిపటం ధర్మాలు, వృత్తాలు భావన, సౌష్ఠవం, పరావర్తన, భ్రమణ, రేఖా సౌష్ఠవాలు.

**5. క్షేత్రమితి** : పొడవు, విస్తీర్ణం, బరువు, సామర్థ్యం, కాలాలు, వాటి ప్రామాణిక ప్రమాణాలు, ఘనము, దీర్ఘఘనాల ఘనపరిమాణము, ఉపరితల వైశాల్యాలు, త్రిభుజము, చతుర్భుజము, సమాంతర చతుర్భుజము, దీర్ఘచతురస్రం, చతురస్రం, రాంబస్, ట్రెపిజియంల చుట్టుకొలత, మరియు వైశాల్యాలు, వృత్తపరిధి వైశాల్యం, వృత్తాకార మార్గాల యొక్క వైశాల్యము, వృత్తంలోని సెక్టార్ యొక్క వైశాల్యం.

**6. దత్తాంశ నిర్వహణ** : దత్తాంశం పరిచయం, పౌనఃపున్య విభజన పట్టికలను తయారుచేయడం, కమ్మీచిత్రం, దిమ్మరేఖాచిత్రం, వృత్తరేఖా చిత్రం, సోపాన రేఖాచిత్రం తయారీ, అవర్గీకృత దత్తాంశం యొక్క అంకమధ్యమము, మధ్యగతము, బాహుళకము కనుగొనుట, పౌనఃపున్య విభాజన పట్టిక, పౌనఃపున్య బహుభుజి, పౌనఃపున్య మరియు సంచిత పౌనఃపున్య వక్రాలు.

**7. బీజగణితం** : బీజగణితం పరిచయం, స్థిరరాశి, చరరాశి, ఘాతము, బహుపదులు, సమీకరణాలు, సర్వసమీకరణాలు ఒక చరరాశి ద్వారా రేఖీయ సమీకరణాలను సాధించడం ఘాతాలు, ఘాతాంకాలు.

**మెథడాలజీ (మార్కులు : 6)**

1. గణితం అర్థం, నిర్వచనాలు, స్వభావం
2. గణితం ఇతర పాఠశాల సబ్జెక్టులతో సహసంబంధం.
3. గణితశాస్త్ర బోధనా ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలు.
4. గణిత బోధనలో శిశుకేంద్రిత మరియు కృత్యాధారిత విధానాలు.
5. గణిత బోధనా పద్ధతులు మరియు గణితంలో ప్రత్యుపాయ చర్యలు
6. గణితంలో వనరుల వినియోగం, బోధనోపకరణాలు, సంస్థాగత పరికరాలు
7. పాఠ్యప్రణాళిక, టెక్స్టుబుక్ మరియు సంస్థాగత ప్రణాళిక
8. మూల్యాంకనం మరియు మూల్యాంకన పద్ధతులు మరియు నిరంతర సమగ్ర మూల్యాంకనం

**V. ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్**

(మార్కులు : 30)

కంటెంట్ (మార్కులు 24)

**1. నా కుటుంబం** : నా - కుటుంబం- వంశవృక్షం, వలసలు, కుటుంబ వ్యవస్థలో మార్పులు, చిన్నకుటుంబం మరియు ఉమ్మడి కుటుంబం, పండుగలు.

**2. పని మరియు ఆటలు** : వృత్తులు, బాల కార్మిక వ్యవస్థ, ఆటలు - స్థానిక, జాతీయ మరియు అంతర్జాతీయ ఆటలు, మార్షల్ ఆర్ట్స్, శ్వాసపై ఆటల ప్రభావం, వేడుకలు, సర్కస్‌లు.

**3. మొక్కలు, జంతువులు** : మనచుట్టూ ఉండే మొక్కలు మరియు జంతువులు, మొక్కలు మరియు జంతువుల ఉత్పత్తులు, మొక్కల భాగాలు, కిరణజన్య సంయోగక్రియ, పుష్పం యొక్క భాగాలు, పరాగ సంపర్కం, ఫలదీకరణం, ఫలాలు విత్తనాలు, వన్య మరియు సాగు పంటలు, వన్య మరియు పెంపుడు జంతువులు వాటి ఆహారం, జంతువులలో పళ్ల అమరిక.

**4. మన ఆహారం** : వివిధ రకాల ఆహారాలు, ధాన్యాలు, కాయకూరలను, ఆహార పదార్థాలను నిలువచేయడం. ఆహారం- పశువులల పోషణ, ఆహారంలో పోషకాలు - లోపాల వల్ల వచ్చే వ్యాధులు.

**5. ఆవాసం** : అవసరాలు, వివిధ రకాల ఇళ్లు, విద్యుత్ ఉపకరణాలు - వాటి ఉపయోగాలు. చీమలు, తేనెటీగల సాంఘిక జీవనం. జంతువుల ఆవాసాలు- వైవిధ్యం.

**6. గాలి** : గాలియొక్క ప్రాముఖ్యత, గాలి సంఘటనలు, వాతావరణం పీడనం, గాలిద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు. వాటి నివారణ చర్యలు. గాలి కాలుష్యం - కారకాలు, వాటి ప్రభావాలు మరియు నివారణ చర్యలు. హరితగృహ ప్రభావం.

**7. శక్తి** : పునరుద్ధరించగల వనరులు, పునరుద్ధరించలేని వనరులు, భవిష్యత్తు శక్తి వనరులు.

**8. నీరు** : నీటి ప్రాముఖ్యత, నీటి వనరులు, ట్యాంకులు, నీటిలో వృక్షజాలం మరియు జంతుజాలం. ద్రవాల కొలతలు, నీటి కాలుష్యం- కారణాలు, వాటి ప్రభావాలు మరియు నివారణ చర్యలు. నీటి శుద్ధికరణ, కరువు, వరదలు.

**9. మన శరీరం - ఆరోగ్యం - పరిశుభ్రత** : మన శరీరం - బాహ్య, అంతర్గత భాగాలు, ఎముకలు, కండరాలు, జ్ఞానేంద్రియాలు, జీర్ణక్రియ, శ్వాసక్రియ, నాడీ వ్యవస్థ, విసర్జన వ్యవస్థ, ప్రసరణ వ్యవస్థ, ప్రథమ చికిత్స.

**10. పటాల అధ్యయనం** : దిక్కులు, మండల, జిల్లా, రాష్ట్ర, భారతదేశం.

**11. భారతదేశ చరిత్ర, మరియు సంస్కృతి** : మానవ పరిమాణం, చరిత్ర పూర్వయుగం, భారత సంస్కృతి- వారతస్వం, నాగరికత, మధ్యయుగ సంస్కృతి, ప్రాచీన చారిత్రక చిహ్నాలు, మతపరమైన ఉద్యమాలు, జైనమతం, బౌద్ధం, భక్తి ఉద్యమం, భారత స్వాతంత్ర్యోద్యమంలో మహోన్నత వ్యక్తులు, ఆధునిక భారతదేశం.

**12. మన దేశం (భారతదేశం)** : ఉనికి, విస్తీర్ణం, భౌగోళిక లక్షణాలు, శీతోష్ణస్థితి, సహజ వనరులు, ఖండాలు, మహాసముద్రాలు, చారిత్రక ప్రదేశాలు, జనాభా.

**13. మన రాష్ట్రం (ఆంధ్రప్రదేశ్)** : సంస్కృతి, రాష్ట్రప్రభుత్వం, గ్రామపంచాయితీ, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్, ప్రాంతీయ అత్యవసర సేవలు, మన రాష్ట్ర చిహ్నాలు, జీవనోపాధి, నాగరికత, నదుల ప్రభావం.

**14. భారత రాజ్యాంగం** : పీఠిక - ప్రధాన భావనలు, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, బాలల హక్కులు.

**15. భద్రత మరియు రక్షణ** : భూకంపాలు, వరదలు, అగ్నిప్రమాదాలు, ప్రథమ చికిత్స, 108 మరియు 104 వాహనాలు.

పెడగాజీ ( మార్కులు : 6)

1. పరిసరాల విజ్ఞానం - భావన, పరిధి (సైన్స్, సాంఘిక శాస్త్రాలు)
2. పరిసరాల విజ్ఞాన బోధన ఉద్దేశాలు, లక్ష్యాలు, (సైన్స్, సాంఘిక శాస్త్రాలు)
3. సైన్స్, సాంఘిక శాస్త్రాల సంబంధం
4. విద్య ప్రణాళిక అమలు విధానం - బోధనా పద్ధతులు
5. బోధన అభ్యసన ఉపకరణాలు
6. మూల్యాంకనం, నిరంతర సమగ్ర మూల్యాంకనం.

# విశాలాంధ్ర బిజినెస్

| | | | | | |
|---|---|---|---|---|---|
| 184.21 ▲ | 54.05 ▲ | 150 ▲ | 200 ▲ | డాలరు | ముడి ▲ |
| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం (విజయవాడ) | వెండి | Vs రూపాయి | చమురు |
| 34,153.85 | 10,558.85 | 28,350 | 40,000 | 63.40 | 68.07 |
| | | 22 క్యారెట్లు, 10 గ్రాములు | కిలో (రూపాయల్లో) | | బ్రెంట్ ధర (డాలర్లలో..) |

### టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

| కంపెనీ | ప్రస్తుత ధర | మార్పు (శాతాల్లో) |
|---|---|---|
| యెస్ బ్యాంక్ | 337.95 | 4.89 |
| అదానీ పోర్ట్స్ | 426.90 | 3.60 |
| ఇండస్ ఇండ్ | 1,701.00 | 3.26 |
| భారతీ ఎయిర్‌టెల్ | 542.25 | 3.25 |
| డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ | 2,472.65 | 2.32 |

### టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

| కంపెనీ | ప్రస్తుత ధర | లాస్ (శాతాల్లో) |
|---|---|---|
| ఓఎన్‌జీసీ | 200.30 | -1.13 |
| విప్రో | 314.00 | -0.80 |
| టాటా మోటార్స్(డీ) | 258.00 | -0.77 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 315.15 | -0.56 |
| ఎస్‌బీఐ | 311.80 | -0.34 |

### విదేశీమారకం విలువ (ఫారెక్స్)

| కరెన్సీ | రూ.విలువ క్రి.ముగింపు | రూ.విలువ ప్ర.ముగింపు |
|---|---|---|
| డాలర్ | 63.52 | 63.40 |
| యూరో | 76.44 | 76.39 |
| పౌండ్ | 86.26 | 85.79 |
| ఆస్ట్రేలియా డాలర్ | 49.76 | 49.74 |
| సింగపూర్ డాలర్ | 47.79 | 47.75 |

### బులియన్

| బంగారం (10 గ్రాములు) | 22 క్యారెట్లు రూ. | 24 క్యారెట్లు రూ. |
|---|---|---|
| హైదరాబాద్ | 28,200 | 30,160 |
| చెన్నై | 28,200 | 30,160 |
| బెంగళూరు | 27,600 | 29,519 |
| ముంబై | 28,930 | 30,941 |
| విజయవాడ | 28,350 | 30,500 |

# 'సహకార' ఎన్నికలపై సందిగ్ధం

**త్రిసభ్య కమిటీ నియామకాలపై తేలని నిర్ణయం**

**విశాలాంధ్ర-అమరావతి:** రాష్ట్రంలోని సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలా, ప్రస్తుత పాలకవర్గాలను పొడిగించాలా అన్న అంశంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది. సహజంగా పాలకవర్గాల పదవీ కాలం మరో ఆరు నెలలలో ముగుస్తుందనగా కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులతో ఓటర్ల జాబితా తయారీ, కొత్తగా సహకార సంఘాల ఏర్పాటు, కొన్ని సహకార సంఘాలను విలీనం చేయటం లాంటి ప్రక్రియలు ప్రారంభమవుతాయి. అయితే ఇప్పటివరకు అలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదు. సహకార సంఘాల అధ్యక్షులు కేంద్ర సహకార బ్యాంకు డైరక్టర్లను, వారు అధ్యక్షులను, సహకార బ్యాంకు అధ్యక్షులు ఆప్కాబ్ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ప్రస్తుత పాలకవర్గాలను పొడిగించాలంటూ బ్యాంకు అధ్యక్షులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. దీంతో సహకార సంఘాల వ్యవహారంపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మొత్తం 2,038 సహకార సంఘాలు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2013 జనవరి 31, ఫిబ్రవరి 4న, రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి చెందినవారు మెజారిటీ పాలకవర్గాలను దక్కించుకున్నారు. 2014 శాసనసభ ఎన్నికల్లో పలువురు సహకార సంఘాల, బ్యాంకుల అధ్యక్షులు టీడీపీలో చేరారు. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 31తో ముగుస్తుంది. సహకార సంఘాల పాలకవర్గ అధ్యక్షులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు, డీసీఎంఎస్ అధ్యక్షులు తమ పదవీకాలాన్ని పొడిగించాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఆప్కాబ్ అధ్యక్షుడు పిన్నమనేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు కాకినాడలో సమావేశమై ఇప్పుడు ఎన్నికలు పెట్టవద్దని, పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగించాలని కోరుతూ ఉపముఖ్యమంత్రి చినరాజప్ప, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడును కలిసి విన్నవించారు. బ్యాంకు అధ్యక్షుల కోరికను సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే పదవీకాలం పొడి గించే బదులు సహకార సంఘాలకు త్రీసభ్య కమిటీ పాలకవర్గాలను నియమించటం మేలని సహకారశాఖ ఉన్నతాధికారులు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీలో ఇద్దరు అధికారులు, ఓ నామినేటెడ్ సభ్యుడు ఉంటారు. పరిస్థితి ఇలా ఉండగా ఎన్నికలు జరపటమా? లేకుంటే ప్రస్తుత పాలక వర్గాలను పొడిగించటమా అన్న అంశాలపై గ్రామీణ ప్రాంత రైతుల అభిప్రాయంగా ఉంది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు సమాచారం. ఎన్నికలకు వెళితే భారీగా ఖర్చుతోపాటు 13 జిల్లాల్లోని మెజారిటీ సంఘాలను దక్కించు కోవాలి. ఫలితాలు తారుమారైతే నంద్యాల, కాకినాడ ఎన్నికల నుంచి ఇప్పటివరకు టీడీపీకి వచ్చిన ఇమేజ్ దెబ్బతింటుందన్న అభిప్రాయంతో పాటు ఈ ప్రభావం 2019 ఎన్నికలపై పడుతుందన్న ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. అయితే ప్రస్తుత పాలక వర్గాల పదవీ కాలాన్ని మరికొంతకాలం పొడిగించాలని వస్తున్న ఒత్తిడులను కూడా ముఖ్యమంత్రి పరిగణనలోకి తీసుకున్నారని, దీనికి తోడు త్రీసభ్య కమిటీ నియామకాలకు అధికారులు సూచిస్తుండటంతో ఏది మేలన్న దానిపై సీఎం ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఏది ఏమైనా జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ముగిసిన తర్వాత సహకార సంఘాల ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అధికారవర్గాలు తెలిపాయి.

## రికార్డు సృష్టించిన సూచీలు

**184 పాయింట్లకు ఎగిసిన సెన్సెక్స్**



**ముంబై:** నూతన సంవత్సరం ప్రథ మార్ధం, వారంతంలో దేశీయ సూచీలు రికార్డులో ముగిశాయి. వరుసగా ఐదవ రోజు సూచీలు గరిష్టాన్ని నమోదు చేశాయి. అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు లాభాలను నమోదు చేయడం, కన్సూమర్ డ్యూరబుల్స్, టెక్, రియాల్టీ, బ్యాంకింగ్ షేర్లు మార్కెట్ ప్రారంభం నుండి లాభాల్ని నమోదు చేశాయి. సెన్సెక్స్ 34 వేల గరిష్టాన్ని దాటగా నిఫ్టీ కీలక 10,500 మార్కును దాటింది. 30షేర్ల బీఎస్ఇ ఇండెక్స్ సూచీ అత్యధికంగా 184.21 పాయింట్లతో 0.54 శాతంతో 34, 153. 85 మార్కులనుచేరింది. ఎన్‌ఎస్ఇ నిఫ్టీ 54.05 పాయింట్ల లాభంతో 0.51 శాతంతో 10,558.85 మార్కులను నమోదు చేసింది. రెండు సూచీలు సుమారు ఈ వారం 0.3శాతం లాభాన్ని నమోదు చేశాయి. ఆసియా షేర్లు అత్య ధిక రికార్డులను నమోదుచేశాయి.

డౌ జోన్స్ ఇండ స్ట్రియల్ యావరేజ్ 25,000 మార్కును గురువారం మొదటిసారి దాటాయి. ఎస్ అండ్ పి 500, నాస్డాక్ కాంపోజిట్ అత్యధిక లాభాలను నమోదు చేశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, పిఎస్‌యుతో పాటు ఇతర బీఎస్ఇ సెక్టరల్ సూచీలు సానుకూలంగానే ముగిశాయి. కన్సూమర్ డ్యూరబుల్స్ 1.25శాతం, టెక్ 0.89శాతం, రియాల్టీ 0.75శాతం ఎఫ్ఎంసిజి 0.74శాతం, లాభాల్లో నమోదయ్యాయి.

## హజ్ హౌస్‌కూ కాషాయం...



**లక్నో:** బీజేపీ హయాంలో సర్వం కాషాయమయమే...విద్యను కాషాయీకరణ చేసింది. పాలనను కాషాయమయం చేసింది. అదీ... ఇదీ అని దేనినీ వదలడం లేదు. చివరికి హజ్ హౌస్‌కూ కాషాయం రంగు పులిమారు. సర్వం కాషాయమయం చేస్తున్నారని, కాషాయీ కరణను బలవంతంగా రుద్దుతున్నారంటూ ఇప్పటికే విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో ఉత్తరప్రదేశ్‌లోని యోగీ సర్కార్ తాజాగా లక్నో హజ్‌హౌస్ వెలుపల కాషాయ రంగు పెయింటింగ్ వేయించింది. దీనిపై ముస్లిం వర్గాలు, విపక్షాలు మండిపడ్డాయి. బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. హజ్ హౌస్‌ను కూడా కాషాయమయం చేయడ మేమిటని నిలదీస్తుండగా, బీజేపీ ముస్లిం మంత్రి ఒకరు స్పందిస్తూ ఇందులో అభ్యంతరకరమైన విషయం ఏముందని ప్రశ్నించారు. లక్నో నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రి కుల అవసరాలను ఇక్కడ హజ్ హౌస్ తీరుస్తోంది. మక్కాకు వెళ్లే యాత్రికుల డాక్యుమెంట్లను అధికారులు ఇక్కడ పర్యవేక్షిస్తుంటారు. ఇక్కడి ప్రార్థనా స్థలంతో పాటు 200 మంది యాత్రికులు ఉండేందుకు ప్రత్యేక రెసిడెన్షియల్ బ్లాక్ ఉంది. యూపీ బీజేపీ ముస్లిం మంత్రి కాషాయంపై అభ్యంతరం ఏమీ లేదన్నారు. 'కాషాయిరంగు శక్తివంతంగా, మెరిసిపోయే రంగుతో ఉంటుంది. హజ్ హౌస్ కూడా చాలా అందంగా కనిపిస్తోంది. విపక్షాలు లేవనెత్తేందుకు ప్రధాన అంశం లేకపోవడంతో ఇలాంటి పసలేని అంశాలు భుజాన వేసుకుంటున్నాయని మంత్రి మొహిసిన్ ఎదురుదాడికి దిగారు.

## ఆధార్ వివరాలతో బ్యాంకుల్లో నగదు మాయం



**విజయవాడ :** ఆధార్ భద్రతకు ముప్పు లేదని ప్రభు త్వాలు పదేపదే చెబుతున్నా... ఆధార్‌తో ఎన్ని అక్రమాలు చేయవచ్చో ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. నకిలీ ఆధార్ కార్డులతో మోసాలు జరుగుతున్నాయి. బ్యాంక్ ఖాతాల్లోని డబ్బు గల్లంతవుతున్నాయి. వ్యక్తిగత జీవితాలు రోడ్డు పాలవుతున్నాయి. అయినా కేంద్రం, యూఐడీఏఐ మాత్రం ఆధార్‌తో వ్యక్తిగత వివరాలకు ధోకా లేదని వాదిస్తున్నాయి. ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన బ్యాంకు అకౌంట్ల చోరి మరింత పెరిగింది. కస్టమర్ల ఆధార్ డేటా వాడుతూ రెండు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నగదు విత్‌డ్రా చేసినట్టు వెల్లడైంది. ఇలా మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయి. కస్టమర్లకు కనీసం సమాచారం లేకుండా ఆధార్ వివరాలు వాడుతూ.. రూ.4,20,098 విత్‌డ్రా అయినట్టు ఆంధ్రాబ్యాంకులో నాలుగు కేసులు నమోదుకాగా... సిండికేట్ బ్యాంకు నుంచి రూ.1,21,500 విత్‌డ్రా అయినట్టు మరో కేసు నమోదైంది. ఈ కేసులు మాత్రమే కాకుండా 2015 నుంచి ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు అకౌంట్ల నుంచి రూ.7.65 లక్షలు మోసపూరితంగా విత్‌డ్రా అయినట్టు మొత్తం 20 ఫిర్యాదులు బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్‌కు అందాయి. ఈ 20 కేసులు ఐదు బ్యాంకులకు చెందినవి మాత్రమే. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో గరిష్ఠంగా 15 కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో రెండు కేసులు, యూసీఓ బ్యాంకులో ఒక కేసు నమోదైనట్టు కేంద్రప్రభుత్వం లోక్‌సభకు చెప్పింది. ఆర్థికమంత్రిత్వ శాఖ డేటా ప్రకారం మొత్తంగా రికార్డైన 25 కేసుల్లో ఆధార్‌తో లింక్ అయి ఉన్న బ్యాంకు అకౌంట్ల నుంచి అక్రమంగా రూ.13.06 లక్షలు విత్‌డ్రా అయినట్టు తెలిసింది. ఇలా పోయిన నగదును బ్యాంకు తన కస్టమర్లకు 10 రోజుల్లో క్రెడిట్ చేయనున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు.. బ్యాంకు అకౌంట్లకు, ఇన్సూరెన్స్ పాలసీలకు, పాన్ వంటి వాటికి కేంద్రం ఆధార్‌ను తప్పనిసరి చేసింది. 2017 డిసెంబరు 15 నాటికి 106.41 కోట్ల కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్, 82.47 కోట్ల అకౌంట్లు ఆధార్‌తో లింక్ అయ్యాయి. అయితే ఆధార్ డేటా లీకైందని వస్తున్న వార్తలపై యూఐడీఏఐ గట్టిగా స్పందించింది. ఆధార్‌డేటా చోరీ చేయడానికి వీలులేదని, ఈ దొంగతనం జరుగలేదంటూ కొట్టిపారేసింది.

**ఆధార్ డేటా హ్యాక్ తేలికే : స్నోడెన్**

ఆధార్ డేటాను హ్యాక్ చేయలేరని యూఐడీఏఐ వాదిస్తుండగా...వంద కోట్ల భారతీయుల ఆధార్ చోరీ చేయడం చాలా సులువని ఎడ్వర్డ్ స్నోడెన్ అంటున్నారు. అమెరికాకు చెందిన అనేక రహస్య పత్రాలు బయటపెట్టిన స్నోడెన్ ఈ వ్యాఖ్యలు చేయడం సంచలనం సృష్టించింది. ప్రజల డేటాను సురక్షితంగా ఉంచామని ప్రభుత్వాలు చెబుతుంటాయని, కానీ ఆ డేటా చోరీకి గురికావడం సర్వసాధారణమేనని ఆయన అన్నారు. ఇటీవల ట్రిబ్యూన్ నిర్వహించిన ఓ స్టింగ్ ఆపరేషన్‌లో ఆధార్ నెంబరు తెలుసుకోవడం తేలికేనని తేలింది. వాట్సాప్ ద్వారా కేవలం రూ.500 చెల్లిస్తే ఆధార్ డేటా వస్తుందని ఆ పత్రిక స్పష్టంచేసింది. దీనిని యూఐడీఏఐ ఖండించింది. కంప్యూటర్ స్పెషలిస్టు స్నోడెన్ మాత్రం ఆధార్ డేటాను హ్యాక్ చేయడం తేలికేనని అన్నారు.

నెలరోజుల గరిష్టంతో


## మెరిసిన బంగారం, వెండి ధరలు

**న్యూఢిల్లీ:** బంగారం ధరలు శుక్రవారం రూ.135లు పెరిగి నెల రోజుల గరిష్టానికి చేరింది. 10గ్రాముల బంగారం ధర రూ.30,500 పలికినట్లు బులియన్ వర్తకులు వెల్లడించారు. అంతర్జాతీయ సానుకూల పరిస్థితులు, డాలర్ డిమాండ్ పెరగడంతో అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్ పెరగడం, స్థానిక ఆభరణాల వర్తకుల నుండి గిరాకీ పెరగడం ప్రధాన కారణంగాఉంది. వెండి ధర రూ.360లు పెరిగి కేజీ వెండి రూ.40,000 మార్కును దాటింది. బంగారం సురక్షితంగా లోహంకావడంతో మదుపరులు బంగారంపై పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయంగా బంగారం ధర 0.72శాతం పెరిగి ఔన్స్ న్యూయార్క్‌లో 1,322 డాలర్లకుచేరింది. వెండి ధర 0.58శాతం పెరిగి ఔన్స్ 17.20 డాలర్లకుచేరంది.

## రెండున్నరేళ్ల గరిష్టానికి చేరిన రూపాయి

**ముంబై:** డాలర్‌తో రూపాయి మారకపు విలువ శుక్రవారం రెండున్నరేళ్ల గరిష్టానికి చేరి 63..36 వద్ద నిలిచింది. గురువారం 63.54 వద్ద ముగిసిన రూపాయి 0.07శాతం పెరిగింది. 2018 స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) అంచనావేయడానికి ముందుగా రూపాయి విలువ పెరిగింది. మొదటి సారి అధికారికంగా ఆర్థిక వృద్ధిని ప్రకటించనున్న నేపథ్యంలో ట్రేడర్లు జాగరూకత వహించినట్లు తెలుస్తోంది. బ్లూమ్‌బర్గ్ సర్వేనివేదిక ఆధారంగా ఈ ఏడాది జీడీపీ 6.7 శాతానికి పెరగవచ్చునని అంచనావేసింది. మోడీ అధికారం చేపట్టిన అనంతరం వృద్ధి తక్కువ నమోదుకావడం ఇదే అని చెప్పవచ్చు. అమెరికా ఉపాధి అవకాశాలు డిసెంబరులో 4.1శాతంగా నమోదుచేసింది. 2017లో రూపాయి 6.35శాతం లాభపడగా, సెన్సెక్స్ 28శాతం పెరిగింది.

# ఏసీలతో ఆరోగ్యానికి హాని!



**విశాలాంధ్ర డెస్క్ :** మధ్య కాలంలో ఎయిర్ కండిషనింగ్ విలాసానికి, సుఖానికి నిర్దిష్ట ఉదాహరణగా మారింది. ఈ ఆధునికయుగంలో గృహాలు, మాల్స్, థియేటర్లు, వాహనాలు, పని ప్రదేశాలలో మాత్రమే కాక మందుల షాపులు, ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలలో సైతం ఎయిర్ కండిషనింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఎయిర్ కండిషనింగ్ ఏర్పాటు చేయడం వెనుక ప్రాథమిక లక్ష్యం సౌకర్యం పొందడంలో ప్రజలను రాజీపడకుండా ఉంచుతూ అదనపు పన్నులు విధించడం ద్వారా సంబంధిత వ్యాపార లాభాలను పెంచుకోవడం. ఇక సులభంగా ఏసీలు కొనుగోలు చేసే వారు తమ ఇళ్లు, కార్యాలయాల్లో పెట్టడానికి ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించరని స్పష్టమవుతున్నది. అయితే ఎయిర్ కండిషనింగ్ అనేక ఆరోగ్య సమస్యలకు దారితీసేలా దుష్ప్రభావాలు కలిగిస్తున్నట్లు ఇటీవలి పరిశోధనల ద్వారా వెల్లడైంది. తీవ్రమైన కాలుష్యం, భూతాపం కారణంగా వాతావరణంలో అవాంఛిత మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రత్యేకించి వేసవిలో భరించలేని వేడిమి, ఉక్కపోత సంభవిస్తున్నాయి. వీటిని తట్టుకుని ఉపశమనం పొందడానికే సంబంధిత తమ ప్రదేశాలలో ఎయిర్‌కండిషనింగ్ ఉండాలని ప్రధానంగా ప్రజలు కోరుకుంటున్నారు. కానీ ఎయిర్‌కండిషనింగ్ ఇళ్లు, పని ప్రదేశాల నుండి బయటకు వచ్చిన తర్వాత వెలుపల ఉండే వేడి వాతావరణాన్ని ఎందుకు తట్టుకోలేకపోతున్నామన్న విషయమై ఎవరూ ఆలోచించడం లేదు. రోగ నిరోధక వ్యవస్థను బలహీనపరుస్తూ రెండు తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య సర్దుకునేవిధంగా శరీరంపై ఒత్తిడి కలగజేయడమే ఇందుకు కారణం. ఎయిర్ కండిషనింగ్ ఆరోగ్యంపై కలిగించే ఇటువంటి వ్యతిరేక ప్రభావాలేమిటో చూద్దాం.

**రోగ నిరోధక శక్తి కోల్పోవడం :** ఎయిర్‌కండిషనింగ్ ఉష్ణోగ్రతలో కృత్రిమంగా మార్పులు సృష్టిస్తుంది. ఇది రోగ నిరోధక శక్తి బలహీనపడడానికి కారణమవుతుంది. ఇల్లు, ఆఫీసుల్లో ఎయిర్‌కండిషన్‌లో ఉంటూ ఆ తర్వాత బయట అధిక వేడిలో సంచరించే వారు తగు కారణం లేకుండానే తరచుగా అస్వస్థతకు గురవుతారు.

**నిరంతరం నిస్సత్తువ :** ఎయిర్‌కండిషనింగ్ ఉష్ణోగ్రత బాగా తక్కువగా పెట్టుకున్నప్పుడు వ్యక్తి శరీరంలో అంతర్గతంగా వణుకు (షివరింగ్) కలుగుతుంది. అదే వ్యక్తి అధిక సమయం పనిచేసినప్పుడు అది అధిక వేడిని ఉత్పన్నం చేయడం వల్ల శరీరాన్ని నిస్సత్తువ ఆవరిస్తుంది. ఇది ఆరోగ్యంపై ఎయిర్ కండిషనింగ్ కలిగించే అత్యంత కీలక ప్రతికూల ప్రభావంగా దీనిని పరిశోధకులు పేర్కొంటున్నారు.

**సైనసైటిస్ (ముక్కు రంధ్రాలు)లో సమస్యలు :** ఎయిర్ కండిషనింగ్ వాతావ రణంలో 4 గంటలు పైగా గడిపిన వారి లో చల్లటి గాలి వల్ల శ్లేష్మ గ్రంథి గట్టిప డటం లేదా పొడిబారి సైనసైటిస్ ఇన్ ఫెక్షన్స్ కలుగుతు న్నట్లు పరిశోధకులు గుర్తించారు.

**కళ్లు పొడిబారడం :** ఎయిర్‌కండిషనింగ్ వాతావరణాలు కళ్లను పొడిబారేలా చేస్తాయి. చల్లటి ఉష్ణోగ్రత వల్ల కంట్లో ఉండే ద్రవం సులభంగా పొడిగా మారి కళ్లలో మంట, కళ్లల్లో దురద కలుగుతుంది, కంటి వెంట నీరు కారుతుంది. అతి శీతలం వల్ల కళ్ల వాపు, ఎర్రబడే ప్రమాదం కూడా ఉంటుంది.

**అంటు వ్యాధులు :** ఎయిర్ కండిషనింగ్ వల్ల కలిగే మరో సాధారణ ప్రతికూల ప్రభావం బలహీన రోగ నిరోధకశక్తి. ఇది చివరకు అంటు వ్యాధిగా మారుతోంది. ఎందుకంటే ఎయిర్ కండిషనింగ్ ప్రక్రియలో పాత గాలి కన్నా ఎక్కువగా తాజా గాలి ప్రసరించదు. మళ్లీ మళ్లీ ఆ గాలినే ప్రసరింపజేయడం వల్ల ఒక వ్యక్తి నుంచి మరొకరికి జలుబు, ఫ్లూ యొక్క సూక్ష్మ క్రిములు వ్యాపిస్తాయి.

**ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది :** ఎయిర్ కండిషనర్లను తరచుగా, సరిగా శుభ్రపరచనప్పుడు, ఎయిర్ ఫిల్టర్లను మార్చనప్పుడు యంత్రాలలో అన్ని రకాల సూక్ష్మక్రిములు, శిలీంధ్ర జాతులు సృష్టించబడతాయి. ఈ చిన్న సూక్ష్మజీవులు వాయువులో ప్రసరించినప్పుడు, అవి న్యుమోనియా, లెజియోనైరెస్ వంటి కొన్ని ప్రమాదకరమైన అంటు వ్యాధులు సహా పలు శ్వాస సమస్యలకు కారణమవుతాయి.

**చర్మం పొడిబారుట :** చల్లని వాతావరణ పరిస్థితులు మీ చర్మం పొడిబారడానికి ఏకైక కారణం కావచ్చు. ఎయిర్ కండిషనర్లు ఉత్పత్తి చేసిన చల్లని గాలి మీ చర్మం కఠినంగా, కాంతి విహీనంగా మారేలా మార్గాలు సృష్టిస్తూ పొడు చేయడం ద్వారా మీ చర్మ కణాలను పొడిగా మారుస్తుంది. చర్మంపై దురదలు కూడా వస్తాయి.

**ప్రతికూల ప్రభావాలు (అలర్జీలు) :** ఎయిర్‌కండిషనర్ల శుభ్రపరుచుటలో అశ్రద్ధ వహిస్తే గాలి ప్రసరించే గొట్టాలలో దుమ్ము, సూక్ష్మక్రిములు, బూజు పోగుబడతాయి. ఆ తర్వాత వీటి నుండి చర్మవ్యాధులు, చర్మ ఎర్రబారడం, దురద పుట్టడం, ఇతర అలర్జీలు కలిగించే సంక్రమిత గాలి ప్రసరిస్తుంది.

### విజ్ఞానం

## చిన్నారుల్లో ఐక్యు పెరగాలంటే...



గర్భిణీలు చివరి మూడు నెలల ఆహారంలో క్రమం తప్ప కుండా గుడ్లు, చేపలు, లెగ్యూమ్స్, నట్స్ బ్రకోలి, ఆకు కూరల వినియోగంతో పుట్టబోయే పిల్లల్లో ఐక్యు లెవెల్స్ పెరుగుతాయని తాజా అధ్య యనం వెల్లడైంది. ఈ ఆహారం వారి జీవితకాలం ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నట్లు కార్నెల్ యూనివర్సిటీ వెల్లడించింది. గర్భిణీలు పైన చెప్పిన ఆహారం వినియోగంతో ప్రినేటల్ బ్రెయిన్ అభివృద్ధి చెందడంతోపాటు కాగ్నిటివ్ బెనిఫిట్స్ ఉంటున్నట్లు తెలుస్తోంది. వీరిచేపట్టిన ప్రయోగంలో 26మంది గర్భిణీలను రెండు గ్రూపులుగా విభజించారు. వీరిలో సగం మంది రోజుకు 480 ఎంజీల అత్యధిక శక్తినిచ్చే కోలిన్ వినియోగించగా మరొక గ్రూపు 930 ఎంజీలు తీసుకున్నారు. వీరికి పుట్టిన పిల్లల జ్ఞాపకశక్తిని 4,7,10,13 నెలల వయసులో ఐక్యును కంప్యూటర్ తెరమీద పరీక్షిస్తే, 930ఎంజీల ఆహారాన్ని తీసుకున్నవారు అత్యంత ఉత్తేజంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## మహిళల ఆరోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యమా...?



నెఫ్రో ప్లస్ దేశంలోని 128 సెంటర్లలో నిర్వహించిన సర్వేలో షాకింగ్ స్టాటిస్టిక్స్ రికార్డయింది. మనదేశంలో డయాలిసిస్ చేయించుకుంటున్న వారిలో మహిళలు 30శాతంగా ఉన్నారు. మన దేశంలో స్త్రీల ఆరోగ్యంపట్ల అత్యంత అశ్రద్ధ వహించడం పరిపాటే... గ్రామీణ ప్రాంతాల్లో డయాలిసిస్ మీద ఉన్నవారిలో 26శాతం కాగా, సెమి అర్బన్ ప్రాంతాల్లో 29శాతం, అదే పట్టణాల్లో 33శాతంగా నమోదయ్యారు. గుజరాత్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర వాసుల్లో కనీసం మహిళలకు డయాలసిస్‌కు అవకాశం ఉంది. ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లో వీరి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మన దేశంలోని 70శాతం మంది మహిళలు డయాలిసిస్ అవసరం ఉన్నట్లుగా కూడా గుర్తించడంలేదు.

## మార్చి 2 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

**విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:** దేశంలో ప్రైవేట్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్‌తో ఏర్పడిన అపెక్స్‌బాడీ కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) 6వ ఎడిషన్ హైదరాబాద్ ప్రాపర్టీ షో 2018ని మార్చి 4 నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ పి.జనార్ధనరెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ టి.చిరంజీవులు, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎస్.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, కోశాధికారి కె.రాజేశ్వర్ ప్రభృతులు ఈ విషయాన్ని శుక్రవారం పత్రికల వారికి తెలిపారు. హైటెక్స్‌లో మూడు రోజుల పాటు జరిగే ప్రాపర్టీషోలో నగర వ్యాప్తంగా రియల్టర్లు, బిల్డింగ్ మెటీరియల్ మాన్యుఫ్యాక్చరర్స్, కన్సల్టెంట్లు, ఫైనాన్షియల్ ఇన్సిట్యూషన్స్, రియల్ ఎస్టేట్ రంగంలో అత్యాధునిక ఆవిష్కరణలను ఒకే గొడుగు కింద ప్రదర్శించనున్నారు. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌లు, అపార్ట్‌మెంట్ కాంప్లెక్సులు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, రిటైల్, కమర్షియల్ కాంప్లెక్సులపై ప్రత్యేక శ్రద్ధ కలిగిన గ్రీడ్ బిల్డింగ్స్‌ను ప్రదర్శించనున్నారు. ఈ షోలో 120 మందికి పైగా డెవలపర్స్, ఆర్థిక సంస్థలు, తయారీ రంగాలకు చెందిన విభిన్నమైన స్టేక్‌హోల్డర్లు పాల్గొననున్నారు. ప్రతి ఒక్కరి అవసరాలు బడ్జెట్‌కు తగినట్లుగా డెవలపర్లు తమ ప్రాపర్టీలను ప్రదర్శించనున్నారు. తద్వారా వినియోగదారులకు జంటనగరాల్లో అత్యుత్తమ గృహ పరిష్కారాలను పొందే అవకాశం కల్పించనున్నారు. అలాగే గృహ రుణాలకు సంబంధించిన సమాచారంతో పాటు వాటిని ఏ విధంగా పొందాలో కూడా వివరిస్తారు. ఈ షోను లక్ష మంది సందర్శిస్తారని అంచనా. సమావేశంలో క్రెడాయ్ ఉపాధ్యక్షుడు ఆదిత్యగౌర, ఆనంద్‌రెడ్డి, డా.ఎంఎస్.ఆనంద్‌రావు, డి.మురళీకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులు సీజీ మురళీమోహన్, వి.రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఫ్లిప్‌కార్ట్‌తో వీడియోకాన్ భాగస్వామ్యం

**విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:** వీడియోకాన్ స్మార్ట్‌ఫోన్ విభాగం వీడియోకాన్ హైప్ తాజాగా ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీనిప్రకారం వీడియోకాన్ స్మార్ట్ ఫోన్ ఫ్లిప్‌కార్ట్ వైదికపై అందుబాటులోకి రానుంది. తొలిదశ భాగస్వామ్యంలో భాగంగా వీడియో కాన్ హై 5 ఉత్పత్తులైన యాక్ససరీస్ అంటే స్మార్ట్‌ఫోన్ పవర్ బ్యాంక్, ఫోన్ చార్జర్ మొదలైనవి ఫ్లిప్ కార్ట్‌లో లభిస్తాయి. స్మార్ట్ ఫోన్ కేబుల్స్, హెడ్‌ఫోన్స్, బ్లుటూత్ స్పీకర్స్ కూడా అందుబాటులో ఉంటాయని వీడియోకాన్ తెలి పింది. వీడియోకాన్ ప్రతినెలా సుమారు ఒక మిలియన్ పవర్ బ్యాంక్స్‌ను విక్రయిస్తుండగా, వాటిలో 50% ఆన్‌లైన్‌లోనే అమ్ముడుపోతున్నట్టు సంస్థ పేర్కొంది.



## ఎక్స్‌పోకు విశేష ఆదరణ

**విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :** భిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు నిలయమైన వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేతలు, హస్తకళలు, ఫ్యాన్సీదుస్తులు ఒకే చోట లభిస్తున్నాయి. టీటీడీ కళ్యాణ మండపంలో సిల్క్‌కాటన్ ఎక్స్‌పో మగువల మనసు దోచుకుంటుంది. ఒకటా, రెండా వేల రకాల చేనేతలు, చీరలు, వివిధ రకాల వస్త్రాలు, వస్తువులు కొలువుదీరాయి. సిల్క్ ఎక్స్‌పోకు వివిధ వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. సామాన్యులు, సంపన్నులు అన్న తేడా లేకుండా అందరికీ సరసమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగాయి. తెలుగువారు అత్యంత ఘనంగా జరుపుకునే సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని టీటీడీ కళ్యాణ మండపంలో ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేశారు. ఈ నెల 13 వరకూ, ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కొనసాగుతుంది. ఉప్పాడ, చందేరి, రాజస్థాని, పోచంపల్లి, బాగల్‌పూర్, బెంగలీ కాటన్, కాశ్మీరీ సిల్క్, బెనారస్, కొండపల్లి టాయిస్, తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ చేనేత హస్తకళలు లభిస్తున్నాయి. ఎగ్జిబిషన్ కన్వీనర్ అక్బర్ మాట్లాడుతూ, వివిధ రకాల వస్త్రాలపై రాయితీలు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. మహిళల నుంచి ఎక్స్‌పోకు విశేష ఆదరణ లభిస్తోందని చెప్పారు.

## భవిష్యత్ అంతా

# ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌దే




**ఫేస్‌బుక్, వాట్స్‌యాప్ వంటివాటిని వాడేస్తూ ఇంకా ఇంటర్నెట్ అంటే ఇంతే తప్పితే వేరే ఏమీ లేదనే భ్రమలో ఉన్నారా.. అయితే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ప్రపంచం గతినే మార్చేయ బోతోంది. ఇకపై మనం ఎక్కువగా వినబోయే పదం ఇది. మన టెక్నాలజీకి భవిష్యత్.**

### ఐఓటీ అంటే..

అనునిత్యం మనం వాడే ప్రతి వస్తువూ మరో వస్తువుకి ఇంటర్నెట్ ద్వారా కనెక్ట్ అవడం. అలాగే ఆయా వస్తువుల్లో అమర్చిన సెన్సార్ల ద్వారా ఆ వస్తువుల పనితీరు, వాతావరణం, ఇతర అంశాలన్నీ ఎప్పటికప్పుడు గమనించబడుతూ దానికి తగ్గట్టు ఇతర నిర్ణయాలను దానంతట అదే తీసుకునే విధంగా తయారైన డివైజ్‌ల సమూహమే ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్. ప్రాణం లేని వస్తువులకు ప్రాణం పోయడంగా ఐఓటీని భావించవచ్చు. ఐఓటీతో ఎన్నో అద్భుతాలు చేయవచ్చు. మచ్చుకు కొన్ని ఐఓటీ ఐడియాలు తెలుసుకుందాం.

### పిల్లలను మానిటర్ చేస్తూ..

ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలను మానిటర్ చేయడానికి మిమో మానిటర్ వంటి పరికరాలు అందుబాటులోకి వస్తాయి. ఇవి ఎప్పటికప్పుడు పిల్లల శ్వాస తీరు ఎలాఉంది, శరీర ఉష్ణోగ్రత ఎలా ఉంది, శరీర భంగిమల వివరాలు, వారి కదలికలను తల్లిదండ్రులకు స్మార్ట్‌ఫోన్‌లలో చూపిస్తుంది.

### మెడిసిన్స్ రిమైండర్‌లు

చాలామంది సరైన సమయానికి మందులు వేసుకోవడం మర్చిపోతుంటారు. www.vitality.net/glowcaps.html అనే లింక్‌లో గ్లోకాప్స్ పేరిట మెడిసిన్స్‌కి సెన్సార్లతో కూడిన మూతలు లభిస్తున్నాయి. ఇవి వై-ఫై ద్వారా మన ఫోన్, ఇతర పరికరాలకు కనెక్ట్ అయి, ప్రతిరోజూ మందులు వేసుకోవలసిన సమయం గురించి ఫోన్‌లో నోటిఫికేషన్లను చూపించడమే కాకుండా ఆ కాప్ శబ్దం చేస్తూ వెలుగుతూ ఆరుతూ ఉంటుంది. మెడిసిన్స్ మిస్ అవకుండా ఇది చాలా అద్భుతంగా ఉపయోగపడుతుంది.

### పెద్దలను గమనిస్తూ..

వయస్సు మీదపడిన పెద్దలు ఎవరైనా ఇంట్లో ఉంటే వారిని నిరంతరం గమనించు కోవలసి వస్తుంటుంది. http://beclose. com/default.aspx అనే లింక్‌లో లభ్యమయ్యే బీ క్లోజ్ అనే ఐఓటీ డివైజ్ ఇంట్లోని అన్ని ప్రదేశాలలో వైర్‌లెస్ సెన్సా ర్లని అమర్చడం ద్వారా ఇంట్లో పెద్దల కదలికలను గమనిస్తూ ఏదైనా సమస్య ఉంటే సంరక్షకులకు తెలియజేస్తుంది.

### డాక్టర్ దగ్గరకు వెళ్లకుండా..

మన శరీరంపై ధరించగలిగే ఓ సెన్సార్ ఎప్పటికప్పుడు ఈసీజీ, హార్ట్ రేట్, రెస్పిరేషన్ రేట్ వంటి కీలకమైన సమాచారాన్ని సేకరిస్తూ ఆ సమాచారాన్ని డాక్టర్‌కి ఇంటర్నెట్ ద్వారా చేరవేస్తుంది. అందువల్ల ఇక పదేపదే డాక్టర్ దగ్గరకు వెళ్లి అన్ని టెస్టులు చేయించుకోవాల్సిన అవసరం లేదు. అన్ని వివరాలు డాక్టర్‌కి చేరిపోయి, వాళ్ల దగ్గర పేషెంట్ రికార్డు ల్లో సేవ్ అవుతుంటాయి. అలాగే బయటి వాతావరణానికి తగ్గట్టు రూమ్ వేడిని మార్చడం వంటి ఎన్నో మార్పులు రాబోతున్నాయి.




# తాజా కాల్ రికార్డింగ్ అప్లికేషన్లు

ముఖ్యమైన ఫోన్‌కాల్స్‌ని రికార్డ్ చేయడానికి కొన్ని కాల్ రికార్డింగ్ అప్లికేషన్లని గతంలో చెప్పుకున్నాం. అయితే ఎప్పటికప్పుడు అప్‌డేట్ కాని అప్లికేషన్లు కొత్త ఆండ్రా యిడ్ వెర్షన్లు వచ్చేకొద్దీ శక్తివంతంగా పని చేయవు. ఈ నేపథ్యంలో అప్‌డేట్‌గా ఉన్న మరికొన్ని కాల్ రికార్డర్ అప్లికేషన్ల గురించి తెలుసుకుందాం.

**Automatic Call Recorder**

ఫోన్ కాల్స్ కనెక్ట్ అయిన వెంటనే వాటంతట అవే రికార్డ్ చేయబడటానికి http://goo.gl/ noLVXm అనే లింక్‌లో లభించే అప్లికేషన్ ఉపయోగపడుతుంది. ఒకవేళ పూర్తి కాల్ రికార్డింగ్ వద్దనుకున్నా ఫోన్ మాట్లాడుతుండగా రికార్డింగ్ చేయదలచుకున్న సమయంలో ఫోన్‌ని షేక్ చేస్తే ఆ కాల్ రికార్డ్ అవుతుంది. చాలా స్పష్టమైన ఎంపీ 3 క్వాలిటీలో కాల్స్ రికార్డ్ అవుతాయి. అన్ని కాల్స్ రికార్డ్ చేయాలా, ఎంపిక చేసుకున్న కాంటాక్టులతో మాట్లాడే కాల్స్‌ని మాత్రమే రికార్డ్ చేయాలా, లేదా కేవలం తెలీని నెంబర్ల నుండి వచ్చే కాల్స్‌ని మాత్రమే రికార్డ్ చేయాలా అన్నది దీనిలో ఎంచుకోవచ్చు.



**Call Recorder -ACR**

ప్లే స్టోర్‌లో https://goo.gl/txWIh5 అనే లింక్‌లో లభిస్తున్న ఈ అప్లికేషన్ కాల్స్‌ని రికార్డ్ చేయడంతోపాటు రికార్డ్ అయిన ఫైళ్లను తేదీలవారీగా గ్రూప్ చేస్తుంది. అలాగే మనం కోరుకున్న మెయిల్ ఐడీకి రికార్డ్ చేసిన ఫైళ్లని మెయిల్ చేసే సదుపాయం కలిగి ఉంటుంది. పాత రికార్డింగులను ఫోన్‌లో స్టోరేజ్ స్పేస్ వృథా కాకుండా వాటంతట అవే డిలీట్ అయ్యే ఆప్షన్ కూడా లభిస్తోంది. ఇలా ఆటోమేటిక్‌గా డిలీట్ చేయబడేటప్పుడు కొన్ని ముఖ్యమైన రికార్డింగ్‌లు ఆటోమేటిక్‌గా డిలీట్ అవకుండా మార్క్ చేసి పెట్టుకోవచ్చు.

**Call Recorder (Free)**

https://goo.gl/uxWywN అనే లింక్‌లో ఈ అప్లికేషన్ అందుబాటులో ఉంది. కాల్స్‌ని మాట్లాడేటప్పుడు మన అవసరాన్ని బట్టి రికార్డింగ్ ఆన్, ఆఫ్ చేసుకునే సదుపాయం, అలాగే ఫేవరెట్స్‌లో జత చేసుకున్న కాంటాక్టులను ఆటోమేటిక్‌గా రికార్డ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్న ఈ అప్లికేషన్ కాల్స్‌ని ఏఎంఆర్, ఎంపీ4, డబ్ల్యూఏవీ ఫార్మేట్లలో రికార్డ్ చేస్తుంది. రికార్డ్ అయిన తేదీ, ఫోన్ నెంబరు, మాట్లాడిన సమయం, ఫైల్ సైజ్ వంటి వివిధ పారామీటర్ల ఆధారంగా రికార్డింగులను ఆర్గనైజ్ చేసుకోవచ్చు.

**Smart Auto Call Recorder**

అలాగే https://goo.gl/uxWywN అనే లింక్‌లో మరో శక్తివంతమైన కాల్ రికార్డింగ్ అప్లికేషన్ లభిస్తోంది. ఇది అనేక రకాల ఆప్షన్లని మనకు కల్పిస్తుంది.

## ఫోన్ ఆఫ్ చేసినా నోటిఫికేషన్లు వస్తుంటే..

సహజంగా ఫోన్ ఆన్ చేసినపుడు చాలా రకాల అప్లికేషన్ల నోటిఫికేషన్లు మనకు స్క్రీన్‌పై కనిపించవు. అందువల్ల చాలామంది తరచూ పవర్ బటన్‌ని ప్రెస్ చేసి, కొత్తగా ఏవైనా నోటిఫికేషన్లు వచ్చాయేమో చెక్ చేసుకుంటూ ఉంటారు. ఇంత శ్రమ పడాల్సిన పనిలేకుండా https://goo.gl/JXyyYL అనే లింకులో లభించే గ్లింప్స్ నోటిఫికేషన్స్ అనే అప్లికేషన్‌ని ఇన్‌స్టాల్ చేసుకుంటే ఫోన్ స్క్రీన్ ఆఫ్‌లో ఉన్నా మీరు ఎంపిక చేసుకున్న అప్లికేషన్ల నుంచి వచ్చే ఏవైనా కొత్త నోటిఫికేషన్లు స్క్రీన్ ఆన్‌అయి, మనకు కనిపిస్తాయి. ఫోన్ జేబులో ఉన్నపుడు స్క్రీన్ ఆన్ అవకుండా పాకెట్ మోడ్ అనే ఆప్షన్‌ను కూడా ఈ అప్లికేషన్‌లో కల్పించారు. అప్లికేషన్లకి వైట్, బ్లాక్ లిస్ట్‌లు లభిస్తున్నాయి.

## హైపర్‌లాప్స్ వీడియోల కోసం

చూస్తుండగానే వేగంగా కదిలి వెళ్లిపోయే మేఘాల్లాంటి వీడియోలు చూసేఉంటారు. డిస్కవరీ వంటి ఛానెళ్లలోనూ, సినిమాల్లోనూ ఇవి కనిపిస్తుంటాయి. అలాగే ఓ మొగ్గ మెల్లగా విచ్చుకుంటూ పువ్వులా మారిపోవడం వంటి వీడియోలు, రోడ్ మీద వెళ్లేటప్పుడు ట్రాఫిక్ వేగంగా కదిలి వెళ్లే తరహా వీడియోలను హైపర్ లాప్స్ లేదా టైమ్ లాప్స్ వీడియోలుగా పరిగణిస్తారు. మీరు కారులో బయటకు వెళ్లినపుడు మీ ఫోన్ కెమెరాల ద్వారా హైపర్ లాప్స్ వీడియోలను రికార్డు చేసుకోవడానికి మైక్రోసాఫ్ట్ సంస్థ మైక్రోసాఫ్ట్ హైపర్‌లాప్స్ అనే అప్లికేషన్లను ఆండ్రాయిడ్ యూజర్ల కోసం విడుదల చేసింది. https://goo.gl/5ynIh6 అనే లింక్‌లోని గూగుల్+ కమ్యూనిటీలో చేరడం ద్వారా బీటా దశలో ఉన్న ప్రోగ్రామ్‌ని డౌన్‌లోడ్ చేసుకుని మీ ఫోన్‌లో వాడుకోవచ్చు. ఇందులో రికార్డ్ బటన్ ప్రెస్ చేసి వదిలేస్తే సరిపోతుంది.

# ఫిబ్రవరిలో 'తారామణి'




డి.వి సినీ క్రియేషన్స్ బ్యానర్ పై యశ్వంత్ మూవీస్ ప్రెసెంట్స్ సగర్వంగా సమర్పించు చిత్రం 'తారామణి' ఈ చిత్రం తమిళంలో చిన్న సినిమాగా విడుదలయ్యి బిగ్గెస్ట్ హిట్ సాధించి భారీ కలెక్షన్స్‌ను రాబట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల కోసం నిర్మాత డి. వెంకటేష్ అందించనున్నారు. హీరోయిన్స్ ఆండ్రియా, అంజలి ప్రధాన పాత్రధారులుగా వసంత్ కుమార్ హీరోగా నటించిన ఈ చిత్రం ప్రస్తుతం సెన్సార్ పూర్తి చేసుకొని 'ఎ' సర్టిఫికెట్ పొంది ఫిబ్రవరి నెలాఖరున ప్రేక్షకుల ముందుకు రానుంది.. ఈ సందర్భంగా నిర్మాత డి వెంకటేష్ మాట్లాడుతూ తమిళంలో తారామణి అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. నేటి యువత ప్రవర్తనకు అద్దం పట్టేలా ఈ చిత్ర కథాంశం ఉండడంతో ప్రేక్షకులు బాగా ఆదరించారు. అందుకే ఇంతమంచి మెసేజ్ ఉన్న తారామణి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలనే ప్రయత్నం జరుగుతోంది... ఈ చిత్రాన్ని అందిస్తున్నందుకు గర్వంగాను, సంతోషంగానూ ఫీల్ అవుతున్నా... తమిళంలో కంటే తెలుగులో ఇంకా పెద్ద విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను... ఈ చిత్రం డబ్బింగ్ అయినా తెలుగు యువతను ఆకట్టుకునేలా ఉంటుంది. ప్రస్తుతం ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని 'ఎ' సర్టిఫికెట్ పొందింది.. ఫిబ్రవరి నెలాఖరులో తారామణి చిత్రాన్ని విడుదల చేయనున్నాము, మిగతా వివరాలు అతి త్వరలో తెలియపరుస్తామని చెప్పారు. ఆండ్రియా, అంజలి, వసంత్ కుమార్ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: యువన్ శంకర్ రాజా, డిఓపి: తేని ఈశ్వర్, కథ- దర్శకత్వం: రామ్.







# 'అమీర్ పేట్ టు అమెరికా' మూవీ పోస్టర్ లాంచ్

రాధా మీడియా బ్యానర్ పై శ్రీమతి స్వప్న కొమండూరి సమర్పించు ఎ టు ఎ, "అమీర్ పేట్ టు అమెరికా" చిత్రానికి సంబంధించిన ఫస్ట్ పోస్టర్‌ని నగర ప్రథమ పౌరుడు ,హైదరాబాద్ మేయర్ శ్రీ బొంతు రామ్‌మోహన్, డిప్యూటి మేయర్ శ్రీ బాబా ఫసివుద్దీన్ కలిసి శుక్రవారం రిలీజ్ చేశారు. చిత్రానికి కర్త, కర్మ, క్రియగా వున్న రామ్ మోహన్ కొమండూరి "ఏ టు ఏ" చిత్రానికి సంబంధించిన పోస్టర్ని వినూత్నంగా డిజైన్ చేసారు. తెలంగాణాకి రారాజు సి.ఎం. కెసిఆర్ ఐతే అమెరికాకి రారాజు డోనాల్డ్ ట్రంప్. తెలంగాణా నుండి అమెరికాకి ఎగురుతున్న విమానంతో కాన్సెప్ట్‌ని సూటిగాచెప్తున్న కొత్త తరహా పోస్టర్ అని పలువురు ప్రశంసించారు. బ్రహ్మానందం, మణిచందన, సమ్మెట గాంధీ, రజని, వేణుగోపాల్, వేణుమాధవ్, వారిజ, తేజస్, పల్లవి దొర, వంశీ కోడూరి, మేఘనా లోకేష్, వంశీ కృష్ణ, సాషా సింగ్, వైవా హర్ష ప్రధానపాత్ర ్లలుగా, అమెరికా నుండి కొందరు, ఇండియా నుండి కొందరు నటించిన చిత్రం "అమీర్ పేట్ టు అమెరికా". ఇటీవలనే చిత్రంలోని పాటను ఫ్లాష్ మాబ్ ద్వారా వినూత్నంగా విడుదల చేసారు. త్వరలోచిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి దర్శకుడు- చల్లా భానుకిరణ్. కెమెరా- అరుణ్, జివల్ బాబు. ఎడిటర్ - ప్రవీణ్ పూడి, సంగీతం- కార్తీక్ కొడకండ్ల.

# కర్తవ్యం సెన్సార్ పూర్తి



నయనతార ప్రధాన పాత్రలో గోపి నైనర్ దర్శకత్వంలో శివ లింగ, విక్రమ్ వేధా వంటి సూపర్ హిట్ చిత్రాలను అందించి, 450 పైగా చిత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసిన ఆర్ రవీంద్రన్, నార్త్ స్టార్ ఎంటర్‌టూన్‌మెంట్స్ అధినేత శరత్ మరార్ సంయుక్తంగా ట్రైడెంట్ ఆర్ట్స్ (Trident Arts ) పతాకం పై తమిళంలో ఇటీవలే విడుదలై సూపర్ హిట్‌గా నిలిచినా అరమ్ (Araam) చిత్రాన్ని తెలుగులో కర్తవ్యం పేరుతో విడుదల చేస్తున్నారు. ఇది ఒక పొలిటికల్ డ్రామా చిత్రం. నయనతార ఒక డిస్ట్రిక్ట్ కలెక్టర్‌గా కనిపించనున్నారు. తెలుగులో ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుని క్లీన్ యూ సర్టిఫికెట్‌తో త్వరలో విడుదలకు సిద్ధంగా ఉంది. తమిళంలో విడుదలైన ఈ చిత్రం నయనతారకు ఎంతో పేరు తెచ్చిపెట్టింది . ఇంతటి ఘన విజయం అందించిన ప్రేక్షకులకి తాను ఎప్పటికి రుణపడి ఉంటాను అని తాను తెలియచేశారు. తాను మరిన్ని మంచి చిత్రాలు చేస్తాను అని తెలియచేశారు. ఈ సందర్భంగా ఆర్ రవీంద్రన్ మాట్లాడుతూ "తమిళంలో ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. నయనతార కెరీర్‌లోనే పెద్ద విజయం సాధించిన ఈ సినిమా తెలుగులో కూడా మంచి విజయం సాధిస్తుంది అని నమ్మకం మాకు ఉంది. తెలుగులో సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుని క్లీన్ యూ సర్టిఫికెట్ వచ్చింది. పవన్ కళ్యాణ్‌తో గబ్బర్‌సింగ్, సర్దార్ గబ్బర్ సింగ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు అందించిన నిర్మాత శరత్ మరార్‌తో కలిసి ఈ చిత్రాన్ని విడుదల చేయటం చాల సంతోషం గా ఉంది. అని కార్యక్రమాలు పూర్తిచేసుకుని కర్తవ్యం చిత్రాన్ని త్వరలో విడుదల చేస్తాం అని చెప్పారు. ఈ చిత్రానికి జీబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. చక్రం, డేంజర్, కృష్ణార్జున చిత్రాలకి పనిచేసిన ఓం ప్రకాష్ ఈ చిత్రానికి కెమెరామెన్‌గా ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలలో బిజీగా ఉంది. త్వరలో విడుదల కానుంది.

# సంక్రాంతికి రంగులరాట్నం!

## రాజ్ తరుణ్



2017లో 'రారండోయ్', 'హలో' వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించిన ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్. తాజాగా రాజ్‌తరుణ్ హీరోగా చిత్ర శుక్లా హీరోయిన్‌గా శ్రీరంజనిని దర్శకురాలిగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'రంగులరాట్నం'. ఈ చిత్రం ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. జనవరి 14న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర హీరో రాజ్‌తరుణ్ జనవరి 4న హైదరాబాద్ అన్నపూర్ణ 7 ఏకర్స్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు.

**ఇటీవల రిలీజ్ అయిన 'రంగులరాట్నం' ట్రైలర్‌కి ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?**

◆ షూటింగ్ అంతా ఫినిష్ అయ్యాక చిన్న సర్‌ప్రైజ్‌గా సంక్రాంతికి వస్తున్నాం. ట్రైలర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. మేము ఎక్స్‌పెక్ట్ చేయలేదు. మా సినిమాకి ఇంత క్రేజ్ రావడానికి ప్రెస్‌వారే ముఖ్య కారణం.

**ఈ ప్రాజెక్ట్ ఎలా సెట్ అయ్యింది?**

◆ సుప్రియగారు సడెన్‌గా ఒకరోజు కాల్ చేసి ఈ సినిమా గురించి చెప్పారు. కథ విన్నాక వెంటనే ఒప్పుకున్నాను. నాకు బాగా నచ్చింది. అలా ఈ చిత్రం స్టార్ట్ అయ్యింది.

**మీ క్యారెక్టర్ ఎలా వుంటుంది?**

◆ మిడిల్ క్లాస్ అబ్బాయి. జనరల్‌గా అందరిలాగే వుంటాడు. కానీ సెలెక్ట్ పర్సన్. నా లుక్, గెటప్ అంతా చాలా కొత్తగా వుంటుంది. ఇప్పటివరకు చేసిన అన్ని చిత్రాల్లో కంటే 'రంగులరాట్నం'లో చేసిన క్యారెక్టర్‌కి మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నా.

**అన్నపూర్ణ స్టూడియోస్ ప్రొడక్షన్ వేల్యూస్ ఎలా వున్నాయి?**

◆ నా ఫస్ట్ సినిమా 'ఉయ్యాలా జంపాలా' చేసేటప్పుడు నేను డైరెక్షన్ ఫీల్డ్‌లో వున్నాను. అప్పుడు చిన్న టెన్షన్ వుండేది. ఇప్పుడు నేను హీరోగా చేస్తున్నాను. అన్నపూర్ణ స్టూడియోస్‌లాంటి పెద్ద సంస్థలో చేస్తున్నప్పుడు చాలా ధైర్యంగా వుంటుంది. అందరూ కొత్తవాళ్ళు అయినప్పటికీ ఎక్కడా ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటారు. అదే ధైర్యంతో ఈ సినిమా చేశాను. క్వాలిటీ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ అవకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఉయ్యాలా జంపాలా' తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్‌లో 'రంగులరాట్నం' సినిమా చేయడం చాలా హ్యాపీగా వుంది.

**సంక్రాంతికి మూడు పెద్ద సినిమాలు రిలీజ్ అవుతున్నాయి కదా? మీ సినిమా రిలీజ్ అవుతుంది. కాంపిటీషన్‌గా ఫీలవుతున్నారా?**

◆ లాస్ట్ ఇయర్ సంక్రాంతికి కూడా మూడు పెద్ద సినిమాలు వచ్చి సక్సెస్ అయ్యాయి. కాంపిటీషన్ అనేది ఎప్పుడూ వుంటుంది. హాలీడేస్ వున్నాయి. సంక్రాంతి పండక్కి ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్ వెళ్ళి సినిమా చూస్తారు. రెండు గంటల పాటు హాయిగా నవ్వుకుని ఎంజాయ్ చేసేలా మా చిత్రం వుంటుంది. సంక్రాంతికి రిలీజ్ అయ్యే అన్ని సినిమాలు బాగా ఆడాలి. ప్రేక్షకులను అలరించాలి. అందులో మా చిత్రం కూడా వుండాలని కోరుకుంటున్నాను.

**ఈ కథలో మీకు అంతగా నచ్చిన అంశం ఏమిటి?**

◆ ఇట్స్ ఎ బ్యూటిఫుల్ లవ్‌స్టోరి. మదర్ సెంటిమెంట్. ఇద్దరు ప్రేమికుల మధ్య వచ్చే లవ్‌సీన్స్ అన్నీ చాలా ఫ్రెష్‌గా వుంటాయి. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా వుంటుంది.

**లేడీ డైరెక్టర్‌తో వర్క్ చేయడం ఎలా అన్పించింది?**

◆ మేల్, ఫిమేల్ అని తేడా వుండదు. డైరెక్టర్ ఈజ్ డైరెక్టర్. స్క్రిప్ట్ రాశాక వారి పాయింట్ వ్యూలో కొన్ని థాట్స్ వుంటాయి. దానికి తగ్గట్లుగా సినిమా చేశారు. శ్రీరంజని సెల్వరాఘవన్ వద్ద చాలాకాలం పని చేశారు. డైరెక్టర్ గురించి బాగా తెల్సు. వెరీ ప్యాషనేట్ డైరెక్టర్. కమాండింగ్‌గా వుంటుంది. తనకేం కావాలో చాలా పర్టిక్యులర్‌గా వుంటుంది. డైరెక్టర్‌కి కావాల్సిన క్వాలిటీస్ అన్నీ శ్రీరంజనిలో వున్నాయి.

**ఈ చిత్రంలో మీ ఇన్‌వాల్వ్‌మెంట్ ఎంతవరకు వుంది?**

◆ వన్స్ కథ విన్నాక నా ఇన్‌వాల్వ్‌మెంట్ ఏమీ వుండదు. ఒకవేళ ఏదన్నా సలహాలు అడిగితే చెప్తాను.

**ట్రైలర్‌కి ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది?**

◆ అమేజింగ్ రెస్పాన్స్ వస్తోంది. అసలు మేము ఎక్స్‌పెక్ట్ చేయలేదు. ట్రైలర్‌కి సోషల్ మీడియాలో హైయ్యస్ట్ వ్యూస్ రావడం చాలా ఆనందంగా వుంది.

**'రంగులరాట్నం' టైటిల్ పెట్టడానికి రీజన్ ఏంటి?**

◆ చాలా టైటిల్స్ అనుకున్నాం కానీ ఏదీ సెట్ కాలేదు. కథలోంచి టైటిల్ వుంటే బాగుంటుందని అందరం డిస్కస్ చేసుకుని 'రంగులరాట్నం' అని పెట్టాం. కథకి యాప్ట్ టైటిల్.

**మ్యూజికల్‌గా ఎలా వుంటుంది?**

◆ 'క్షణం'కి మ్యూజిక్ చేసిన శ్రీచరణ్ ఈ చిత్రానికి బ్యూటిఫుల్ మ్యూజిక్‌ని కంపోజ్ చేశారు. ఆరు పాటలు ఎక్స్‌లెంట్‌గా వున్నాయి. చాలా కొత్త సౌండింగ్‌తో ట్యూన్స్ కంపోజ్ చేశాడు శ్రీచరణ్. నేను కూడా ఇందులో ఒక పాట రాశాను. రీ-రికార్డింగ్ వండ్రఫుల్‌గా చేశాడు. శ్రీచరణ్ మ్యూజిక్ ఈ సినిమాకి చాలా హెల్ప్ అవుతుంది.

**హీరోయిన్ క్యారెక్టర్ గురించి?**

◆ చిత్ర శుక్లా ఫస్ట్‌టైమ్ హీరోయిన్‌గా యాక్ట్ చేస్తోంది. ఎక్కువ రెస్పాన్స్‌బిలిటీస్ వున్న అమ్మాయి క్యారెక్టర్‌ని ప్లే చేసింది. అల్లరి చిల్లరగా తిరుగుతూ సెటిల్ అయిన ఓ అబ్బాయి, అమ్మాయిల మధ్య లవ్ ఎలా స్టార్ట్ అయ్యింది అనేది కథ. ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ సినిమా కథ సాగుతుంది.

**ఈ సినిమా మీకు ఎలాంటి బ్రేక్ తెస్తుంది?**

◆ ప్యూర్ లవ్‌స్టోరి. యూత్, ఫ్యామిలీస్ అందరికీ కనెక్ట్ అయ్యేలా ఈ చిత్రం వుంటుంది. ఆల్‌రెడీ నేను ఫస్ట్‌కాపీ చూశాను. నాకు బాగా నచ్చింది. డెఫినెట్‌గా ఈ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుంది.

**అదర్ ఇంపార్టెంట్ క్యారెక్టర్స్ గురించి?**

◆ సితారగారు నాకు మదర్ క్యారెక్టర్‌లో నటించారు. ప్రియదర్శి నా ఫ్రెండ్ క్యారెక్టర్‌లో నటించాడు. చాలా రియలిస్టిక్‌గా పెర్‌ఫార్మ్ చేశాడు. సిట్యుయేషన్‌కి తగ్గట్లుగా కామెడీ వుంటుంది. సినిమా అంతా ఎంటర్‌టైనింగ్‌గా వుంటుంది.

రాజ్‌తరుణ్, చిత్ర శుక్లా నటించిన ఈ చిత్రంలో సితార, ప్రియదర్శి ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: ఎల్.కె.విజయ్, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, ఆర్ట్: పురుషోత్తం ఎం, నిర్మాణం: అన్నపూర్ణ స్టూడియోస్, దర్శకత్వం: శ్రీరంజని.

# కిమ్‌కు కేరళ సీఎం ప్రశంసలు



తిరువనంతపురం : ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్-ఉన్ అమెరికాకు వ్యతిరేకంగా దృఢమైన వైఖరిని అనుసరించటాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రశంసించారు. అమెరికా 'సామ్రాజ్యవాదాన్ని' కమ్యూనిస్టు చైనా కన్నా మెరుగ్గా ఉత్తర కొరియా గట్టిగా ప్రతిఘటిస్తోందని చెప్పారు. సీపీఐ(ఎం) కొజికోడ్ జిల్లా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 'సామ్రాజ్యవాద' శక్తులను ఎదుర్కోవడంలో ఉత్తరకొరియా మంచి ఉదాహరణగా నిలిచిందని చెప్పారు. చైనాలోని కమ్యూనిస్టు ప్రభుత్వం సామ్రాజ్యవాద శక్తులపై సాధారణ స్థాయిలో విమర్శలు గుప్పిస్తోందని, ప్రజలు ఆశించిన విధంగా పోరాడడంలేదని అన్నారు. "ఉత్తర కొరియా అమెరికాకు వ్యతిరేకంగా గట్టి వైఖరిని అనుసరిస్తోంది. అమెరికాపై ఒత్తిడి తీసుకురావడంలో ఉత్తరకొరియా నూతనోత్తేజంతో విజయం సాధించింది" అని విజయన్ తెలిపారు.

# ట్రిపుల్ తలాక్ బిల్లు వెనుక రాజకీయ ప్రయోజనాలు : సీపీఎం

తిరువనంతపురం : కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటోందని సీపీఐ(ఎం) విమర్శించింది. ముస్లిం మహిల (వివాహంపై హక్కుల రక్షణ) బిల్లు, 2017ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజకీయ లబ్ది కోసం వినియోగించుకుంటున్నారని సీపీఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి కొడియారి బాలకృష్ణన్ విమర్శించారు. ఈ మేరకు పార్టీ పత్రిక 'దేశాభిమాని'లో ఒక వ్యాసాన్ని ఆయన రాశారు. దీనితో పాటు ఈ బిల్లు వెనుక ఒక రహస్య ఎజెండా కూడా ఉన్నదని అన్నారు. ముస్లింలను వేధించే రహస్య ఎజెండా దీని వెనుక ఉన్నదని తెలిపారు. విడాకులు అనేది సివిల్ అంశమని, దీనిని నేరపూరితంగా చేయాలన్న లక్ష్యం ముస్లిం మహిళల హక్కుల రక్షణకు దోహదపడదని పేర్కొన్నారు. ఇది ముస్లిం మతస్థులను లక్ష్యంగా చేసుకోవడమేనని విమర్శించారు. ఇన్‌స్టంట్ ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తమ పార్టీ స్వాగతిస్తుందని ఆయన వివరణ ఇచ్చారు. అయితే, మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు ముస్లిం మహిళలను 'దగా'చేసేదిగా బాలకృష్ణన్ పేర్కొన్నారు. ట్రిపుల్ తలాక్‌ను అనుసరించడాన్ని తమ పార్టీ ఎప్పుడూ సమర్థించదని స్పష్టం చేశారు. ఇది మహిళల గౌరవాన్ని దిగజారుస్తుందని తెలిపారు.

## మన్మోహన్‌కు మోడీ కరచాలనం

న్యూఢిల్లీ : గుజరాత్ ఎన్నికల్లో ప్రధాని మోడీ, మాజీ ప్రధాని మన్మోహన్‌కు మధ్య మాటల తూటాలు పేలిన కొన్ని వారాల తర్వాత శుక్రవారం రాజ్యసభలో ఇరువురు కరచాలన చేసుకున్నారు. ప్రధాని మోడీ మన్మోహన్‌వద్దకు వెళ్లి మన్మోహన్‌కు షేక్ హ్యాండ్ ఇచ్చిన తర్వాత సభను నిరవధికంగా వాయిదా వేసినట్లు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రకటిం చారు. వందేమాతర గీతాలాపనతో రాజ్యసభ కార్యక్రమాలు ముగిశాయి. డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరణ్‌సింగ్‌లకు కూడా మోడీ కరచాలనం చేశారు. సింగ్‌కు ఈనెల 27తో పదవీకాలం ముగియనుంది. గుజరాత్ ఎన్నికల ప్రచారంలో మాజీ ప్రధాని మన్మోహన్ పాక్‌తో కలసి తనను అంతమొందించడానికి కుట్రప న్నారని మోడీ తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో దూమారం లేచిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలకు కాంగ్రెస్ విరుచుకుపడి దేశానికి క్షమాపణలు తెలపాలని ఎగువ, దిగువ సభల్లో గందరగోళం సృష్టించింది. అయితే ప్రధాని ఇప్పటివరకు క్షమాపణ తెలుపనేలేదు.

## లోక్‌సభలో నినాదాల వ్యక్తి గెంటివేత

న్యూఢిల్లీ : లోక్‌సభలోని సందర్శక గ్యాలరీలోని ఒక వ్యక్తి నినాదాలు చేయడంతో వెంటనే అతన్ని సెక్యూరిటీ సిబ్బంది అతన్ని బయటకు తీసుకువెళ్లారు. శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రైతులకు రుణమాఫీపై సమాధానం ఇచ్చిన వెంటనే ఆ వ్యక్తి భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశాడు. ఈ వ్యక్తి నినాదాలు ఎవరూ పట్టించుకోలేదు., కార్యక్రమాలు యథావిధిగా కొనసాగాయి. అతనికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. అతనిపై కేసు నమోదుకు స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సెక్యూరిటీ అధికారులు వెల్లడించారు.

# బస్సుకు బ్రేక్..!

- తమిళనాడు స్తంభన
- జనం అతలాకుతలం
- మంత్రి చర్చలు విఫలం
- టీఎన్‌ఎస్టీసీ మెరుపు సమ్మె
- ఏఐటీయూసీ సహా కార్మికసంఘాల మద్దతు



విశాలాంధ్ర - చెన్నై : ఏఐటీయూసీ సహా పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో... టీఎన్‌ఎస్టీసీ కార్మికుల సమ్మెతో... తమిళనాడు జనజీవనం స్తంభించిపోయింది. బస్సు స్టీరింగ్ నిలిచిపోవటంతో నడిరోడ్డుపై జనం దిక్కుతోచని స్థితిని ఎదుర్కొన్నారు. ఉద్యోగులు, చిరువ్యాపారులు, కూలీనాలీ జనం అల్లాడిపోయారు. కేవలం నెలకు కనీసం రూ.19,500 ఇవ్వాలనే న్యాయమైన కార్మికుల కోరికను తీర్చటానికి తమిళనాడు ప్రభుత్వం తలూపటం లేదు. ఇటీవలే టీఎన్‌ఎస్టీసీ కార్మిక సంఘ నాయకులు గురువారం రవాణ శాఖ మంత్రి ఎం.ఆర్ విజయభాస్కర్‌తో జరిపిన సంప్రదింపులు విఫలమయ్యాయి. కార్మికులు కోరుతున్న వేతనాన్ని, ఇతర బకాయిలు చెల్లించటానికి ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో టీఎన్‌ఎస్టీసీ కార్మికులు మెరుపు సమ్మెకు పిలుపునిచ్చారు. ఫలితంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, టీటీఎస్ఎఫ్, పీటీఎస్, ఎల్‌పీఎఫ్...తదితర కార్మిక సంఘాలన్నీ టీఎన్‌ఎస్టీసీ కార్మికులకు మద్దతుగా నిలిచాయి. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. రాష్ట్ర రాజధాని చెన్నై, మధురై, కోయంబత్తూర్, తిరుచురాపల్లిలో గురువారం సాయంత్రం 6.00 గంటల నుంచే సమ్మె ప్రభావం పడింది. శుక్రవారం 15 వేలకు పైగా తమిళనాడు ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. బస్సులు నడవకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమిళనాడులోని పలు బస్టాండ్లలో వందల సంఖ్యల్లో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు బస్సుల కోసం నిరీక్షించారు.

ప్రైవేటు బస్సుల నిర్వాహకులు అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే, టీఎన్‌ఎస్టీసీ కార్మికుల సమ్మెపై సుమోటోగా విచారణ జరపటానికి మద్రాసు హైకోర్టు అంగీకరించలేదు. శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటల లోపు పిటిషన్ దాఖలు చేస్తే... విచారణ జరుపుతామని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. సమ్మె కారణంగా ఏర్పడిన పరిస్థితులపై సీఎం పళనిస్వామి సీనియర్ మంత్రులతో సమీక్ష జరిపారు. చెన్నైలోని తాంబరం, క్రోమేపేట్, అలందూర్, చెంగల్‌పట్ డిపోల్లో కేవలం 25 శాతం బస్సులే నడుస్తున్నాయి. ఇవి మెయిన్ రూట్లలోనే నడుస్తుండటంతో... మణిమంగళం, సేథుపేట్, మలైపట్టు, కుర్వన్‌మేడు, అమరంపేడు, నందంబాకం ప్రాంతాల్లో ఆటోవాలా దయాదాక్షిణ్యాలతో జనం గమ్యాలకు చేరుతున్నారు.

కోయంబత్తూరులో 22 శాతం బస్సులే అందుబాటులోకి వచ్చాయి. సింగన్నల్లూర్, ఉక్కడమ్, మెట్టు పాలయం, గాంధీపురంలో గ్రామీణ, పట్టణప్రాంత బస్సులను నిలిపివేశారు. ఈరోడ్‌లో ఒక్క బస్సూ డిపో దాటి బయటకు రాలేదు. రామనాథపురంలో 350 బస్సులకుగాను కేవలం 10 శాతం బస్సులే నడుస్తున్నాయి. శివగంగ జిల్లాలో 23 శాతం, తిర్పూర్ జిల్లాలో 163 బస్సులకు 85 నడుస్తున్నాయి. తిరునెల్వేలి జిల్లాలోని పాలాయంకొట్టైలో బస్సులు నిలిపివేశారు. ఉదగమండలం, వెల్లోర్ జిల్లాల్లోనూ బస్సులు కదలలేదు.

## రైతులకు కనీస మద్దతు ధర అందడం లేదు

కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్



న్యూఢిల్లీ : దేశంలోని రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) అందడం లేదని, వారు సరైన ఆదాయం పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్ శుక్రవారం తెలిపారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో సింగ్ మాట్లాడుతూ రైతులు కనీస మద్దతు ధరను పొందడం లేదని తను అనుభవంలో వెల్లడయ్యిందని అన్నారు. 'ఢిల్లీ, కోల్‌కతా మధ్య 100 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాన్ని నేను పరిశీలించాను. వరికి కనీస మద్దతు ధర రైతులకు అందడం లేదు' అని సింగ్ పేర్కొన్నారు. రాష్ట్రాల పంట ఉత్పత్తుల సేకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. 'గోధుమ, వరికి వేర్వేరుగా ఎంసీపీ ప్రకటించబడింది. ధర మద్దతు పథకం కిందకు వస్తే ప్రభుత్వం తప్పనిసరిగా కొనుగోలు చేయాలి. ఒక రాష్ట్రం నుంచి ఆ మేరకు ప్రతిపాదన వచ్చినపుడు. కొనుగోలుకు కేంద్రం నగదు ఇస్తుంది. 8 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పప్పు ధాన్యాలు, పత్తిని కొనుగోలు చేయాలని నేను భావిస్తున్నా' అని మంత్రి తెలిపారు. ఇందుకోసం మంచి వ్యవస్థను ఎలా ఏర్పాటు చేయాలో గుర్తించడానికి నీతి అయోగ్, రాష్ట్రాలతో సంప్రదింపులు జరిగాయన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలపై అనేక మంది సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పై విధంగా సమాధానమిచ్చారు. యూరోపియన్ దేశాలు ఇంతకు ముందు భారత్ నుంచి మామిడిని నిషేధించాయన్నారు. అయితే వాటిని తిరిగి ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## చిట్‌ఫండ్ కుంభకోణాల్లో
# పాత్రధారులందరిపై చర్యలు : కేంద్రం



న్యూఢిల్లీ : చిట్‌ఫండ్ కంపెనీల్లో మదుపుదారులను మోసం చేసిన వారందరినీ వదిలి పెట్టేది లేదని, పాత్రధారులందరిపైనా చర్యలుంటాయని లోక్‌సభలో శుక్రవారం ప్రభుత్వం తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడుతూ చిట్‌ఫండ్ సమస్యలను సెబీ పరిశీలిస్తోందని, అటువంటి కంపెనీల ఆస్తులు సీజ్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మదుపుదారుల డబ్బును తిరిగి చెల్లించేందుకు ఆ ఆస్తులను అమ్మివేస్తామన్నారు. ఒక క్లిష్టమైన ప్రక్రియ తర్వాత కొంత డబ్బును తిరిగి పొందడం జరిగింది. ఎవరైతే నిర్వహించారో, పాత్ర కలిగి ఉన్నవారు ఎవరైనా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం' అని ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన తెలిపారు. జైట్లీ స్పందన తర్వాత కాంగ్రెస్ ఎంపీ అదిర్ రంజన్ చౌదురి మాట్లాడుతూ ప్రముఖ వ్యక్తులు అనేక మంది పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్న చిట్‌ఫండ్ కంపెనీల ద్వారా పశ్చిమ బెంగాల్‌లో వేలాది మంది ప్రజలు మోసపోయారని అన్నారు. ఈ సందర్భంగా చౌదురికి వామపక్ష పార్టీల సభ్యులు మద్దతు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో రోజ్ వ్యాలీ చిట్‌ఫండ్ కుంభకోణంతో సంబంధం ఉందన్న ఆరోపణలపై లోక్‌సభలో టీఎంసీ నాయకుడు సుదీప్ బందోపాధ్యాయను గతంలో సీబీఐ అరెస్టు చేసింది. జైట్లీ మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణకు ఒక సమర్థవంతమైన చట్టాన్ని రూపొందించడంపై ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కంపెనీల చట్టం ప్రకారం, ఒక ప్రైవేటు కంపెనీకి తన డైరెక్టర్లు, వారి బంధువుల నుంచి, తన సభ్యుల నుంచి పరిమిత సంఖ్యలో డిపాజిట్ల స్వీకరణకు అనుమతి ఉంది. జైట్లీ మాట్లాడుతూ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీలు) ద్వారా అందుకున్న డిపాజిట్లకు చెందిన నియమ నిబం ధనల ఉల్లంఘన విష యంలో 24 ప్రైవేటు కంపెనీలకు వ్యతిరేకంగా వేర్వేరు ఫిర్యాదులు వచ్చాయన్నారు. 'కంపెనీల చట్టం 1956/2013 నిబంధనల క్రింద నాలుగు కంపెనీలపై 15 కేసులు దాఖలయ్యాయి' అని ఆయన పేర్కొన్నారు.

**రుణమాఫీ హామీలపై హెచ్చరించారు : జైట్లీ**

రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార సమయంలో రుణ మాఫీ హామీ ఇవ్వడం ఇబ్బందులతో కూడుకున్నదని రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ ఒకరు హెచ్చరిస్తూ ఎన్నికల సంఘానికి లేఖ రాశారని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. రుణాల చెల్లింపునకు లబ్ధిదారులకు ఆర్థిక స్థితి ఉన్నప్పటికీ చెల్లింపులు నిలిపివేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారని జైట్లీ వివరిం చారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక లిఖిత పూర్వక సమాధానమిస్తూ, 'లబ్ధిదారులు రుణ చెల్లింపులను నిలిపివేయడం వల్ల బ్యాంకింగ్ రంగంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపుతుంది' అని ఆయన వివరించారని పేర్కొ న్నారు. అయితే ఆ ఆర్‌బీఐ మాజీ గవర్నర్ పేరుగానీ, లేఖ రాసిన ఎన్నికల సంఘం అధికారి పేరునుగానీ ఆయన వెల్లడించలేదు. సిడ్బీ, నాబార్డులు సంయుక్తంగా నిర్వహించిన ఒక సదస్సునుద్దేశించి ఆర్‌బీఐ మాజీ గవర్నర్ ప్రసంగిస్తూ రుణ మాఫీ, రాయితీలు ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీస్తాయని చెప్పారని జైట్లీ వివరించారు.

## పార్లమెంటు సమావేశాలు ఫలవంతం : కేంద్రం

న్యూఢిల్లీ : పార్లమెంటు సమావేశాలు ఫలవంతమయ్యాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. శుక్రవారంతో ముగిసిన పార్లమెంటు శీతాకాల సమావేశాలలో లోక్‌సభ 91.58 శాతం, రాజ్యసభ 56.29 శాతం పని తీరును ప్రదర్శించాయని కేంద్ర మంత్రి అనంత కుమార్ ఇక్కడ తెలిపారు. 'శీతాకాల సమావేశాలు జరిగిన 13 రోజులలో రాజ్యసభలో తొమ్మిది బిల్లులు, లోక్‌సభలో 13 బిల్లులు ఆమోదం పొందాయని, ఈ సమావేశాలలో ఇదొక మైలు రాయి' అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఈ సమావేశాల్లో 17 బిల్లులను ప్రవేశపెట్టగా, రెండు సభల్లో 12 బిల్లులు ఆమోదం పొందా యన్నారు. 'సమావేశాలు ఫలవంతంగా జరగడంలో సహకరించిన ఉభయ సభల్లోని అన్ని పార్టీల సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని కుమార్ అన్నారు. ఈ సమావేశాల్లో రాజ్యసభలో ఆమోదం పొందని ట్రిపుల్ తలాక్ బిల్లుపై ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కీలకమైన చట్టం నిలిచిపోవ డానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని అన్నారు. ఇదిలా ఉండగా, డిసెంబరు 15న ప్రారంభమైన శీతాకాల సమావేశాలు జనవరి 5వ తేదీ శుక్రవారంతో ముగిశాయి. ఈ 22 రోజులలో 13 సమావేశాలు జరిగాయి. కాగా ఉభయ సభలూ నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# బాల్య వివాహాలకు చెక్ పెట్టాల్సిందే..

- ఒడిశా సదస్సులో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధి ఉద్ఘాటన
- రోజుకు 3600 పెళ్లిళ్లు.. భారత్‌లోనే అత్యధికం
- అగ్రస్థానంలో జార్ఖండ్, రాజస్థాన్, బీహార్




భువనేశ్వర్ : దేశంలో రోజుకు సుమారు 3600 బాల్యవివాహాలు నమోదు అవుతుండడాన్ని జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా పరిగణించింది. ఈ సామాజిక రుగ్మతను తుదిముట్టించాలని పిలుపిచ్చింది. బాల్యవివాహాలపై సహనం పనికిరాదని, బాల్యవివాహాల నివారణ చట్టాన్ని (2006) కఠినతరం చేయాల్సిందేనని పేర్కొంది. భువనేశ్వర్‌లో జరిగిన బాల్య వివాహాలపై ప్రాదేశిక సదస్సులో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రధాన కార్యదర్శి అంబుజ్ శర్మ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ '18ఏళ్లలోపు పిల్లలకు పెళ్లిళ్లు చేయడం జాతీయ అంశం. దీనిపై జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమే ఈ సదస్సు ముఖ్యఉద్దేశం' అని అన్నారు. చట్టం అమలులో అధికార సంస్థలు ఎదుర్కొనే సవాళ్లు, బాల్య వివాహాలను గుర్తించడం, రికార్డు, రిపోర్టు చేయడానికి గాను విధివిధా నాలపై చర్చించినట్టు శర్మ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకునే బాల్యవివాహాల్లో 40శాతానికిపైగా భారత్‌లో జరుగుతున్నాయని చెప్పారు. ప్రతిరోజూ 3600 బాల్య వివాహాలు చోటుచేసుకుంటున్నట్టు జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) డేటా ప్రకారం తెలుస్తోందని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఒక ప్రకటనలో పేర్కొంది. 2015లో 293, 2016లో 326 బాల్య వివాహాలపై ఫిర్యాదులు నమోదైనట్టు వెల్లడించింది. పశ్చిమబెంగాల్‌లో 40.7శాతం బాల్యవివాహాలు జరుగుతున్నట్టు జాతీయ కుటుంబ సర్వే-4లో తేలింది. అదేవిధంగా బీహార్‌లో 39.1శాతం, జార్ఖండ్‌లో 38శాతం, రాజస్థాన్‌లో 35.4 నమోదుకాగా పంజాబ్, కేరళలలో అతి తక్కువగా 7.6శాతం బాల్యవివాహాలు నమోదైనట్టు సర్వే పేర్కొంది. పదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే పంజాబ్‌లో 61.42శాతం, కేరళలో 50.65శాతం మేర బాల్య వివాహాలు తగ్గినట్లు తెలుస్తోంది. జార్ఖండ్‌లోని గొడ్డాలో అత్యధికంగా 63.5శాతం బాల్యవివాహాలు జరగగా, అదే రాష్ట్రంలోని గర్వాలో 58.8శాతం, రాజస్థాన్‌లోని భిల్వారాలో 57.2శాతం, పశ్చిమబెంగాల్‌లోని మాల్డాలో 54.8శాతం వివాహాలు నమోదయ్యాయి. 21.3శాతం బాల్యవివాహాలతో ఒడిశా 13వ స్థానంలో ఉంది. మల్కాన్‌గిరి, నబరంగపూర్, మయూర్‌భంజ్, కోరాపుట్, రాయ్‌గడ్, నయాఘర్, గంజమ్, కోయెన్‌ఝర్‌లలో బాల్యవివాహాల జాతీయ సగటు 26.8శాతంగా ఉన్నట్టు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రకటన వివరించింది. కర్ణాటకలో జరిగినట్లుగా బాల్యవివాహాలను రద్దుచేసేలా సంబంధిత చట్టాన్ని సవరించాలని ఒడిశా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఓఎస్‌సీపీసీఆర్) చైర్‌పర్సన్ కస్తూరీ మోహపాత్ర సూచించారు. ఒడిశా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ పధీ మాట్లాడుతూ 2005-06లో 37.2శాతం ఉన్న బాల్యవివాహాలు 2015-16 నాటికి 21.3శాతానికి తగ్గాయన్నారు. మహిళలు, బాలికల కోసం రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల ద్వారానే ఇది సాధ్యపడిందన్నారు. బాల్యవివాహాలను నివారించే ఉద్దేశంతోనే ఆయా పథకాలు, కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. గిరిజన బాలికలు విద్యను అభ్యసించేందుకు వీలుగా గిరిజన ప్రాంతాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా కొన్ని వందల వసతిగృహాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

## మైనార్టీ,దళితులపై బీజేపీ దురాగతాలు:ఎస్పీ

బలియా(ఉత్తరప్రదేశ్) :వెనుకబడిన తరగతులు, మైనార్టీలు, దళితులపై బీజేపీ దురాగతాలకు పాల్పడుతుందని సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది. బీజేపీ దౌర్జన్యాలపై దేశ వ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు ఎస్పీ తెలిపింది. కేంద్రంతో పాటు రాష్ట్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు ఆరెస్సెస్ ఆదేశాలనుసారం పనిచేస్తున్నాయిని సీనియర్ ఎస్పీ నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు రాం గోబింద్ చౌదరి విమర్శించారు. బీజేపీ దళిత వ్యతిరేకి అని మహారాష్ట్ర ఉదంతం తెలుపుతుందని ఆయన అన్నారు.

## రైస్ మిల్లు యజమాని అరెస్టు

న్యూఢిల్లీ : మనీ ల్యాండరింగ్ కేసులో రైస్ మిల్లు యజమానిని అరెస్టు చేసినట్టు ఈడీ తెలిపింది. రూ.3,871 కోట్ల బ్యాంకు కుంభకోణంలో ఆర్ఈఐ ఆగ్రో లిమిటెడ్ ఎండీ సందీప్ ఝుంఝున్‌వాలాను మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద అరెస్టు చేసినట్టు చేసింది. ప్రపంచంలోనే అత్యధికంగా బాస్మతి బియ్యంను ప్రాసెస్ చేసే కంపెనీ తమదేనని చెప్పుకునే ఆర్ఈఐ సంస్థపై 2016లో ఈడీ మనీ ల్యాండరింగ్ కేసును నమోదు చేసింది.

## ఇద్దరు మావోయిస్టుల కాల్చివేత

రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): ఛత్తీస్‌గఢ్‌లోని దట్టమైన అటవీ ప్రాంతమైన బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. మరణించిన వారిలో ఒక మహిళ కూడా ఉందని పోలీసులు తెలిపారు. భద్రత దళాల సంయుక్త బృందం ముదువండీ-కవడ్గాన్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు సెంట్రల్ పోలీసు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్(దక్షిణ బస్తర్ రేంజీ) పీ.సుందరాజ్ తెలిపారు.

## యూపీని తాకిన 'భీమ్' సెగలు

ముజఫర్‌నగర్ (ఉత్తరప్రదేశ్) : దళిత ఆర్మీ గ్రూప్ 'భీమ్'పై మహారాష్ట్రలో చెలరేగిన ఆందోళనల సెగ ఉత్తరప్రదేశ్ కూడా తాగింది. మహారాష్ట్రలోని దళితులపై జరిగిన హింసకు నిరసనగా ముజఫర్‌నగర్ కలెక్టరేట్ వద్ద భారీ సంఖ్యలో దళితులు శుక్రవారం ధర్నా చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. దళిత నేత వైభవ్ బావ్రా ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో రాష్ట్రపతి, జిల్లా మేజిస్ట్రేట్ పేర కలెక్టరేట్‌లో మెమొరాండం సమర్పించారు.

## హజ్ కోటా వివక్షపై కేంద్రానికి నోటీసు

న్యూఢిల్లీ : రాష్ట్రాల హజ్ కోటాపై వివక్ష చూపుతుందంటూ కేరళ హజ్ ప్యానెల్ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం.ఖన్‌విల్కార్ , జస్టిస్ డీవై. చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం రెండు వారాల గడువులో కేంద్రం తన ప్రతిస్పందన తెలియజేయాలని ఆదేశిస్తూ, విచారణను జనవరి 30కు వాయిదా వేసింది.

## రజనీ మంచోడు : ఏఆర్ రెహ్మాన్

చెన్నై(తమిళనాడు) : రజనీకాంత్ అంటే కేవలం మంచి మాత్రమేనని, ఆయన మంచికి మారు పేరని విశ్వవిఖ్యాత సంగీత దర్శకుడు, రెండు సార్లు ఆస్కార్ విజేత ఏఆర్.రెహ్మాన్ అన్నారు. డిసెంబర్31న తన రాజకీయ ప్రవేశం సందర్భంగా తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, కులమత ప్రస్థావన లేని ఆధ్యాత్మిక రాజకీయాలు అందిస్తానని తన అభిమానులకు వాగ్దానం చేశారు. ఆధ్యాత్మిక రాజకీయాలంటే 'నీతి నిజాయితీ-లౌకికత్వం'మని ఆయన మంగళవారం వివ రణ ఇచ్చారు. రజనీకాంత్ అంటే కేవలం మంచి మాత్రమేనని రెహ్మాన్ పేర్కొన్నారు.

## నలుగురు సజీవదహనం

అజంగఢ్(ఉత్తరప్రదేశ్) : అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సజీవదహనం అయ్యారు. గుడిసెకు మంటలు అంటుకోవడంతో నలుగురు చనిపోయారని, వారిలో ఇద్దరు పసివారు కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ దుర్ఘటన తెల్లవారు జామున 3 గంటలకు జరిగిందని, ఇంటి యజమాని 52ఏళ్ల రాంసాగర్, ఆయన భార్య ప్రభావతి(45), ఇద్దరు కుమార్తెలు చంద్రశీల(17), సంగీత(13)తో పాటు 6 పశువులు కూడా మంటల్లో కాలి బూడిదైయారని పోలీసులు తెలిపారు.

## జేఆర్‌హెచ్‌యూ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి

బందా(ఉత్తరప్రదేశ్) : జనవరి 8న చిత్రకూట్‌లోని జగద్గురు రాంభద్రాచార్య హ్యాండిక్యాప్డ్ యూనివర్సిటీ(జేఆర్‌హెచ్‌యూ)లో జరగనున్న 7వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి 579 విద్యార్థులకు మెడల్స్ అందజేస్తారని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యోగేష్ చంద్ర దూబే తెలిపారు. రాష్ట్రపతి పర్యాటనకు ఏర్పాట్లు పూర్తయాయని అడిషనల్ పోలీసు సూపరింటెండెంట్ బల్వంత్ చౌదరి పేర్కొన్నారు. జేఆర్‌హెచ్‌యూ దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే ఏకైక విశ్వవిద్యాలయ ఇదే.

## బీహార్‌లో కొత్త ప్రాజెక్టులు: నితీష్ కుమార్

సుపౌల్(బీహార్) : 'వికాస్ సమీక్ష యాత్రా' పథకంలో భాగంగా రూ.300 కోట్లతో 200 ప్రాజెక్టులను బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా రూ.36.91 లక్షలతో సోలార్ మినీ వాటర్ ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభిచామన్నారు. రాష్ట్రంలో మద్యనిషేధంతో పాటు శాంతి భద్రతలో విషయంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## విద్యుత్ విక్రయానికి సిద్ధం: మేఘాలయ సీఎం

షిల్లాంగ్(మేఘాలయ) : విద్యుత్‌ను విక్రయించే పూర్తి సామర్థ్యంలో రాష్ట్రం ఉందని మేఘాలయ ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా తెలిపారు. ఇతర రాష్ట్రాలకే గాక, పొరుగు దేశం బంగ్లాదేశ్ కూడా విద్యుత్‌ను విక్రయించేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. రీ భోయ్ జిల్లాలోని దెహల్‌లో రూ. 629 కోట్ల ఉంత్రూ జల విద్యుత్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తూ, విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రవ్యాప్తంగా అనువైన ప్రదేశాలు అనేకం ఉన్నాయన్నారు.

## హక్కుల నోటీసుపై త్వరలో నిర్ణయం: వెంకయ్య

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి బీజేపీ ఎంపీ భూపిందర్ యాదవ్ 'ప్రివిలేజ్ నోటీసు'ను అందజేసే విషయంపై అవసరమైన నిర్ణయాన్ని త్వరలో తీసుకోనున్నట్లు రాజ్యసభ ఛైర్మన్, ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తెలిపారు. అయితే ఈ అంశం లోక్‌సభ విస్తృతి కింద ఉందని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపై ఉద్దేశపూర్వకమైనది, హానికరం, అగౌరపరిచేది అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారని భూపిందర్ పేర్కొన్నారు.

## ఎన్నికల్లో 'స్వాభిమాన్ పక్ష్': నారాయణ్ రాణే

ముంబై(మహారాష్ట్ర): కాంగ్రెస్‌ను వీడి స్వంత పార్టీ 'మహారాష్ట్ర స్వాభిమాన్ పక్ష్' ఏర్పాటు చేసిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారాయణ్ రాణే సింధూదుర్గ్ జిల్లాలో ఎన్నికల బరిలో దిగనున్నట్లు తెలిపారు. తనకు త్వరలో దేవేంద్ర ఫడ్నవీస్ మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## జైళ్లలో మహిళా ఖైదీలపై కేంద్రం సర్వే

న్యూఢిల్లీ: దేశంలో సెంట్రల్ జైలులోని మహిళా ఖైదీలపై కేంద్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోంది. 144 సెంట్రల్ జైళ్లలోని మహిళా ఖైదీల పరిస్థితిపై కేంద్రంతో పాటు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సర్వేను నిర్వహిస్తున్నట్టు కేంద్ర మంత్రి మేనకా గాంధీ తెలిపారు.శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సర్వేలో భాగంగా ఎన్‌సీ డబ్ల్యూతోపాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు వివిధ జైళ్లకు ప్రశ్నాపత్రాలను పంపించినట్టు చెప్పారు. వివిధ డైరెక్టర్ జనరల్స్ (జైళ్లు), చీఫ్ సెక్రటరీలకు వాటిని పంపామని, ప్రశ్నోత్తరాలపై ఫిబ్రవరి 15 నాటికి బదులివ్వాలని వారికి సూచించినట్టు చెప్పారు.తర్వాత ఎన్‌సీడబ్ల్యూ బృందాలు జైళ్లను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సులు చేస్తాయని తెలిపారు. గతంలో పలు సర్వేల నివేదికలు తీసుకున్నట్టు చెప్పారు.

## 7 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విశాలాంధ్ర - ఏఎన్‌యూ : రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయం మేరకు ఏఎన్‌యూలో 60 అసిస్టెంట్ ఉద్యోగాల నియామకానికి గురువారం తొలి విడత నోటిఫికేషన్ గురువారం జారీ చేసిన అధికారులు శుక్రవారం రెండవ దఫా 7 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి మరో నోటిఫికేషన్ విడుదల చేశారు. విశ్వవిద్యాలయంలో శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయనున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరించనున్నారు. శుక్ర వారం నుంచి ఈ నెల 28 వ తేదీలోపు దరఖాస్తులను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి ఒకటో తేదీలోగా అందజేయాలి. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ గత ఏడాది విడుదల చేసిన జీవో 41 ప్రకారం 7 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రోస్టర్ పాయింట్లు నిర్ణయించారు. ఇంగ్లీష్ విభాగంలో-1 , హిస్టరీ అండ్ ఆర్కియాలజీ-1, లా-1, ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ -1, సోషియాలజీ అండ్ సోషల్ వర్క్-1, తెలుగు అండ్ ఓరియంటల్ లాంగ్వేజ్-1, స్టాటిస్టిక్ విభాగంలో-1 పోస్టులను భర్తీ చేయనున్నారు.



## పోలవరం ప్రాజెక్టులో ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ మిషన్లు సీజ్

విశాలాంధ్ర - పోలవరం : పోలవరం ప్రాజెక్టు పనుల్లోని ప్రధాన గుత్తేదారు ట్రాన్స్ ట్రాయ్ కంపెనీ మిషన్లను బాకీ చెల్లించలే దని దీనా బ్యాంకు అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ప్రాజెక్టు సందర్శన తరుణంలో ఈ ఘటన ఈ ప్రాంతంలో కలకలం సృష్టించింది. దీనా బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు శుక్రవారం ప్రాజెక్టులోని స్పిల్‌వే, స్పిల్ ఛానల్, డయాఫ్రమ్ వాల్ పనుల ప్రాంతంతోపాటు ప్రాజెక్టు అంతా తిరిగారు. డయాఫ్రమ్ వాల్ వద్ద రెండు వాల్యూం మెకింగ్‌లను, స్పిల్ ఛానల్ దగ్గర కొండ ప్రాంతం లో పనిచేస్తున్న మిషన్‌ను సీజ్ చేశారు. తాళాలను బ్యాంకు అధికారుల వద్ద పెట్టుకున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్‌ఈవో మోహన్ కుమార్, ఇరిగేషన్ ఈఈలు ఎంవీ సుధాకర్, ఎస్‌ఏ హుస్సేన్ సీజ్ చేసిన మిషన్ల వద్దకు చేరుకున్నారు. బ్యాంకు అధికారు లతో చర్చించారు. ఇది జాతీయ ప్రాజెక్టు అని, ప్రభుత్వ అనుసంధానంలో పనులు జరుగుతున్నందున మిషన్‌లను సీజ్ చేయడం సరికాదని చెప్పారు. సీజ్ చేయాలంటే కలెక్టర్ అనుమతులు తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. దీనిపై డీజీఎం మాట్లాడుతూ బ్యాంకుకు చెల్లించాల్సిన రుణం అంశంపై 4, 5 సంవత్సరాలుగా కోర్టులో వ్యాజ్యం నడుస్తున్నదని, కోర్టు తీర్పు ప్రకారం మిషన్లను సీజ్ చేశామని వివరణ ఇచ్చారు. అయినప్పటికీ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని వారు అక్కడ నుంచి బయలుదేరారు.

# ఉపాధికొచ్చి ప్రాణాలు కోల్పోయారు

- అశ్వని ఫిషరీస్ ప్రాసెసింగ్ కంపెనీ బస్సు బోల్తా
- ఇద్దరు ఒడిశా బాలికలు దుర్మరణం
- మరో 20 మందికి గాయాలు



విశాలాంధ్ర- భీమవరం : ఆడపిల్లలైనా పొట్ట చేతపట్టుకుని పొరుగు రాష్ట్రంలో పనికొచ్చారు. రూపాయి రూపాయి కూడబెట్టి కుటుంబానికి ఆసరాగా నిలుద్దామనుకున్నారు. మరో నాలుగు రోజుల్లో సంక్రాంతి పండక్కి తమ రాష్ట్రం ఒడిశా వెళ్లిపోతామన్న ఆనందంలో ఉన్న సమయంలో విధి వక్రీకరించి బస్సు ప్రమాదం మృత్యు రూపంలో కాటేసింది.

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం బస్సు బోల్తా కొట్టిన ప్రమాదంలో ఇద్దరు ఒడిశా బాలికలు మృతి చెందారు. మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటనతో తోటి ఉద్యోగులు కన్నీరుమున్నీరయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున భీమవరం కె.జి.ఆర్.ఎల్. కళాశాల సమీపంలో ప్రైవేటు బస్సు బోల్తా కొట్టిన ప్రమాదంలో ఒడిశా చెందిన ప్రైవేటు కంపెనీ కార్మికులు లైజ(18), సుందరి(21) ఘటనా స్థలిలోనే మృతి చెందారు. మరో 18 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను భీమవరం ఆస్పత్రికి తరలించారు. భీమవరం శివారు అశ్వని ఫిషరీస్ ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేస్తూ అర్ధరాత్రి విధులు ముగిసిన తర్వాత 40 మంది బాలికలు తాము నివసిస్తున్న భీమవరం హాస్టల్‌కు ప్రైవేటు ట్రావెల్స్ మినీ బస్సులో బయలుదేరారు. కాళీపట్నం లాకు దిగువన బస్సు అదుపు తప్పి పక్కనున్న పంట బోదెలో బోల్తా పడింది. రాత్రి వేళ విపరీతమైన మంచు కురుస్తుండటంతో వేగంగా వెళ్తున్న బస్సు అదుపు తప్పినట్లు తెలుస్తోంది. బస్సు డోర్ తెరిచి ఉండటంతో అందులో నుంచి కిందపడిన బాలికలు మృతి చెందినట్లు సమాచారం.

ప్రమాద సమాచారం అందుకున్న వేరే కంపెనీ యాజమా న్యం వెంటనే మరో బస్సు తరలించి క్షతగాత్రులను హాస్పటల్‌కు తరలించారు. తోటి ఉద్యోగులు మృతి చెందటంతో అశ్విని కంపెనీలో విషాదం అలము కుంది. మృతుల్లోని ఒకరి బంధువులు ఇక్కడికి చేరుకున్నప్పటికీ మరో మృతురాలి బంధువులు చేరుకోలేకపోవడంతో అధికారులు పోస్టుమార్టాన్ని శనివారానికి వాయిదా వేశారు.

### ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సులు



విశాలాంధ్ర-ఫిరంగిపురం : గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేములూరిపాడు గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ఆర్టీసీ బస్సులు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రయాణికులతోపాటు రెండు బస్సుల డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడ నుంచి వినుకొండకు వస్తున్న ఆర్టీసీ బస్సు, నర్సరావుపేట నుంచి గుంటూరు వస్తున్న నాన్‌స్టాప్ బస్సు వేములూరిపాడు సెంటర్ వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు ఉన్నప్పటికీ బస్సులు వేగంగా దూసుకొచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా నర్సరావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు రెండు బస్సులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



### కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ మూడేళ్లలో పూర్తి

విశాలాంధ్ర - కాకినాడ : కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణానికి నిధుల సమస్య లేదని, పనులు మొదలుపెట్టిన నాటి నుంచి మూడు సంవత్సరాల్లో ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్‌యాదవ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కోటిపల్లి-నర్సాపురం లైన్ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఈ లైన్ నిర్మాణంలో గౌతమి నదిపై బ్రిడ్జి నిర్మాణం కీలకమన్నారు. కాకినాడ టౌన్ స్టేషన్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు అన్ని ప్లాట్ ఫామ్‌లపై బోగి నెంబర్ల డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటుచేస్తామన్నారు. నాల్గవ ప్లాట్‌ఫామ్, మరో కాలిబాట వంతెన నిర్మాణం, ఎస్కలేటర్ సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు. కాకినాడ-పిఠాపురం రైల్వే లైన్ లాభసాటికాదని సర్వేలో తేలడంతో రైల్వేబోర్డు పక్కన పెట్టిందన్నారు. సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కోస్ట్‌గార్డ్‌లోకి కొత్త నౌక

విశాలాంధ్ర - ముత్తుకూరు : ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లోకి శుక్రవారం కొత్త నౌక వచ్చి చేరింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ ఇంటర్సెప్టర్ బోట్ (ఐబీ) సి -436 సముదాయంలో 36వ నౌకను కృష్ణపట్నం వద్ద ఏపీ చీఫ్ సెక్రటరీ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ కోస్టల్ గార్డ్ కమాండర్ డాక్టర్ ఏకే హర్బోలా హాజరయ్యారు. ఈ బోటును లార్సన్ అండ్ టుబ్రో లిమిటెడ్ కంపెనీ తయారుచేసింది. 27.80 మీటర్ల పొడవు కలిగిన ఈ నౌక 101 టన్నుల బరువు తరలించగలదు. జెట్ చోదక వ్యవస్థ సహాయంతో 45 నాట్ల గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తుంది. కోస్ట్ సెక్యూరిటీ ఆపరేషన్స్, సెర్చ్ అండ్ రెస్క్యూ, మందుల తరలింపు, కోస్ట్ గార్డ్ ఎయిర్‌క్రాఫ్టు, సాధారణ సమన్వయ పర్యవేక్షణ వంటి వివిధ రకాల పనులకు ఈ నౌకను వినియోగించుకునే వెసులుబాటు ఉంది. ఇంటర్సెప్టర్ బోట్ (ఐబీ) అసిస్టెంట్ కమాండెంట్ అంకుర్ బెనర్జీ దీనికి నేతృత్వం వహిస్తున్నారు. కమ్యూనికేషన్, నావిగేషనల్ పరికరాలు, కోస్ట్ గార్డ్ చార్టర్ అమలు కోసం తగినన్ని ఆయుధాలు ఓడలో ఉంటాయి. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ తీరప్రాంత భద్రతా చర్యల్లో సమన్వయం చాలా కీలకమన్నారు. రాష్ట్రంలో తీరప్రాంత భద్రతా దళాల సామర్థ్యం బలోపేతం అవుతుందన్నారు. తూర్పు తీర ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ తీరానికి సంబంధించి సముద్ర భద్రత, పర్యావరణ రక్షణ, తీర భద్రతను మరింత పెంచుతామన్నారు. పోర్టు సీఈవో అనిల్‌ఎండ్లూరి, పీఆర్ హెడ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్‌లో యువకుడు ఆత్మహత్య

- మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడు
- తల్లిదండ్రుల చెంతకు బాలిక
- రేపల్లె స్టేషన్‌లో ఘటన



విశాలాంధ్ర - రేపల్లె : గుంటూరు జిల్లా రేపల్లె పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడైన యువకుడు బాత్‌రూంలో ఉరివేసుకోవడం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం రేపల్లె మండలం గుడ్డికాయలంక గ్రామానికి చెందిన యరగళ్ళ శ్రీనివాసరావు(21) పట్టణానికి చెందిన 10వ తరగతి చదువుతున్న బాలికను డిసెంబర్ 30వ తేదీన స్కూల్ నుంచి కిడ్నాప్ చేశాడు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు కుమార్తె కనిపించటం లేదంటూ రేపల్లె పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మరు సటి రోజు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నగరం మండలం శిరిపూడి గ్రామంలో శ్రీనివాసరావు మైనర్ బాలికను వివాహం చేసుకు న్నట్టు సమాచారం అందుకున్న శ్రీనివాసరావు బంధువులు ఈ నెల 2వ తేదీన బాలికను తీసుకొచ్చి పట్టణ పోలీసులకు అప్పగించారు. అదే రోజు పోలీసులు బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రీనివాసరావుపై కిడ్నాప్ కేసు నమోదు కావటంతో అతని బంధువులు నాల్గవ తేదీ గురువారం సాయంత్రం అతనిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసు అధికారులు అందుబాటులో లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో బంధువులతో కొద్ది సమయం గడిపిన శ్రీనివాస రావు బాత్‌రూంలోకి వెళ్ళాడు. ఎంతసేపటికీ రాకపోవటంతో బంధువులు బాత్‌రూం తలుపు లు తట్టారు. తలుపు తీయకపోవటంతో పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో వారు తలుపులు పగులగొట్టి చూడగా ఉరివేసుకుని కనిపించారు. హుటా హుటిన స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గుంటూరు జిల్లా రూరల్ ఎస్పీ అప్పలనాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తెనాలి ఆర్డీవో జీ.నరసింహులు బంధువుల నుంచి సమాచారం సేకరించారు. గుంటూరు నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణుడు డాక్టర్ ఓలేటి శివకామేశ్వరరావు బృందం పోస్టుమార్టం నిర్వహించారు. బాపట్ల డీఎస్పీ డి.గంగాధరం, రేపల్లె రూరల్ సీఐ వీరాంజనే యులు, పట్టణ ఎస్ఐ రవీంద్రరెడ్డి, భట్టిప్రోలు ఎస్సై బాలానాగిరెడ్డి, నగరం ఎస్సై శివయ్య, తెనాలి సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులు ముందస్తుగా బందోబస్తు నిర్వహించారు.

# జన్మభూమికెళ్తున్న దళితులపై దాడి

- వెంటాడి కొట్టిన టీడీపీ అనుచరులు
- పది మంది దళితులకు గాయాలు
- విజయనగరం ఆస్పత్రికి తరలింపు
- మోదవలసలో ఉద్రిక్తత



విశాలాంధ్ర- డెంకాడ (విజయనగరం) : విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస గ్రామంలో శుక్రవారం జన్మభూమి గ్రామ సభలో అర్జీలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న దళితులపై టీడీపీ నేతలు దాడికి పాల్పడటం అలజడి రేపింది. ఇరువర్గాల ఘర్షణలో గాయపడిన ఆరుగురు దళితులను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రత్యర్థి గ్రూపునకు చెందిన వ్యక్తులు అడ్డుకొని మరోసారి దాడి చేశారు. ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద జన్మభూమి సభకు వెళ్లేందుకు కొందరు దళితులు ఒక ప్రదేశంలో కూర్చొని వినతిపత్రాలు రాసుకుంటున్నారు. అదే సమయంలో ఆ వీధి గుండా ద్విచక్రవాహనంపై వెళ్తున్న తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు యువకులు సభకు దళితులు రావద్దంటూ హెచ్చరించారు. దీంతో వీరి మధ్య మాటా మాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న మరికొందరు టీడీపీ కార్యకర్తలు దళితులపై దాడికి పాల్పడటంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ దాడిలో గ్రామానికి చెందిన దళితులు గంద్రేటి గణేష్, గంద్రేటి బంగార్రాజు, గంద్రేటి గౌరి, మిరప కుమార్, వసంత సంతోష్ భూషణ్‌రావు, పోలిపల్లి కాంతం గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 వాహనంలో జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. బాధితుల కుటుంబ సభ్యులు ఆటోల్లో విజయనగరం ఆస్పత్రికి తరలివెళుతుండగా మార్గ మధ్యంలో అల్లుపేట పెట్రోల్‌బంకు వద్ద సుమారు 25 మంది అడ్డుకొని కర్రలు, రాళ్లతో మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనలో గంద్రేటి సురేష్, ఊడికల బంగార్రాజు, మిరప సత్యం, ఊడికల సంతోష్‌కుమార్ గాయపడ్డారు. టీడీపీకి చెందిన ఎర్నింటి శ్రీను, ఎర్నింటి రాముకు గాయాలయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ముందుజాగ్రత్త చర్యగా గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎస్. కృష్ణవర్మ తెలిపారు. దళితులకు చెందిన భూమి సమస్య కొంతకాలంగా కోర్టులో పెండింగ్‌లో ఉందని, అయినా టీడీపీ నాయకులు ఆ భూమి పట్టాలను రద్దు చేయాలని చూస్తున్నారని దళితులు అంటున్నారు. తాము జన్మభూమి సభకు వెళ్తుండగా అడ్డగించి దాడి చేశారని టీడీపీకి చెందిన శ్రీను, రాము తెలిపారు.

**దళితులపై దాడి ఆటవిక చర్య**

మోదవలస దళితులపై ఎమ్మెల్యే అనుచరుల దాడి హేయమైన చర్య అని, తక్షణం దోషులను శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకా రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఇది ఆటవిక చర్య అని, ప్రభుత్వ వ్యతిరేక వైఖరికి అద్దం పడుతోందన్నారు. స్థానిక మహారాజా జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళితులను రమేష్‌బాబుతో పాటు వివిధ దళిత సంఘాల నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ నెల్లిమర్ల ఎమ్మెల్యేకు చెందిన 70 మంది అనుచరులు ఈ దాడికి పాల్పడ్డారన్నారు. దళితుడైన గణేష్ ఇంటిని ధ్వంసం చేయడంతోపాటు మరో ఆరుగురు దళితులను గాయపర్చారన్నారు. దాడికి పాల్పడిన కాగితాల సత్యనారాయణరెడ్డి, కర్రి రాము, కనకల వెంకటరమణ, ఎర్నింటి శ్రీను, మాని పైడయ్యలను వెంటనే అరెస్టు చేయకపోతే దళితులంతా కలిసి ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. పరామర్శించిన వారిలో దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఆదాడ మోహన్‌రావు, మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి తెరువల్లి శ్రీనివాసరావు, డీహెచ్‌పీఎస్ టౌన్ కన్వీనర్ గుర్రపు రాజు తదితరులు ఉన్నారు.

## అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్స్(మెయిన్స్) రివైజ్డ్ కీ

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్(ఏపీపీఎస్సీ) నిర్వహించిన ఏపీ ఎకనామిక్, స్టాటికల్ సబోర్డినేట్ సర్వీసెస్ విభాగంలోని అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్(మెయిన్స్) రాత పరీక్షల రివైజ్డ్ కీను శుక్రవారం విడుదల చేశారు.తొలుత ఈరాత పరీక్షకు కీను విడుదల చేశారు.కొన్ని ప్రశ్నలపై వచ్చిన అభ్యంతరాల్ని కమిషన్ పరిగణలోకి తీసుకుంది.రివైజ్డు కీను ఏపీపీఎస్సీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

**వెబ్‌సైట్లో గ్రూప్-3 వివరాలు**

ఏపీపీఎస్సీ వెబ్‌సైట్లో గ్రూప్-3(నోటిఫికేషన్ నంబరు-29/2016) మార్కులు, అభ్యర్థుల పూర్తి వివరాల్ని వెల్లడించారు.జిల్లాల వారిగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

## విమానంలో లైంగిక వేధింపులు

**న్యూయార్క్:** విమానాల్లో మహిళలపై లైంగిక వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇలాంటి ఘటనే జనవరి 3న లాస్‌వెగాస్ నుంచి డెట్రాయిట్ వెళుతున్న విమానంలో చోటు చేసుకున్నది. ఆ ప్రబుద్ధుడు భారత సంతతికి చెందిన వాడు కావడం విచారకరం. విమానంలో ఆ వ్యక్తి చెప్పకూడని పని చేశాడు. తన పక్క సీట్లో ఉన్న మహిళను లైంగి కంగా వేధించాడు. అసభ్యకరంగా ఒళ్లు తడుముతూ రాత్రంతా ఆమెను వేధించాడు. అతని పక్కనే భార్య కూడా ఉంది. ఈ ఘటనపై బాధితు రాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఫెడరల్ అథారిటీ అధికా రులు ఆ కామాంధుడిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ప్రభు రామమూర్తి అనే భారత సంతతి పౌరుడు అమెరికాలో తాత్కాలిక వీసాపై ఉంటు న్నాడు. అతడు జనవరి 3న భార్యతో కలిసి లాస్ వేగాస్ నుంచి డెట్రా యిట్‌కు బయలుదేరాడు. విమానంలో అతడి పక్క సీట్లో కిటికీవద్ద 22 ఏళ్ల యువతి కూర్చొని ఉంది. ఆమె ఆదమరిచి నిద్రపోతున్న సమ యంలో పక్కన కూర్చున్న ప్రభు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె దుస్తుల బటన్స్ సైతం తొలగించాడు. ఆ మహిళకు మెలకువ రాగానే తన దుశ్చర్యలను ఆపేశాడు. కంగారుగా ఆ మహిళ వెంటనే లోపల సిబ్బందికి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తన భార్యకు ఆ మహిళకు మధ్య ప్రభు కూర్చుని వేధింపులకు పాల్పడ్డాడు.

## మతవిద్వేషాలకు పాల్పడితే కఠిన చర్యలు

**బెంగళూరు:** మత విద్వేషాలను రెచ్చగొడితే కఠిన చర్యలు తీసుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దారా మయ్య శుక్రవారం హెచ్చరించారు. దక్షిణ కన్నడ జిల్లాలో హిందూ కార్యకర్తల హత్యలకు బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ), దాని అనుబంధ సంస్థ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ)లను నిషేధించాలని ప్రతిపక్ష బీజేపీ డిమాండు చేస్తున్న నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక్క పీఎఫ్ఐ మీదనే కాకుండా మత విద్వేషాలు రెచ్చగొడుతున్న అన్ని సంస్థలపై చర్యలు తీసు కుంటా మని ఆయన విలేకరులకు తెలిపారు.







# మారాజులకు ప్రేమతో..!

- అదనపు బోగీలన్నీ ఏసీ తరగతివే
- ప్రత్యేక రైళ్లకు కూడా అవే
- జనరల్ బోగీల ఊసేలేదు
- సామాన్యుల గోడు పట్టని రైల్వేశాఖ




**విశాలాంధ్ర బ్యూరో - అమరావతి:** సంక్రాంతి సెలవుల సందర్భంగా ప్రయాణీకుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక రైళ్లు, అదనపు బోగీలను ఏర్పాటు చేస్తామని చెబుతున్న రైల్వేశాఖ కేవలం ఒక వర్గానికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తోంది. దసరా, దీపావళి, కొత్త సంవత్సరం.. ఇలా వివిధ సందర్భాలను పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే సహా పలు జోన్లు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నాయి. అన్ని వర్గాలకు సమన్యాయం చేయాల్సిన రైల్వేశాఖ సాధారణ ప్రయాణీకుల పట్ల చిన్న చూపు చూస్తోంది. కేవలం ఉన్నత వర్గాలకే ప్రాధాన్యత ఇస్తూ ఏసీ తరగతి బోగీలను మాత్రమే పలు రైళ్లకు అదనంగా ఏర్పాటు చేసేందుకు చేపట్టిన చర్య లే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మధ్య తరగతి, సామాన్య ప్రయాణీకులు తమ గోడును అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ప్రత్యేక రైళ్లకు అదనపు చార్జీలను వసూలు చేస్తున్నందున ఆ భారం మోయలేనంతగా ఉందంటున్నారు. జనవరి 1 నుంచి 31 వరకూ 16 రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీటిలో ఒక్క జనరల్ బోగీ కూడాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు-వికారాబాద్ మధ్య నడిచే పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ చైర్‌కార్, హైదరాబాద్- నరసపూర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-త్రివేండ్రం శబరి ఎక్స్‌ప్రెస్‌లకు ఒక్కో 3 ఏసీ బోగీలు, సికింద్రాబాద్-విజయవాడ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ చైర్‌కార్, విజయవాడ- సికింద్రాబాద్, తిరుపతి-సాయి షిర్డీనగర్ మధ్య నిర్దేశించిన రోజుల్లో నడిచే ప్రత్యేక రైళ్లకూ 3 ఏసీ బోగీలను అమర్చడాన్ని ఉదాహరణగా పేర్కొంటున్నారు. పండుగ సందర్భంగా బుధవారం వెల్లడించిన వేరొక ప్రకటనలో తిరుపతి-విశాఖపట్నం, కాచిగూడ- విశాఖపట్నం, విశాఖపట్నం-తిరుపతి, తిరుపతి-కాచీగూడ, హైదరాబాద్-విశాఖపట్నం తదితర ప్రాంతాలకు 84 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటిలో తిరుపతి- విశాఖపట్నం-తిరుపతి మధ్య నడిచే నెంబరు 07487/07488 ఏసీ ఎక్స్‌ప్రెస్ పూర్తిగా 3 ఏసీ కోచ్‌లను కలిగి ఉండడమే కాకుండా జనవరి, ఫిబ్రవరి నెలల్లో మొత్తం 16 సర్వీసులుగా నడుపుతున్నారని చెబుతున్నారు. కాగా తాజాగా శుక్రవారం జారీ చేసిన ప్రకటనలో హైదరాబాద్-కాకినాడటౌన్-హైదరాబాద్, హైదరాబాద్- విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య నడుపుతున్న ప్రత్యేక రైళ్లకు సైతం అదనంగా 3 ఏసీ బోగీలనే ఏర్పాటు చేయడం గమనార్హం. ఉన్నతవర్గాల కోసం పూర్తి ఏసీ రైళ్ళతోపాటు ఏసీ తరగతి బోగీలు, స్లీపర్ తరగతి బోగీలను ఏర్పాటు చేస్తున్నారే కానీ ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్‌లకు ఒక్కటి కూడా జనరల్ బోగీని అమర్చకపోవడం దారుణమంటు న్నారు. కేవలం ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వకుండా సెకండ్ క్లాస్ టికెట్లపై మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణించేవారి సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన రైలు ప్రయాణీకులు సూచిస్తున్నారు. కొన్ని రైళ్లతో తక్కువ సంఖ్యలో జనరల్ బోగీలు ఉన్నందున కాలు మోపేందుకు కూడా చోటు ఉండదని, చివరకు మరుగుదొడ్లలో కూడా నలుగురైదుగురు చొప్పున సర్దుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉన్న విషయాన్ని అధికారులు గుర్తించాలంటున్నారు. తక్కువ దూరంతోపాటు సుదూర ప్రాంతాలకు నడిచే అనేక రైళ్లు19 నుంచి 20 బోగీలతో నడుస్తుందున ఒక్కో రైలుకు అదనంగా జనరల్ బోగీని ఏర్పాటు చేస్తే సామాన్యులకు ఎంతో వెసులుబాటుగా ఉండగల దన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అలాగే విజయవాడ-రాయగడ, విజయవాడ-కాకినాడ, నరస పూర్-గుంటూరు- ద్రోణాచలం, మచిలీపట్నం- విశాఖ పట్నం, కాకినాడ-తిరుపతి, విజయవాడ-హుబ్లీ, విజ యవాడ-బెంగళూరు కంటోన్మెంట్ మధ్య నడిచే ప్యాసిం జర్ రైళ్లలోనూ అదనంగా స్లీపర్ తరగతి బోగీలను అమ ర్చాలని కోరుతున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు కూడా రైల్వే బోర్డుతో సంప్రదింపులు జరపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నాలెడ్జ్‌హబ్‌గా రాష్ట్రం

- విద్యతోనే వికాసం
- 2019 చివరికి సంపూర్ణ అక్షరాశ్యత
- పిల్లల్ని కనండి....జనాభాను పెంచండి

చంద్రబాబునాయుడు



**విశాలాంధ్రబ్యూరో-విజయనగరం:** రాష్ట్రంలో జనాభా రోజు రోజుకూ తగ్గుతోందని, పిల్లల్ని కని జనసంఖ్యను పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణకు తానే పిలుపునిచ్చానని, ఇప్పటి పరిస్థితులను బట్టి తానే పిల్లలను కనమంటున్నానని అన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో శుక్రవారం నిర్వహించిన ఐదోవిడత జన్మభూమి- మా ఊరు సభలో ఆయన పాల్గొన్నారు. జన్మభూమిలో నాలుగోరోజు అంశమైన విద్య-వికాసంపై ముఖ్యమంత్రి సుదీర్ఘ ప్రసంగం చేశారు. మరికొద్ది రోజుల్లో రాష్ట్రాన్ని నాలెడ్జ్‌హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు విశ్వ విద్యాలయాలు ఏర్పాటయ్యాయని, మరికొన్ని రానున్నాయని చెప్పారు. విద్యార్థులకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జ్ఞానభూమి, ఎన్టీఆర్ విద్యోన్నతి తదితర పథకాలను వివరించారు. భవిష్యత్ అవసరాలను గుర్తించి ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీని నిర్మించానని, బాలికలకు విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కూడా తనదేనని అన్నారు. విద్యతో వికాసం కలుగుతుందని, ఆత్మస్థైర్యం లభిస్తుందని పేర్కొన్నారు. పిల్లలకు తల్లితండ్రులు ఇచ్చే వేలకోట్ల ఆస్తికంటే, మంచి విద్యే గొప్పదని అన్నారు. విద్యారంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా చేస్తామని, అఖిలభారతస్థాయి విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు మనవేనని చెప్పారు. 2019 చివరినాటికి సంపూర్ణ అక్షరా స్యతా రాష్ట్రంగా మారుస్తామని ప్రకటించారు. రెండేళ్లలో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం చాలా అవసరమని, టెక్నాలజీకి బానిస కావద్దని సూచించారు. ఫైబర్‌గ్రిడ్ ద్వారా కేవలం రూ.149 తోనే ప్రతి ఇంటికి 500 టీవీ ఛానెళ్లు, 24 గంటలూ ఇంట ర్నెట్, వైఫై సౌకర్యంతోపాటు 3 టెలిఫోన్ల నదుపాయాన్ని కూడా కల్పిస్తామని, ప్రతి ఇంటిని విజ్ఞానగనిగా మారుస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో దెయ్యాలు కూడా పింఛన్‌లు తీసుకునేవని, తాము ఆధునిక పరిజ్ఞానంతో అక్రమాలను పూర్తిగా అరికట్టామని చంద్రబాబు చెప్పారు. అనంతరం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమం తూతూ మంత్రంగా సాగింది. విద్యార్థులతో ముఖాముఖి పేరుతో ప్రభుత్వ కార్యక్రమాలను పొగడటానికే పరిమితం చేశారు. జన్మభూమి అసలు లక్ష్యమైన ప్రజా సమస్యల పరిష్కారం గానీ, వినతుల స్వీకరణ గానీ జరగలేదు. ఈ కార్యక్రమంలో మంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ్‌కృష్ణ రంగారావు, జెడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, కలెక్టర్ వివేక్‌యాదవ్, ఎమ్మెల్సీలు ద్వారపురెడ్డి జగదీష్, గాదె శ్రీనివాసులనాయుడు, మహిళా కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రచయితలకు గర్వకారణం విశాలాంధ్ర

### పుస్తకావిష్కరణ సభలో వక్తలు



**విశాలాంధ్ర-విజయవాడ(గుణదల) :** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పుస్తకాలు ప్రచురిస్తే ఆ పుస్తక రచయితలు ఎంతో గర్వంగా భావిస్తారని పలువురు వక్తలు వెల్లడిచారు. నగరంలోని స్వరాజ్య మైదానంలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీపీ సాహిత్య వేదికపై శుక్రవారం విశాలాంధ్ర ప్రచురించిన 'రసాయన మూలకాల రహస్యాలు', 'కుప్పిలి పద్మ కథలు', 'అభయారణ్యం', 'ప్రేమ్‌చంద్ కథలు' పుస్తకాలను పలువురు రచయితలు, ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకుడు గడ్డం కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజాభివృద్ధి, సమాజహితమే లక్ష్యంగా విశాలాంధ్ర ప్రచురణలు ఉంటాయన్నారు. గొప్ప గ్రంథాలు, సాహిత్య పుస్తకాలు వంటి విశేషమైనవే కాకుండా శాస్త్రవిజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను కూడా ప్రచురిస్తున్నామన్నారు. ఎంతోమంది రచయితలు తమ రచనలను పంపుతున్నారని వివరించారు. రసాయన మూలకాల రహస్యాలు పుస్తక రచయిత చట్టి శ్రీనివాసరావు మట్లాడుతూ ఇతర భాషల నుంచి అనువాద పుస్తకాలు మరిన్ని తెలుగులోకి రావాల్సి ఉందన్నారు. సాహిత్యం ఒక్కటే కాకుండా సైన్స్ పుస్తకాలను అనువాదం చేయాలన్నారు. ఉన్నత విద్యకు సంబంధించి తెలుగులో పుస్తకాలు లేవని , మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్ అభివృద్ధి చేసుకోవాలని వివరించారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందిస్తే మూఢనమ్మకాలు ఉండవని మానవజాతికి అవసరమైనవన్నీ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలోనే ఉన్నాయన్నారు. తనవంటి రచయితలకు అవకాశం ఇచ్చిన విశాలాంధ్రకు ధన్యావాదాలు తెలియజేస్తున్నానని తెలియచేశారు. 'కుప్పిలి పద్మ కథలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన సాహితీవేత్త కాకుమాను శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తకం చదవడం ద్వారా విశాలమైన ప్రపంచాన్ని చూడవచ్చని చెప్పారు. కుప్పిలి పద్మ రచనలు ఆలోచింపజేసే విధంగా ఉంటాయన్నారు. ప్రముఖ రచయిత్రి జి.లక్ష్మి రాసిన 'అభయారణ్యం' పుస్తకాన్ని సిదార్థ కళాశాల రీడర్, సాహితీవేత్త డాక్టర్ టి.కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్ణనలు లేకుండా, సూటిగా సరళమైన భాషలో రచనలు సాగించే రచయిత్రి లక్ష్మి అని, సమస్యనే కాకుండా పరిష్కారాన్ని కూడా ఆమె తన రచనల్లో తెలియజేస్తారని వివరించారు. 'ప్రేమ్‌చంద్ కథలు' పుస్తకాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమకు సహకరిస్తున్న రచయితలు, పాఠకులకు ధన్యవాదాలు తెలిపారు.

## మనిషిని మనిషిగా గుర్తించడమే లౌకికవాదం : హరగోపాల్

**విశాలాంధ్ర - తిరుపతి ఎస్వీయూ :** మనిషిని, మనిషిని గుర్తించి, గౌరవించడమే లౌకికవాద ప్రధాన లక్ష్యమని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మానవ హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ వ్యాఖ్యా నించారు. స్థానిక గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో గురువారం 'పిల్లపాళెం వాసుదేవరెడ్డి స్మారక గ్రంథాలయం వార్షికోవత్సవం' సందర్భంగా 'దేశ లౌకిక వ్యవస్థ పరిరక్షణ - కర్తవ్యం' అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ హర గోపాల్ మాట్లాడుతూ గతంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మానవ హక్కుల కేంద్రాన్ని యూజీసీ ద్వారా ఏర్పాటు చేశారని అందులో ఆయన ప్రధాన భూమిక పోషించి నట్లు గుర్తు చేసుకు న్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశంలోని మానవ హక్కు లు, మహిళా అధ్యయన, వివక్ష నిర్మూలన కేంద్రాల రద్దుకు సన్నహాలు చేస్తోందని దుయ్యబట్టారు. అప్రజాస్వామిక భావజాలంతో ప్రమాదం పొంచి ఉందని, మతోన్మాదం అత్యంత ప్రమాదకరమన్నారు. లౌకికవాద వ్యవస్థను ధ్వసం చేయడంతో వ్యక్తిగత భద్రతతో పాటు ముఖ్యంగా మహిళల భద్రత ప్రమా దంలో పడతుందని హెచ్చరించారు. లౌకికవాద విలువలను కాపాడడం కోసం ప్రజలు చైతన్యవంతులు కావాలని పిలుపు నిచ్చారు. మతానికి, మతోన్మాదానికి చాల వ్యత్యాసం ఉందని, మతం కేవలం విశ్వాసమని స్పష్టం చేస్తూ, మత విశ్వాసంపై ఆధారపడాలని, విద్వేషాలపై కాదని పేర్కొన్నారు. మహారాష్ట్ర రాష్ట్రంలో చోటు చేసుకున్న సంఘటన మానవ సమాజంలోని వివక్షకు ఉదాహరణగా నిలిచిందన్నారు. గతంలో ఎన్నడులేని విధంగా దళితులు నిర్వహించే కార్యక్రమంలో హింసను రేకెత్తించడం దురదృష్టకరమన్నారు. ఇంతకాలం లేని దాడులు ఇప్పుడు ఎందుకు జరుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు. మనిషిని మనిషిగా చూస్తే లౌకికవాదం పరిరక్షణ సాధ్యమౌతుందని, లౌకికవాదాన్ని మత దృష్టితో చూస్తే ఎన్నటికి లౌకికవాద పరిరక్షణ సాధ్యం కాదన్నారు. సమాజంలో మహిళలను తక్కువగా చూడ డం అనాగరికమన్నారు.

మహిళలు ప్రాణ కోటిని పెంచగలరని, అటువంటి మహిళకు సమాజంలో ఉన్నత స్థానం అందించాలని సూచించారు. మహిళలకు ప్రాణం విలువ తెలుసునని, దళితులు కూడా మనుషులే అనే చైతన్యం ప్రజలందరిలో రావాలన్నారు. మానవ సంబంధాలు మారినప్పుడే ప్రజల్లో చైతన్యం వస్తుందని, సమాన హక్కులు, సమాన అవకాశాలు సాధ్యం అవుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గంధమనేని శివయ్య మెమోరియల్ సోసైటి ఉపాధ్యక్షులు దేవేంద్రరెడ్డి అధ్యక్షత వహించారు.

## కిడ్నీ రాకెట్ నిందితులు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నరసరావుపేట సీఐ శివప్రసాద్ అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను రహస్యంగా విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ వ్యవహారంలో వైద్య పరీక్షలు ఒకచోట, అపరేషన్లు మరోచోట, రోగి ఒకచోట, రోగికి అవసరమైన కిడ్నీ దాత మరోచోట ఉండటం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. కిడ్నీ రాకెట్ ముఠాకు అండదండలు అందిస్తున్న వ్యక్తి అధికార పార్టీతో సంబంధాలు కలిగిన బడా వ్యాపారవేత్త కావటంతో ఈ కేసును పోలీసులు నీరుగారుస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ కిడ్నీ వ్యాపారానికి సంబంధించిన అనుమతులలో కొందరు రెవెన్యూ అధికారుల సహకారం ఉండబట్టే చట్టవిరుద్ధంగా కిడ్నీల ఆపరేషన్లు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు వ్యాపారంగా మార్చుకొని కోట్లాదిరూపాయిలు ఆర్జిస్తున్నట్లు సమాచారం. కిడ్నీ మార్పిడికి అనుమతిచ్చిన తహశీల్దార్...తన తప్పేమీ లేదని చెప్పుకేనేందుకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు భావిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఏ దరఖాస్తు అందినా వీఆర్వో, ఆర్ఐలు స్వయంగా దరఖాస్తుదారుని చిరునామాకు వెళ్లి పరిశీలించి నివేదిక ఇస్తారు. ఆ తర్వాతే తహశీల్దార్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. పైగా కిడ్నీ మార్పిడి లాంటి వ్యవహారాల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎవరు సిఫార్సు చేసినా తొందరపడి అనుమతులు మంజూరు చేయకూడదు. కానీ రాపూరి రవి పేరుతో ఆధార్‌కార్డు మార్ఫింగ్ చేసి దానికి పల్నాడుకు చెందిన మూడావత్ వెంకటేశ్వరనాయక్ ఫోటోను అంటించి తహశీల్దార్‌కు దరఖాస్తు చేయటం, తర్వాత తహశీల్దార్ వీఆర్ఓతోనే ధ్రువీకరించుకుని సర్టిఫికెట్ మంజూరు చేసే అంశంపైనే అందరూ దృష్టిసారించారు. ఈ సర్టిఫికెట్ జారీకి ముందుగానే రెవెన్యూ అధికారులు కిడ్నీరాకెట్ ముఠాతో కుమ్మక్కు అయ్యారనే అనుమానాలున్నాయి. పెద్దఎత్తున నగదు చేతుల మారినట్లు సమాచారం. అక్టోబరు 13వతేదీన జారీ చేసిన కిడ్నీ మార్పిడి ధ్రువీకరణపత్రం నకిలీదని తేల్చటానికి రెండు నెలల సమయం పట్టిందంటే అధికారుల పనితీరును ప్రశ్నించాల్సి ఉంది. కిడ్నీ అవసరమంటూ గుంటూరుకు చెందిన వేదాంత ఆసుపత్రిలో సర్టిఫికెట్ తీసుకున్న రోగి శివనాగేశ్వరరావు విజయవాడలో ఉన్న ఆయుష్ ఆసుపత్రికి వెళ్లి దేవరరాజుగట్టు గోపి అనే వ్యక్తి కిడ్నీతో ఆపరేషన్ చేయించుకోవటంపైనా అనుమానాలు తలెత్తుతున్నాయి. శివనాగేశ్వరరావుకు అనుమతి లభించినట్టు తెలిసినా వేరొక ఆసుపత్రిలో ఎందుకు కిడ్నీ మార్పిడి చేయించుకున్నారో అంతుచిక్కడం లేదు. ఆయుష్‌కు వెళ్లటంలో ఆంతర్యాన్ని పోలీసులు చేధించాల్సి ఉంది. ఈ తతంగంలో దళారులు ఉన్నట్లు తెలుస్తుంది.

**అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం : గుంటూరు రూరల్ ఎస్పీ**

నరసరావుపేట కిడ్నీ రాకెట్ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. ఎవరినీ వదిలేది లేదని గుంటూరు రూరల్ ఎస్పీ వెంకట అప్పలనాయుడు చెప్పారు.

# క్రీడలు
















## కోహ్లీ జాక్‌పాట్

- ఐపీఎల్-18లో రూ.17కోట్లకు దక్కించుకున్న ఆర్‌సీబీ
- ఇంత పెద్ద మొత్తం చెల్లించడం చరిత్రలో ప్రథమం

**2018 ఐపీఎల్ కోసం అట్టి పెట్టుకునే విధానంలో అత్యధిక మొత్తాన్ని దక్కించుకున్న టాప్-5 ఆటగాళ్లు**

| | | |
|---|---|---|
| 1. విరాట్ కోహ్లి | ఆర్‌సీబీ | రూ.17 కోట్లు |
| 2. ఎం.ఎస్. ధోనీ | సీఎస్‌కే | రూ.15 కోట్లు |
| 3. రోహిత్ శర్మ | ఎంఐ | రూ.15 కోట్లు |
| 4. స్టీవ్ స్మిత్ | ఆర్ఆం | రూ.12 కోట్లు |
| 5. డేవిడ్ వార్నర్ | ఎస్‌హెచ్ | రూ.12 కోట్లు |

ముంబై: ఐపీఎల్ అంటేనే అభిమానులకు పరుగులు, ఆటగాళ్లకు డబ్బుల పండగ. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ ద్వారా ఎందరో స్వదేశీ, విదేశీ క్రీడాకారులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న విషయం మనకు తెలిసిందే. ఈ ఏడాది ఇంకా ఐపీఎల్ టోర్నీ ప్రారంభానికి చాలా సమయం ఉంది. అంతలోనే మన రికార్డుల రారాజు, భారత పరుగుల యంత్రం విరాట్ కోహ్లి చరిత్ర సృష్టించాడు. ఇంతకీ అదేంటంటే.. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర చెల్లించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కింగ్ కోహ్లిని తిరిగి సొంతం చేసుకుంది. గరిష్ఠంగా రూ.17 కోట్లు చెల్లించి ఆర్‌సీబీ అట్టి పెట్టుకునే విధానంలో తిరిగి దక్కించుకుంది. సిక్సర్ల హీరో యువరాజ్ సింగ్ కోసం 2015లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ అత్యధికంగా రూ.16 కోట్లకు వేలంలో పాడుకుంది. ఆ తర్వాత 2017 సీజన్ కోసం నిర్వహించిన వేలంలో ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ బెన్‌స్టోక్స్ రూ.14.5కోట్లు చెల్లించిన సంగతి తెలిసిందే. కోహ్లి ధర రూ.15 కోట్లు ఉండగా ఆర్‌సీబీ మరో రూ.2కోట్లు అదనంగా చెల్లించి మొత్తం రూ.17 కోట్లకు అతన్ని సొంతం చేసుకుంది. 10ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ఒక్క ఆటగాడికి ఫ్రాంఛైజీలు ఇంత మొత్తాన్ని ఖర్చు చేయలేదు.

## ఎందుకు అడుక్కుంటున్నారు?



మియాందాద్

న్యూఢిల్లీ: ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా దాయాది దేశం భారత్ తమతో క్రికెట్ ఆడాలని పాక్ పదేపదే అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ), పలు సమావేశాల్లో కోరుతున్న నేపథ్యంలో ఆదేశ మాజీ క్రికెటర్, కోచ్ జావెద్ మియాందాద్ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ)కి పలు సూచనలు చేశాడు. స్వదేశంలో క్రికెట్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పాక్ తరపున 124 టెస్టులాడిన మియాందాద్ కరాచిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ అన్నాడు. 'వాళ్లు(ఇండియా) మనతో ఆడాలనుకోవట్లేదు. భారత్‌తో ఆడకపోయినంత మాత్రాన మన(పాక్) క్రికెట్ చచ్చిపోదు. ఆ విషయం గురించి ఇక మర్చిపోవాలి. ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా తమతో మ్యాచ్‌లు ఆడాలని బీసీసీఐని అడుక్కోవాల్సిన అవసరం లేదు. 10ఏళ్ల నుంచి మనతో మ్యాచ్‌లు ఆడలేదు. అయితే ఏం? మన క్రికెట్‌కు ఏమైనా నష్టం వాటిల్లిందా? లేదు మనం ఇంకా చాలా బాగా రాణించాం. చాంపియన్స్ ట్రోఫీ గెలవడమే దానికి ఓ ఉదాహరణ. 2009 నుంచి సొంతగడ్డపై అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగకపోయినప్పటికీ నిలదొక్కుకోగలిగాం' అని ఈ సందర్భంగా మియాందాద్ పేర్కొన్నాడు. భారత్, పాకిస్థాన్ మధ్య 2012 నుంచి ఎలాంటి ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లు జరగలేదు. అంతర్జాతీయ టోర్నీల్లో మాత్రమే పాల్గొంటున్నాయి. 2008 ముంబై దాడుల తర్వాత ఇరు దేశాల మధ్య అంతరం పెరిగింది. సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన, సీమాంతర ఉగ్రవాదానికి చరమగీతం పాడినప్పుడే పాక్‌తో క్రికెట్ ఆడుతామని ఇటీవల భారత విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

## బెంబేలెత్తించిన భువీ



- రాణించిన బౌలర్లు
- 286 పరుగులకు ప్రొటీస్ ఆలౌట్
- తడబడిన భారత్ 'బ్యాటు'
- ప్రస్తుతం 28/3

**దక్షిణాఫ్రికాలో భారత్ శుభారంభం చేసింది. తొలి ఇన్నింగ్స్ మొదటిరోజునే ప్రొటీస్‌ను నిలువరించింది. పేసర్ భువనేశ్వర్ కుమార్ నిప్పులు చెరిగే బంతులతో బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించాడు. ఫలితంగా మొదటి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 286 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ మొదలు పెట్టిన టీమిండియా తడబడింది. ఇన్నింగ్స్ ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసింది.**

కేప్‌టౌన్: టీమిండియాతో న్యూలాండ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 286 పరుగులకు ఆలౌటైంది. టీమిండియా బౌలర్లు విజృంభించడంతో తొలి రోజు పూర్తిగా ఆడకుండానే సఫారీలు చాపచుట్టేశారు. టీమిండియా బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ నాలుగు వికెట్లతో సత్తాచాటగా, రవిచంద్రన్ అశ్విన్ రెండు వికెట్లు సాధించాడు. ఇక హార్దిక్ పాండ్యా, షమీ, బూమ్రాలకు తలో వికెట్ దక్కింది.

**ఆదిలోనే హంసపాదు**

దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో ఏబీ డివిలియర్స్(65, 84 బంతుల్లో 11 ఫోర్లు), డు ప్లెసిస్(62, 104 బంతుల్లో 12 ఫోర్లు)లు హాఫ్ సెంచరీలు చేయగా, డీ కాక్(43బీ, 40 బంతుల్లో 7ఫోర్లు), మహరాజ్(35, 47 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్) ఫర్వాలేదనిపించారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన సఫారీలకు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భారత ప్రధాన పేసర్ భువనేశ్వర్ కుమార్ వరుస ఓవర్లలో ముగ్గురు కీలక ఆటగాళ్లను పెవిలియన్‌కు పంపి శుభారంభాన్ని అందించాడు. భువీ వేసిన తొలి ఓవర్‌లో డీన్ ఎల్గర్‌ను డకౌట్‌గా అవుట్ చేయగా, మూడో ఓవర్‌లో మర్క్రమ్(5)ను పెవిలియన్‌కు పంపాడు. ఐదో ఓవర్‌లో హషీమ్ ఆమ్లా(3)ను భువీ అవుట్ చేయడంతో దక్షిణాఫ్రికా 12 పరుగులకే మూడు వికెట్లను నష్టపోయి కష్టాల్లో పడింది.

**కెప్టెన్ మరమ్మతులు**

ఆ తరుణంలో ఏబీ డివిలియర్స్-డుప్లెసిస్ జోడి మరమ్మతులు చేపట్టింది. ఈ జోడి నాలుగో వికెట్‌కు 114 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేయడంతో దక్షిణాఫ్రికా తేరుకుంది. అయితే 16 పరుగుల వ్యవధిలో ఏబీ, డు ప్లెసిస్‌లు అవుట్ కావడంతో సఫారీలకు మరోసారి షాక్ తగిలింది. కాగా, డీకాక్-ఫిలిండర్(23)ల జోడీ 60 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేసి రెండొందల మార్కునే దాటించారు. ఇక చివర్లో రబడా(26, 66 బంతుల్లో 1 సిక్సర్) సమయోచితంగా ఆడటంతో సఫారీలు 250 పైగా పరుగుల్ని నమోదు చేయగలిగారు.

**తడ'బ్యాటు'**

అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియాకు ఫిలాండర్ షాకిచ్చాడు. 17 బంతులు ఆడిన మురళీ విజయ్ ఫిలాండర్ బౌలింగ్‌లో ఎలగర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం ధాటిగా ఆడుతున్న శిఖర్‌ధావన్‌ను స్టెయిన్ అవుట్ చేశాడు. క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా అతి తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు.



**స్కోరుబోర్డు :**

**సౌతాఫ్రికా**

ఎలగర్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 0, మర్క్రమ్ (ఎల్‌బీడబ్ల్యూ) (బి) భువనేశ్వర్ 5, ఆమ్లా (సి) సాహా (బి) భువనేశ్వర్ 3, ఏబీ డివిలియర్స్ (బి) బూమ్రా 65, డుప్లెసిస్ (సి) సాహా (బి) హార్దిక్ పాండ్యా 62, డీకాక్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 43, ఫిలాండర్ (బి) షమీ 23, కేశవ్ మహరాజ్ రనౌట్ (అశ్విన్) 35, రబడ (సి) సాహా (బి) అశ్విన్ 25, స్టెయిన్ నాటౌట్ 15, మోర్కెల్ ఎల్‌బీడబ్ల్యూ (బి) అశ్విన్ 2, మొత్తం : 286 (10 వికెట్లకు)

**భారత్ :**

మురళీ విజయ్ (సి) ఎలగర్ (బి) ఫిలాండర్ 1, శిఖర్ ధావన్ (సి&బి) స్టెయిన్ 16, ఛతేశ్వర్ పుజారా నాటౌట్ 5, విరాట్ కోహ్లి (సి) డీకాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ శర్మ బ్యాటింగ్ 0, మొత్తం : 3 వికెట్లకు 28

## అరంగేట్రం టెస్టులోనే వికెట్



కేప్‌టౌన్: భారత యువ బౌలర్ బుమ్రా అరంగేట్ర టెస్టు మ్యాచ్‌లోనే దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్ వికెట్ దక్కించుకున్నాడు. లంచ్ విరామం తర్వాత ప్రారంభమైన కొద్ది సేపటికి బుమ్రా వేసిన ఇన్నింగ్స్ 33వ ఓవర్ ఆఖరి బంతికి ఏబీడీ బౌల్డ్ అయ్యాడు. దాదాపు గంట నుంచి భారత బౌలర్లు వికెట్ కోసం శ్రమించారు. క్రీజులో పాతుకుపోయిన డివిలియర్స్, డుప్లెసిస్ జోడీని 114 పరుగుల భాగస్వామ్యం వద్ద విడదీశాడు. అనంతరం 35వ ఓవర్‌లో డుప్లెసిస్ కెరీర్‌లో 16వ అర్ధశతకం సాధించాడు.

## రెజ్లర్ సుశీల్‌కు డబ్ల్యూఎఫ్ఐ నోటీసులు



న్యూఢిల్లీ: భారత్‌కు రెండు ఒలింపిక్ పతకాలు అందించిన స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్‌కు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) నోటీసులు జారీ చేసింది. డిసెంబరు 29న కామన్వెల్త్ క్రీడల రెజ్లింగ్ సెలక్షన్ ట్రయల్స్ సందర్భంగా సుశీల్, మరో రెజ్లర్ రాణా మద్దతుదారుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై వివరణ కోరుతూ డబ్ల్యూఎఫ్ఐ తాజాగా సుశీల్‌కు నోటీసులు జారీ చేసింది. ఘర్షణపై పర్వీన్ రాణా డబ్ల్యూఎఫ్ఐను ఆశ్రయించాడు. దీనికి స్పందించిన అధికారులు మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని లేదంటే తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంటూ సుశీల్‌కు నోటీసులు జారీ చేశారు.

## స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతులు



విశాలాంధ్ర - అమరావతి: సచివాలయం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యాన్యువల్ స్పోర్ట్స్ మీట్-2017 విజేతలకు శుక్రవారం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, టూరిజం శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్‌మీనా బహుమతులు అందజేశారు. క్రికెట్, రన్నింగ్, షటిల్ తదితర పోటీలలో పురుష, మహిళా విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. నూతన రాష్ట్రంలో మొదటిసారిగా నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల క్రీడా పోటీలను విజయవంతం చేసినందుకు ముఖేష్ కుమార్ మీనా అభినందనలు తెలిపారు. మరో అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విన్నర్స్‌గా, రన్నర్స్‌గా నిలవడం కంటే క్రీడల్లో పాల్గొనడం ముఖ్యమన్నారు. క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులను ఆయన అభినందించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ఉద్యోగులు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్-2016లో కాంస్య పతకం సాధించిన కె. వెంకట్రావు, సౌత్ ఏషియన్ వెటరన్ టేబుల్ టెన్నీస్‌లో రజత పతకం సాధించిన బి.సుజాతలను సభకు పరిచయం చేశారు. నూతన రాష్ట్రంలో తొలి స్పోర్ట్స్ మీట్ విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సంఘం క్రీడల విభాగం జాయింట్ సెక్రటరీ ఎన్.ఎస్.పవన్ కుమార్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో, విజయవాడ ఐజీఎం స్టేడియంలో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు 4 రోజుల పాటు స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ఉద్యోగులు దాదాపు 700 మంది వరకు పాల్గొంటారన్నారు. సచివాలయం 6 బ్లాకుల్లోని మహిళ, పురుష ఉద్యోగులను 4 గ్రుపులుగా, 31 టీమ్స్‌గా విభజించి మొత్తం 61 ఈవెంట్లలో పోటీలు నిర్వహించినట్లు వివరించారు.

## టాప్‌లేపిన స్పిన్నర్లు

న్యూఢిల్లీ: గడిచిన ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో బ్యాటింగ్ పరంగా చూస్తే భారత కెప్టెన్ విరాట్ కోహ్లి, ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌లు పరుగుల వరద సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే 2017 స్పిన్నర్లకు కూడా బాగా కలిసొచ్చింది. కచ్చితంగా చెప్పాలంటే గతేడాది స్పిన్నర్స్‌కు సూపర్ ఇయర్‌గా నిలిచింది. టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా స్పిన్నర్లు రెచ్చిపోయి వికెట్లు సాధించారు. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో ఆరు వందలకు పైగా వికెట్లు సాధించిన ఘనతను స్పిన్నర్లు మొదటిసారి తమ ఖాతాలో వేసుకున్నారు. 2017లో స్పిన్నర్లు సాధించిన టెస్టు వికెట్లు 638. ఫలితంగా గతేడాది స్పిన్నర్లు సాధించిన అత్యధిక వికెట్ల రికార్డు(584)ను బద్దలు కొట్టారు. ఓవరాల్‌గా స్పిన్నర్లు ఐదు వందలకు పైగా సాధించింది కేవలం ఐదుసార్లు మాత్రమే. 2001లో 521 టెస్టు వికెట్లను తీసిన స్పిన్నర్లు.. 2004లో 577 వికెట్లు సాధించారు. ఇక 2015లో 554 వికెట్లను తమ ఖాతాలో వేసుకున్నారు. గతేడాది అత్యధిక వికెట్లు సాధించిన స్పిన్నర్ల జాబితాలో నాథన్ లయాన్(63), అశ్విన్(56)లు తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

## థామస్‌ను తక్షణం అరెస్టు చేయాలి

### సీపీఐ కార్యదర్శి నారాయణ డిమాండు



న్యూఢిల్లీ: రాజకీయ వ్యవస్థను అవమానించే రీతిలో మాట్లాడిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కేటీ థామస్‌ను తక్షణం అరెస్టు చేసి, క్రిమినల్ కేసు పెట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ డిమాండు చేశారు. ఈ దేశాన్ని ఆర్మీ, ఆర్ ఎస్ఎస్ వారే కాపాడుతున్నారంటూ థామస్ చేసిన వ్యాఖ్యలపై నారాయణ శుక్రవారం స్పందించారు. ఈ వ్యాఖ్యలు చేసిన థామస్‌కు కాపిటల్ పనిష్మెంట్ ఇవ్వాలన్నారు. దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను, రాజకీయ వ్యవస్థలను అవమానపరిచే విధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఈ దేశాన్ని ఆర్మీ, ఆర్ఎస్ఎస్ వారే కాపాడుతున్నారని చెప్పడమంటే యావత్ రాజకీయ వ్యవస్థను అవమానించినట్టు కాదా? అని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ చరిత్ర పుట్టినది మొదలు మతోన్మాదాన్ని పెంచిపోషించడమేనని నారాయణ విమర్శించారు. గాంధీమహాత్ముడిని కాల్చిచంపిన గాడ్సే ఆర్ఎస్ఎస్ నాయకుడు, బాబ్రీమసీదు కూలగొట్టినది ఆర్ఎస్ఎస్ నాయకుడు, గోవధ నిషేధం, బీఫ్ పేరుతో మైనారిటీలు, దళితులను హింసిస్తున్నారని, తలతీస్తే కోటి రూపాయలు ఇస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నారని అన్నారు. విచ్ఛిన్నకర పాత్ర వహిస్తూ, లౌకికవాదాన్ని దెబ్బతీస్తూ మైనారిటీలకు రక్షణ లేకుండా చేస్తున్న ఆర్ఎస్ఎస్ దేశాన్ని కాపాడుతుందా? అని నారాయణ ప్రశ్నించారు. ఆర్మీ దేశాన్ని కాపాడుతుందంటే మళ్లీ మిలటరీ నియంతృత్వం రావడమేనన్నారు. మరి రాజకీయ వ్యవస్థ ఏమైంది, బీజేపీ ఆలోచించాలన్నారు. బీజేపీ ఒక రాజకీయ పార్టీ అని థామస్ తన వ్యాఖ్యలతో బీజేపీతో సహా అన్ని రాజకీయపార్టీలను, రాజకీయ వ్యవస్థను అవమానపరిచారని నారాయణ అన్నారు.

## అమర్త్యసేన్ డాక్యుమెంటరీకి గ్రీన్ సిగ్నల్



కోల్‌కతా: నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ డాక్యుమెంటరీకి సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్(సీబీఎఫ్‌సీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత ఏడాది జూలైలో బోర్డు ప్రాంతీయ కార్యాలయం అభ్యంతరం వ్యక్తం చేసిన నాలుగు పదాలతో సహా తాను రూపొందించిన మొత్తం డాక్యుమెంటరీ విడుదలకు సీబీఎఫ్‌సీ అంగీకరించిందని జాతీయ పురస్కార విజేత డైరెక్టర్ సుమన్ ఘోష్ శుక్రవారం తెలిపారు. హిందు, హిందూత్వ, గుజరాత్, గోవు వంటి నాలుగు పదాలకు బీప్ శబ్దాన్ని ఉంచాలని సీబీఎఫ్‌సీ కోల్‌కతా జారీ చేసిన ఆదేశాన్ని దర్శకుడు తిరస్కరించడంతో గత ఏడాది ఈ గంటన్నర నిడివి గల డాక్యుమెంటరీ వివాదాస్పదమైంది. 'సీబీఎఫ్‌సీ చైర్మన్ ప్రసూన్ జోషి తన బోర్డు సభ్యులతో కలిసి 'ద ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్' డాక్యుమెంటరీని గురువారం ముంబైలో వీక్షించారు. అనంతరం డాక్యుమెంటరీలోని ఆ నాలుగు పదాలకు అనుమతి ఇచ్చారు. తర్వాత జోషి తనతో జరిపిన చర్చల్లో డాక్యుమెంటరీకి ఎటువంటి కట్స్ చెప్పడం లేదని పేర్కొన్నారు' అని ఘోష్ ఇక్కడ తెలిపారు. ఈ అంశంపై బోర్డు నుంచి ఒక లిఖిత పూర్వక సమాచారం వస్తుందని డైరెక్టర్ సుమన్ ఘోష్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా మితవాద జాతీయ వాదం పెరగడం. తత్వశాస్త్రం, ఆర్థికాభివృద్ధి, సామాజిక ఎంపిక సిద్ధాంతంపై అమర్త్యసేన్ మాట్లాడిన ఈ చిత్రాన్ని 2002, 2017 సంవత్సరాలలో రెండు భాగాలుగా చిత్రీకరించారు. 'కళలల్లో వాక్ స్వాతంత్ర్యాన్ని సీబీఎఫ్‌సీ గౌరవించడం నాకు సంతోషం కలిగించింది. నా డాక్యుమెంటరీ ద్వారా నోబెల్ గ్రహీత గురించి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని జోషి నాతో చెప్పారు' అని ఘోష్ వివరించారు. ఇదిలా ఉండగా, ఈ అంశాన్ని చైర్మన్ పరిశీలిస్తున్నారని, దీనిపై బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఇప్పుడే ఏమీ చెప్పలేదని సీబీఎఫ్‌సీ కోల్‌కతా వర్గాలు తెలిపాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.